# మున్సిపల్

కథలు

డా॥ దీర్ఘాసి విజయభాస్కర్

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

# Municipal

*Stories*

by **Dr. Deerghasi Vizai Bhaskar**

Cell : 94943 66698
Email : vizaibhaskardeerghasi@gmail.com

© Writer

| | | |
|---|---|---|
| Cover Design | : | Sri Gulona, Srikakulam |
| First Edition | : | April 2022 |
| For Copies | : | Dr. Deerghasi Vizaibhaskar<br>LIGH No: 127/2RT<br>Near Andhra Bank<br>Vijayanagar Colony<br>Hyderabad-500 057<br><br>Palapitta Books<br>16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>Cell: 9848787284<br>palapittabooks@gmail.com<br><br>Navachetana, Prajasakti, Navatelangana,<br>Navodaya Book Centers |
| Printed at | : | Karshak Art Printers<br>Vidyanagar<br>Hyderabad |
| Price | : | Rs. 150/- |

# పురపాలక వింతల,చింతల, కతలు
# చూడర బాబూ!

ఓ మూడుకర్రల స్టాండ్ మీద ఓ డబ్బా...డబ్బాలోపల బొమ్మలు...! రీలు తర్వాత రీలు తిరిగేసీది. భవంతులూ, బజార్లూ, సిన్మాహాల్లూ పట్నంలో వింతలూ, విడ్డూరాలు...! సూడర బాబూ సూడు, కాశీపట్నం చూడరబాబూ, కళ్లు పట్టని వింతలు చూసి తరించరా అని పిలిచీవోడు. చూసి తరించీవోళ్లం...గానీ జేబులోని డబ్బులుకి గాలొచ్చేది!

డబ్బా రీలులో పట్నం చూడ్డానికే జేబుకి కన్నమయిాది, మరి రియల్‌గా పట్నంల బతకాలంటే జేబుకే కాదు బతుక్కే కన్నమవతాదని తరాత్తరాత పట్నం బతుకు మనకు చెప్పిందనుకోండి,అది యేరే కత! అదిగో ఆ వేరే కతల్ని ఈ 'మున్సిపల్ కతలు' సంపుటి చెప్తాయి!

డబ్బాలో సూపిన పట్నమూ, బజారూ, భవంతులూ, వింతలూ, విడ్డూరాలూ అన్నీ బయటకి మన కళ్లకి కనబడీవే గానీ కంటికి కనబడనివి, చెవులకి వినబడనివి, మనసుకి యెరుక కాని వనేకానేకం మున్సిపాలిటీ గోడల వెనక చీకటిలోనా వెలుగులోనా జరగతాయి! అవన్నీ మనకెరుక గావు! సరిగా ఈ కథా సంపుటిలోని కతలు మనకు కనబడని మున్సిపాలిటీల ముసుగులు తీసీసి – ఇదిగిదీ తిత్తవర్రా మున్సిపాలిటీలదని మాసెడ్డ యిదిగా మున్సిపాల్టీల మానం తీసీసి మనకు యెరుక పరస్తాయి!

అధికార్లే డేంజరనుకుంటే...రచయితలయిన అధికార్లు పరమడేంజరుగాళ్లని అన్పిస్తాది కొందరికి యీ కతలు సదివితే! 'ఏ సిరాతో యీ చరిత్ర రాసేర'నేదో సినిమా టైటిలనుకుంతానుండీది. విజయభాస్కర్‌గారు యే సిరాతో యీ కతలు రాసేరనడగాలనిపిస్తాంది! అధికారిగా ఆకుపచ్చ సిరాతో రాసిన రాతల యెనకనున్న గుట్టులూ, భోగట్టాలను రచయితగా నల్లసిరాతో రట్టు చేసారు! ఇరవయ్యొక్క కథల్లో బొమ్మగట్టి చూపేరు మున్సిపాలిటీ వ్యవస్థ తీరుతెన్నుల్ని! బహుశా ఒక వ్యవస్థకు సంబంధించి యింత విస్తృతంగా కథనం చేయడం నాకు తెలిసి

విజయభాస్కర్ గారే మొదటివారనుకుంటా! వైద్యరంగం, శాంతిభద్రతల రక్షణరంగం, న్యాయవ్యవస్థ యిలా ప్రజల జీవితాల మెరుగు కోసం లేదా ప్రజల ప్రయోజనాల కోసం యేర్పడ్డ వ్యవస్థల తీరుతెన్నుల మీద, వాటి వికృత పరిణామాల మీద కథలు వచ్చేయి. గానీ మున్సిపాలిటీ అనే ఒక పట్టణ పరిపాలక వ్యవస్థ మీద దాదాపు అన్ని కోణాల మీదా కథలు రావడం యిదే మొదటిసారి. పట్టణాల లోని కాలువలు, రోడ్లు, నీటి సరఫరా పైపులు, బజార్లు, ఇంజనీరింగ్ విభాగం, శానిటరీ విభాగం, వివిధ నిర్మాణాలకు జారీ చేసే లైసెన్స్‌లు వగైరాలూ నిర్వహించే సిబ్బందీ, అధికార్లే గాక వీటన్నిటినీ పర్యవేక్షించే, నిర్దేశించే కౌన్సిలర్లూ, చైర్మన్లూ కొసకు మున్సిపాలిటీలను యెలా వికృతీకరించుతుంటారో విజయ భాస్కర్‌గారు దాదాపు కథాసంపుటిలో గొప్ప శిల్పనైపుణ్యంతో, అద్భుత కథన కౌశలంతో కథనం చేసారు.

ఊరికి నడివయసొస్తే మున్సిపాలిటీ అవతాదట! ఆ మునిసిపాలిటీ నడివయసు సిత్రాలూ, ఇసిత్రాలూ, కుట్రలూ, కుతంత్రాలూ; సీకట్లో యెలా గుంతాయి, వెలుగులోన యెలాగ మెరస్తాయి, మున్సిపాల్టీ కాలవలు, కాలువలను వదలని దోమలు, పందులు, రోడ్లు, కొలాయిలు, వీధిలైట్లు, బజార్లు,బజార్లను వదలని ఈగలు, ఈగల్లాటి మనుషులు, కళాసులు, కక్కూసులు కడిగే వోళు, కాలే కడుపుల మనుషులు, మనుషుల చేతిలోని ఓట్లని వేటాడినోళ్లు, పట్టు పరుపుల మీద నిద్రపట్టనోళ్లు, నోట్లకట్టల మీద తిరుగాడే వోళ్లు, ఫైళ్లల్లో యిరుక్కున్న లైసెన్సులు, లీజులు, నువ్వు యెక్కి, దిగిన మెట్లు, నువ్వు పెట్టిన దండాలూ, దరకాస్తులూ, వాటిమీద బరువులూ, నిట్టూర్పులూ, ఎవడో నిన్ను దించిన గోతులూ, కంఠం తెంపుకు అరవ బోయే నిన్ను ఆపే గోడలమీద ఎప్పటివో మాసిన సూక్తులూ, బోడినవ్వు గాంధీ, కోటు గుండీ మీద రెక్కలు రాలిన గులాబీ పువ్వు నెవురూ, నేటి ప్రధానీ, ముఖ్యమంత్రీ – అన్నీ యిపుడు నీకు కొత్తగా కన్పిస్తాయి. మాంత్రికుని గుహగా భయపెట్టే మున్సిపాలిటీ గుట్టేదో నీకెరుకవతాది. నీకొక దారేదో కన్పిస్తాది, కతలన్నీ చదివీసేక తెరచిన కళ్లతోటి అప్పుడు సేతులెత్తి దండం పెడతావు – ఎలగ రాసినావురా తండ్రీ, నాలోలోపల గానీ దూరినావా యేటి, గుండెలోపట దీపమెట్టేవు తండ్రీ అనంటావు!

విజయభాస్కర్‌గారు నాటకరచయితగా ప్రసిద్ధులు గనక యీ కథల్లో

నాటకీకరణ, నాటకీయ సంభాషణలూ అవలీలగా రాసేరు. వ్యంగ్యం రాయడంలో ఉత్తరాంధ్ర వారసత్వాన్ని కొనసాగించేరు. 'భయం' అనే కథలో ఓ పాత్రకు (అవినీతి) అధికార్లనుంచి లభించిన హామీతో కొండంత ధైర్యం వచ్చిందంటారు. ఆ ధైర్యం ఎంతటిదంటే వెంకన్నకు జుత్తు యిచ్చి గుండు కొట్టించుకోవడం కన్నా, పానకాలస్వామికి బిందెలు, బిందెలు పానకాలు పోసిన దానికన్నా ధైర్యమయిన దంటారు. అంతటితో ఆగక –భక్తి కన్నా అవినీతి యెంత భద్రమో మరొక్కసారి రుజువయిందంటారు రచయిత!

భారతదేశంలో గంగానది ఎంత పవిత్రమైనదో ఆ పట్టణానికి ఆ కాలువ అంత పవిత్రమయినది అనంటారు 'పెద్దకాలువ' కథలో. పెద్ద కాలువ యెలా ఆ పట్టణ మురికిని తనలో యిముడ్చుకుంటుందో అనన్య శైలిలో వర్ణిస్తారు. ఈగల్ని, దోమల్ని, పెంటని, ఉచ్చల్ని, చెత్తనీ, చెదారాన్నీ పరమప్రీతిగా తనలో దాచుకుంటుందంటారు! ఈ కథలో కాలువ బహుశా ప్రతీ పట్టణంలోనా వుంటుంది. ప్రతీ పట్టణంలోని కాలువా యీ కథలో కాలువ లాగే రాజకీయాలకు ఉపకరిస్తుంది. కాలువ మీద గుడిసెల రాజకీయాల గుట్టును విప్పి కాలువ యిముడ్చుకునే కంపు కంటే యెక్కువ రాజకీయాల కంపు అనే యెరుకను యీ కథలో కలిగిస్తారు వ్యంగ్య శైలిలో!

లంచం యెక్కువ కావాలనుకునే అధికారి – లంచం యివ్వబోతున్న వానితో వద్దువద్దు అని నాలుగుసార్లు అంటాడట! ప్రతీసారీ అంతో యింతో యెక్కువ యిస్తే ఆనందంగా తీసేసుకుంటాడట వద్దంటూనే! కింది ఉద్యోగులు పై అధికార్లను యెలా బుట్టలో వేసుకుంటారో, అధికార్లమీద రాజకీయనాయకులతో యెలా అవాకులూ, చెవాకులు చెప్పి తమ పగ తీర్చుకుంటారో (ప్రారంభోత్సవం, ట్రాన్సఫర్ కథలు), అలాగే కిందిస్థాయి ఉద్యోగుల నిజాయితీ, శ్రమ గమనంలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని తెలిపే కథలే గాక, మున్సిపల్ వారి నుంచి నీటి కొళాయిల కోసం ప్రజలు పడే పాట్ల మీద గొప్ప వ్యంగ్యంగా రాసిన కథ 'కాశీగంగ'!

మున్సిపాలిటీకి సంబంధించిన అనేక అంశాలను పాఠకుల్లో ఎరుకను కలిగించేందుకు కథనం చేసిన విజయభాస్కర్ గారు సునిశిత దృష్టికోణంతో పాటూ రామయణ, మహాభారతాల వంటి పురాణ సాహిత్యం పట్ల గూడా

అవగాహన కల రచయిత. విశ్వనాథ సత్యనారాయణ గారు తన 'రామయణ కల్పవృక్షం' రచనలో సీతా రాముల కళ్యాణాన్ని వర్ణిస్తూ, చివరికి 'అలుకు గుడ్డకై కలహంబు జరిగె జనక, దశరథ పరిచారకులకు' అన్న పద్యపాదాన్ని పట్టుకొని విజయభాస్కర్ గారు మున్సిపాలిటీ చైర్మన్ గారి కూతురి పెళ్లి సందర్భంగా వారికీ, వియ్యాలవారికీ సంబంధించిన పరిచారికల మధ్య, సేవకుల మధ్య తగవును 'అలుకుగుడ్డ' కథలో చాలా సహజంగా రాస్తూ, ఆ తగవు వెనకాల సేవకుల అనవసర అభిజాత్యాలను చూపిస్తూ, చివరికి తగవు పోలీసుల వరకూ చైర్మన్ భార్య తీసుకుపోవడం, పోలీసులు సేవకిలను అరెస్టుజేసి తీసుకుపోవడం, పోలీసు వేనులో ఎదురెదురుగా కూచున్న యిద్దరు సేవకిలూ ఒకరి మొహం మరొకరు చూడలేకపోతున్నారు అని కథ ముగిస్తారు.

విశ్వనాథ సత్యనారాయణగారు వర్ణించిన పద్యపాదమూ నాకు తెలీదు, అందులో వారు పరిచారకుల వేపు ఉన్నారో జనక, దశరథుల వేపు వున్నారో గూడా నాకు తెలీదు గానీ, యీ కథలో రచయిత పరిచారకుల వేపు వున్నారు. పరిచారకుల అమాయక అభిజాత్యానికి పాఠకుడు జాలి చూపడమే గాక వారి యజమానుల వర్గలక్షణాన్ని వ్యతిరేకించేట్టు రాసేరు. అంతేగాక 'ప్రాణం', 'స్థితప్రజ్ఞత', 'స్వర్గప్రాప్తి' కథల్లో రచయిత నిజాయితీ వేపు, శ్రమజీవులవేపు, ధర్మం వేపు, అభ్యుదయం వేపు తన కలాన్ని నిలిపేరని తెలుపుతాయి!

తన రచన యే మంచికి హానీ, యే చెడుకి మేలూ చేస్తుందో చూసుకోవాలి సుమా అని రావిశాస్త్రి గారు హెచ్చరించేరు. ఆ హెచ్చరికను నిద్రలో కూడా మరువని, మంచికి హాని చేయని రచయిత విజయభాస్కర్ గారు! శ్రమజీవుల వేపు కలాన్ని నిలిపే విజయభాస్కర్‌గారు నాటకాలతో పాటూ, యిలాంటి కథలు రాయడం అభినందనీయం. ఈ కథలకు నన్ను ముందుమాట రాయమనటం నాకెంతో ఆనందంగా వుంది.

**– అట్టాడ అప్పల్నాయుడు**

ప్రముఖ కథా, నవలా రచయిత

**18-05-2021**

**శ్రీకాకుళం**

# తెలుగు కథాసాహిత్యానికి మేలిమి చేర్పు

సాధారణంగా ఇతరులు చూస్తూ కూడా పట్టించుకోని అంశాల్ని రచయితలు నిశితంగా గమనిస్తారు. వాటిని భూమికగా చేసుకొని రాసిన కథలు చదివి పాఠకులు విస్తుపోతారు. తమకు తెలిసినట్టే వుండి తెలియని జీవితాన్ని చూసి విస్మయం చెందుతారు. ఈరీతిన తెలుగు పాఠకుల్ని ఆశ్చర్యానికి లోను చేస్తూ డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ 'మున్సిపల్' కథలు రాశారు. మునిసిపల్ వ్యవస్థలోని సకల కోణాల్ని స్పృశించారు. చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు మనుషులు ఎలా వ్యవహరిస్తారో, వారి అవినీతి పోకడలు, అక్రమాల జాడలు ఎలా ఉంటాయో ఈ కథల్లో సాక్షాత్కారింపజేశారు. నిచ్చెనమెట్ల సమాజం ఈ వ్యవస్థలోనూ ఏవిధంగా అమలవుతున్నదో నర్మగర్భంగా చెప్పారు.

పురపాలక వ్యవస్థలో అధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన విజయభాస్కర్ గారు ఎన్నో రకాల మనుషుల్ని చూశారు. విభిన్న ప్రాంతాల్లో పని చేయడం వల్ల వ్యవస్థకు తూట్లు పొడిచే వారెవరో, మేలు చేసే వారెవరో గమనించారు. కనుకనే కళ్ళముందు కదలాడుతున్నట్టుగా ఉంటాయి ఈ కథల్లోని సన్నివేశాలు. వీటిలోని పాత్రల్ని గమనిస్తే మన పట్టణాల్లో ఉండే కౌన్సిలర్లు, ఉద్యోగులు, అధికారులు, నాయకులు గుర్తుకొస్తారు.

వ్యవస్థలన్నవి ప్రజల సేవ కోసం రూపొందాయన్నది మరచిపోయారు. సేవ పేరిట ఏవిధంగా లాభపడవచ్చనే ధోరణి పెచ్చరిల్లింది. ఇది ప్రస్తుత పురపాలక వ్యవస్థలోని క్రూర వాస్తవికత. నిజానికి పురపాలక వ్యవస్థ అతి ప్రాచీనమైనది. ఆధునిక కాలంలో అది అనేకానేక కొత్త పోకడలతో విస్తరించింది. పట్టణ, నగర ప్రజల సౌకర్యవంతమైన జీవనం కోసం తోడ్పడటం ఈ వ్యవస్థ విధి. ఇందుకోసమే మునిసిపాలిటీలను, కార్పోరేషన్లను ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయితీలను, మునిసిపాలిటీలుగా, మునిసిపాలిటీలను కార్పోరేషన్లుగా ఉన్నతీకరించడం సేవల విస్తరణలో అంతర్భాగం. ఉద్దేశాలు, లక్ష్యాలు ఉన్నతమైనవే, కాని ఆచరణలో అవి ఎలా తేలిపోతున్నాయో ఈ కథలని చదివితే బోధపడుతుంది.

ఈ కథలలో చాలా వాటిని మొదటగా చదివే అవకాశం లభించింది. 'వార్త' ఆదివారం సంచిక ఎడిటర్‌గా పని చేసే కాలంలో విజయభాస్కర్ గారు రాసిన

కథలు కొన్నాళ్ళు వరుసగా ప్రచురించే అవకాశం లభించింది. వాటిలో వచ్చిన కథలతోపాటు మరికొన్ని కథలు కలిపి ఇపుడు పుస్తకంగా తీసుకు రావడం ముదావహం. తెలుగు కథా సాహిత్యానికి ఇది మేలిమి చేర్పు. ఇప్పటివరకు పురపాలక వ్యవస్థ మీద ఇలాంటి కథలు రాలేదు. ఈ వ్యవస్థలోని వైరుధ్యాలను, వైవిధ్యాలను, మనుషుల నైజాలను ఈ కథల్లో బలంగా చిత్రించారు విజయభాస్కర్ గారు. అయితే ఎక్కడా వాచ్యం చేయలేదు. కథనంలో వ్యంగ్యాన్ని చక్కగా వాడుకున్నారు. తెలుగు కథా సాహిత్యానికి ఇది మేలిమి చేర్పు. ఈ వ్యంగ్యంలో హాస్యం కన్నా అధిక్షేపం అధికం. ఇదే సరయినది. వెక్కిరింత, నిరసనలతో కూడిన కంఠస్వరంతో ఈ కథలు రచించారు.

మునిసిపాలిటీలో పనులు చేయించుకోవడం ఎంత కష్టతరమో చాలా మందికి అనుభవమే. లంచాలు ఇవ్వకుండా పని కాదు. ఇచ్చినా పనులు అవుతాయన్న గ్యారంటీ లేదు. 'తేడా' అనే కథలోని ప్రారంభవాక్యాలు ఇలా వుంటాయి: "మనం లంచం ఇచ్చామనుకోండి. పుచ్చుకునేవాడు చల్లగా పుచ్చుకుంటాడు. పుచ్చుకోని వాడు ఒకసారే వద్దంటాడు. ఇంకా ఎక్కువ కావాలనుకునేవారు నాలుగుసార్లు వద్దంటారు". ఈ నిజం చాలామందికి అనుభవైకవేద్యం. కనుకనే లంచం తీసుకొని అయినా సకాలంలో పనులు చేస్తే చాలనే నిర్ణయానికి వచ్చారు జనాలు.

మునిసిపాలిటీలో ఏ పదవి అయినా అక్షరాల బంగారు పంటే అన్నది చాలా మంది ప్రగాఢ నమ్మకం. 'లాలన – పాలన' అనే కథ ఎత్తుగడ వాక్యాలు ఇలా ఉన్నాయి: "పెళ్ళి కాకముందే పెళ్ళాం మీద కోరిక కలిగినట్టు, వంట కాక ముందే భోజనం మీద ఇష్టపడినట్టు నామినేషన్ వెయ్యకముందే శారద పదవి మీద ఆశలు పెట్టుకున్నాడు సుబ్రహ్మణ్యం". పేరుకే ఆమె పదవిలో ఉంటుంది, పెత్తనమంతా తాను చెలాయించవచ్చున్నది అతగాని ఆశ. భార్యల్ని పదవుల్లో కూర్చోబెట్టి భర్తలు దందాలు నడిపే తీరు అనేక మునిసిపాలిటీల్లో ఉన్నదే. అయితే ఈ కథలో ఆత్మగౌరవం కలిగిన శారద మునిసిపల్ చైర్‌పర్సన్‌గా స్వేచ్ఛగా వ్యవహరిస్తుంది. ఇది నచ్చని భర్త దబాయించడంతో "ఇద్దరి బిడ్డల తల్లిని నేను. పిల్లల్ని కడుపులో పెట్టుకొని తొమ్మిది నెలలు ఎలా రక్షించడమో తెల్సిన మాతృమూర్తిని నేను. ఈ పట్టణ ప్రజల్ని మున్సిపాల్టీని ఐదు సంవత్సరాలు నా గుండెల్లో పెట్టుకొని ఎలా రక్షించడమో తెలీదా! తెల్సు. ఆడదానికి తెల్సింది లాలనే కాదు – పాలన కూడా!" అని చెబుతుంది. ఈవిధంగా భర్తకు జవాబు చెప్పిన శారద లాంటివారు పదవుల్లో ఉన్న మహిళలకు ఆదర్శప్రాయం. ఈ కథ ద్వారా అధికార పగ్గాలు చేపట్టిన మహిళలు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవాల్సిన

అవసరాన్ని గుర్తు చేశారు. అలాగే అధికారంలో మహిళలకు కల్పించిన రిజర్వేషన్లు పక్కదారి పట్టే ప్రమాదాన్ని గురించి హెచ్చరించారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడమూ ఆడవారి నిర్ణయాత్మక వైఖరి ద్వారానే సాధ్యమని రచయిత చెప్పకనే చెప్పారు.

మున్సిపల్ కమిషనర్ల విధినిర్వహణ కత్తిమీద సాము లాంటిదని కొన్ని కథలు చెబుతాయి. 'హుండీ' కథలో ప్రోటోకాల్ సమస్యల గురించి రచయిత ప్రస్తావించారు. పనుల ప్రారంభోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు ఎలాంటి గొడవలకు దారి తీస్తాయో ఈ కథలో చిత్రించారు. అలాగే చైర్మన్లు మాత్రమే కాదు వారి భార్యల డాబుసరి పెత్తనాలు ఎలా ఉంటాయో 'చైర్మన్ గారి భార్య'లో చూస్తాం.

గ్లోబలైజేషన్ కాలాన రియల్‌ఎస్టేట్ దందా తెలుగునాట సకల పట్టణాలకీ, నగరాలకీ విస్తరించింది. ఈ పరిణామం మునిసిపాలిటీలలో అవినీతి పెట్రేగిపోవడానికి దారితీసింది. ఈ విషయాన్ని ప్రతీకాత్మకగా చెప్పారు కొన్ని కథల్లో.

జన క్షేమం కోసం ఏర్పడిన మునిసిపల్ వ్యవస్థ పనితీరుకు సంబంధించిన వాస్తవ స్వరూపం ఈ కథల్లో రూపు గట్టించారు విజయభాస్కర్ గారు. చాలా పట్టణాల్లో రోడ్లు, కాలువలు ఎంత అస్తవ్యస్థంగా ఉంటాయో తెలిసిందే. వాటి బాగోగులు పట్టించుకోవాల్సిన వారి నిర్లక్ష్యం ప్రజారోగ్యాన్ని ఇక్కట్ల పాలు జేస్తుంది. ప్రజల ప్రతినిధులుగా ఉన్న కౌన్సిలర్లు, కార్పోరేటర్లు ఏ పని ద్వారా ఎంత లాభం వస్తుందనే లెక్కలతోనే కాలం గడిపేస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు కుమ్మక్కయి మున్సిపల్ వ్యవస్థని భ్రష్టుపట్టించిన వైనం ఈ కథల్లో చదివి గగుర్పాటుకు లోనవడం పాఠకుల వంతు అవుతుంది. అంత బలంగా పురపాలక వ్యవస్థ విరాట్ స్వరూపాన్ని దర్శింపజేయడంలో రచయిత విజయభాస్కర్ సఫలమయ్యారు.

హరప్పా–మొహంజోదారో నాగరికతలు వర్ధిల్లిన కాలంలోనే పురపాలక వ్యవస్థకు సంబంధించి మౌలికమైన పునాదులు పడ్డాయి. కానీ ఇన్నివేల సంవత్సరాల తరువాత ఈ వ్యవస్థ అవినీతి, నిర్లక్ష్యంలో కూరుకుపోవడం 'అభివృద్ధి' పేరిట అనుసరిస్తున్న అసమతుల్య విధానాల ఫలితం. దీనికి సంబంధించి లోతుగా ఆలోచించేందుకు ఈ కథలు ప్రేరణనిస్తాయి. సమున్నత లక్ష్యాలతో ఏర్పాటయిన వ్యవస్థను సానుకూలంగా మార్చుకోవడం పౌరుల చైతన్యం, క్రియాశీలత మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఎరుకని అందించేందుకు తోడ్పడుతుంది డా. విజయభాస్కర్ గారి 'మున్సిపల్' కథల సమాహారం.

**– గుడిపాటి**

# మున్సిపల్ కథల పుట్టుక

నా చిన్నప్పుడు శ్రీకాకుళం మున్సిపల్ కమీషనర్ ఠీవిగా జీపులో రావడం, వెనుక బిళ్ళ బంట్రోతు, పిలిస్తే వెంటనే పరుగెత్తుకొచ్చే సిబ్బంది– నా అంతశ్చేతనలో బలంగా ముద్రించబడింది.

మరికాస్తా పెద్దయ్యాక– ప్రజలకు నీళ్ళు, పాలు ఏర్పాటు చేసి, చెత్తా చెదారం తీసేయించి రోడ్లు, కాలువలు నిర్మించి ఇచ్చే గొప్ప సదవకాశం ఈ ప్రపంచంలో మరో ఉద్యోగానికి లేదు– ఈ భావన స్థిరమైపోయింది నా మనస్సులో.

లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్న నాకు ఆ పోస్ట్ మీద అంత ఇంటరెస్ట్ లేకపోయేది. స్టాఫ్ రూంలో అనవసరపు చర్చలు, జ్ఞానార్జనకు సంబంధంలేని విషయాల మీద గంటల తరబడి తర్జన భర్జన– విసుగెత్తింది. మధ్యలో మా గురువు గారు శ్రీ యస్.కె.మిశ్రో గారి దగ్గర నాటిక రచన పై శిష్యరికం కొంత ఊరట. ఆ సమయంలోనే మున్సిపల్ కమీషనర్‌గా సెలక్టయ్యాను.

అజయ్‌కుమార్, ఆశాజ్యోతి, వందన్‌కుమార్, రాజేంద్ర ప్రసాద్, రమేష్ బాబు, అనురాధ, శ్రీనివాసరావు, నాగేశ్వరావు నా బ్యాచ్‌మేట్సు.

మొట్టమొదటి పోస్టింగ్ అనంతపురం జిల్లా రాయదుర్గం కమీషనర్‌గా. కీ॥శే॥ రామ్మూర్తి నీలకంతప్పగారు చైర్మన్, సిద్ధప్ప గారు వైస్ చైర్మన్. ఇద్దరూ చాలా మంచివారు. ఒక కౌన్సిలర్ మాత్రం కొంతమంది ఉద్యోగుల్ని గుప్పిట్లో పెట్టుకొని, కౌన్సిలర్లను తప్పు దారి పట్టించి మొత్తం చక్రం తిప్పేవారు. అతడిని ఎదుర్కొనే క్రమంలో బాగా రాటుదేలిపోయాను. ఆ తర్వాత కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో కమిషనర్‌గా, కర్నూలు జిల్లా బి.సి. మరియు యస్.సి. కార్పొరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా పన్జేశాను. ఎమ్మిగనూర్ చైర్మన్ కీ॥శే॥ మాచాని

శివన్న గారు నిస్వార్థ ప్రజాసేవకులు. ఆ జిల్లాలోనే కీ॥శే॥ బి.వి.మోహన్ రెడ్డి గారితోను, శ్రీ కె.యి. కృష్ణమూర్తి గారి కుటుంబంతోనూ అనుబంధం ఏర్పడింది.

డిపార్టుమెంటులోని మంచి మంచి సీనియర్లతో పన్జేసే అవకాశం దొరికింది. శ్రీ డి.వి.రావు గారు, శ్రీ శివశంకర్ గారు, శ్రీ వెంకటరెడ్డిగారు, శ్రీ హనుమయ్య గారు, ప్రత్యక్షంగా నేను పన్జేయ్యకపోయినా శ్రీ పి.నాగేశ్వరరావుగారికి నేనంటే వల్లమాలిన అభిమానం.

హైదరాబాద్ అడిషనల్ కమీషనర్గా ఐదేళ్ళు పన్జేశాను. అప్పుడు కమీషనర్లుగా డాక్టర్ పి.కె.మహంతి గారు, శ్రీమతి చిత్రారామచంద్రన్ గారు ఉన్నారు. ఆ సమయంలో డిపార్టుమెంటు కమిషనర్ మరియు డైరెక్టరుగా శ్రీమతి శ్రీలక్ష్మి గారు, డా॥ జనార్దన రెడ్డిగారు పన్జేశారు. నేను మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్గా ఉన్నప్పుడు శ్రీమతి అనితా రామచంద్రన్ గారు మిషన్ డైరెక్టర్గా, అడిషనల్ డైరెక్టర్గా పన్జేసినప్పుడు శ్రీమతి వాణి మోహన్ గారు కమీషనర్ మరియు డైరెక్టరుగా ఉన్నారు. మున్సిపల్ సర్వీస్లో నన్ను బాగా ప్రభావితం చేసిన మరో అధికారి డా॥ పి.వి.రమేష్ గారు.

మంచి శ్రేయోభిలాషులుగా గుర్తుంచుకోదగిన వారు శ్రీయుతులు సుధాకర్గారు, శ్రీ తాళ్ళపాక మురళీధర్ గారు, శ్రీ రవీంద్రనాథ్ గారు, శ్రీ మల్సూర్ గారు, శ్రీ కృష్ణయ్య గారు, శ్రీ బాలకృష్ణ గారు, శ్రీ సాయికుమార్గారు, శ్రీ నల్లనయ్య గారు. ఇటీవల మమ్మల్ని శోకసంద్రంలో ముంచి వెళ్ళి పోయిన ఆత్మీయుడు కీ॥శే॥ సాయి శ్రీకాంత్.

నేను డిపార్ట్మెంటులో జాయిన్ అయ్యాక అంతకు ముందున్న భ్రమలు కొన్ని నెమ్మదిగా తొలిగి పోయాయి. వ్యవస్థలోని లోపాలు, వ్యక్తులు వాటినెలా తమ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నారో అర్థమైంది. ఎప్పటికప్పుడు నా అనుభవాన్ని ఒక చోట వ్రాసిపెట్టుకున్నాను. కొన్ని కథలుగా అప్పటికప్పుడు వ్రాసాను కూడా. వాటిని మిత్రులు శ్రీ గుడిపాటి వార్తలో ప్రచురించారు. ఆ కథల్ని మరోసారి 'మున్సిపల్స్' లో శ్రీ పుల్లారావుగారు ముద్రించారు. అప్పుడు ముద్రించిన వాటికి ఇటీవల వ్రాసిన మరికొన్ని కథల్ని కలిపి 'మున్సిపల్ కథలు'గా ఇప్పుడు ఈ సంపుటి తీసుకురావడంలో సహరించారు శ్రీ గుడిపాటి గారు.

ఈ సంపుటే కాకుండా నా 'మహాశూన్యం' కవితల్ని కూడా శ్రీ గుడిపాటి గారే పాలపిట్టలో ప్రచురించి, తర్వాత పుస్తకంగా తీసుకువచ్చారు. నేను కవిగా, కథా రచయితగా పరిచయం కావడంలో వారి పాత్ర చాలా కీలకం.

పాలపిట్ట శ్రీ గుడిపాటి గారికి

'మున్సిపల్' శ్రీ పుల్లారావుగారికి ధన్యవాదాలు

'మున్సిపల్ కథలు' సంపుటికి ముందు మాట వ్రాసిన ఉత్తరాంధ్ర మహా రచయిత శ్రీ అట్టాడ అప్పల్నాయుడు గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

మున్సిపల్ కమీషనర్లకు సగర్వమైన విషయం మా అన్న డా॥ వి.శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ రాష్ట్రంలో మంత్రి కావడం.

'ఎల్లప్పుడు పాలితులుగా, ఉండటమంటే, సజీవంగా సమాధి కావడమే' (Being ruled always is being buried alive) అని మనస్ఫూర్తిగా నమ్మి, ఒక ప్రక్క ఉద్యోగం చేస్తూనే మరో ప్రక్క రాజకీయ రంగంలోకి రావాలని ప్రయత్నించారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి జరిగిన తొలి ఎన్నికల్లో ఎమ్మెల్యే అయి, రెండోసారి విజయ దుందుభి మ్రోగించి రాష్ట్ర క్యాబినెట్ స్థానం సంపాదించారు. మున్సిపల్ శాఖ నుండి ఎవరు కనిపించినా 'అన్నా' అని పలకరించి గుండెలకు హత్తుకొనే సహృదయుడు మా శ్రీనివాస్ గౌడ్. వారికి ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు.

**– డా॥ దీర్ఘాసి విజయభాస్కర్**

# కథాక్రమం

1. అమ్మ........................................................ 15

2. భయం........................................................19

3. డెమాలిషన్........................................................25

4. కాశీగంగ........................................................30

5. పెద్ద కాలువ........................................................35

6. పుట్టినిల్లు........................................................40

7. తేడా........................................................45

8. లీకేజీ........................................................49

9. లాలన పాలన........................................................55

10. హుండీ........................................................60

11. ప్రారంబోత్సవం........................................................67

12. ట్రాన్స్‌ఫర్........................................................74

13. ఆ ముగ్గురు........................................................80

14. చైర్మన్ గారి భార్య........................................................88

15. అరణ్యవాసం........................................................96

16. అలుకుగుడ్డ......................................................107
17. ప్రాణం............................................................116
18. స్థితప్రజ్ఞత......................................................122
19. స్వర్గప్రాప్తి......................................................127
20 మఱ్రిమాను......................................................133
21 కల్తీ..............................................................141

# అమ్మ

గోపాలరావుకి గొప్పగా సన్మానం అయింది. అతనేం కవిత్వం రాయలేదు. కుస్తీలు పట్టలేదు. పాటలు పాడలేదు. ఆటలు ఆడ లేదు. అంతకన్నా మంచిపనే చేసాడు. అందుకే సన్మానం చేసారు.

ప్రభుత్వానికి పన్ను కట్టాడు. ఆదాయపు పన్ను కట్టాడు. గత పదేళ్ళనుంచీ క్రమం తప్పకుండా ఆదాయపు పన్ను కట్టినందుకు పదిమందికి సన్మానం చేసారు. అందులో గోపాలరావు ఒకడు.

సన్మానం అయ్యాక ఇంటికొచ్చాడు. వచ్చేదారిలో ఓ పట్టుచీర కొన్నాడు భార్య కోసం. ఆ పట్టుచీర ఇచ్చి తన సంతోషాన్ని భార్యతో పంచుకుందామనుకున్నాడు. కానీ అతని భార్య ఎందుకో ఆరోజు సంతోషంగా లేదు. చేతికిచ్చిన చీర చూడకుండానే కింద పడేసింది. కవరు కూడా విప్పలేదు. బెడ్ మీద ఒక మూలకు ముఖం అటు తిప్పుకుని కూచుంది.

మాట్లాడించాలని ప్రయత్నించాడు. నవ్వించడానికి తాపత్రయపడ్డాడు.

ఉహు ...!

ఏదో జరిగిందని అర్థమయింది. ఏం జరిగిందో తెలుసుకోవాలి.

"అమ్మా! అమ్మా!" రంకెలు వేసుకుంటూ వెళ్ళాడు తల్లి ఉన్న గడివైపు. తల్లి కొడుకుని చూసింది. ఆప్యాయంగా చూసింది. అప్పుడే పుట్టిన పసికందుని చూసినంత ఆప్యాయంగా చూసింది.

తల్లి చూపుకి ఆప్యాయత తప్ప ఇంకోటి తెలియదేమో! కానీ, కొడుకు కోపంగా వున్నాడు. చాలా కోపంగా ఉన్నాడు.

"శ్రీదేవిని ఏమయినా అన్నావా?"

"నేనేమన్నాను?"

"మరెందుకు అలిగింది? ఎందుకు కోపంగా ఉంది? పట్టు చీర తెచ్చినా పన్నెత్తి మాట్లాడలేదు. నువ్వేమీ అనకుండానే అంత కోపం ఎందుకొస్తుంది దానికి?"

శ్రీదేవి కూడా వాళ్ళ దగ్గరకొచ్చింది.

"ఆవిడేమీ అనదులెండి! చెయ్యాల్సిన పని చేసుకుపోతుంది. నేనంటే ఒక లెఖ్ఖా, జమా!" అని మూతి మూడువంకర్లు తిప్పింది.

"ముసలి గబ్బిలం ఏంచేసింది డాళింగ్!"

కోపంగానయినా మాట పెగిల్చినందుకు సంతోషపడ్డాడు గోపాలరావు, అత్తను గబ్బిలం అన్నందుకు ఎంత సంతోషం శ్రీదేవికి. నవ్వాగింది కాదు. కానీ నవ్వితే నవ్వులాట గొడవైపోతుంది. అందుకు నవ్వాపుకుంది.

"ఈ నెల్లోనే ఇన్‌కంటాక్సు కట్టాం కదా"

"అందుకేగా ఈ రోజు సన్మానం"

"ఎలక్ట్రిసిటీ బిల్, టెలిఫోన్ బిల్, పిల్లల స్కూలు ఫీజులు అన్నీ ఈ నెల్లోనే. పైగా ఫ్లాట్ ఇన్‌స్టాల్‌మెంటు కూడా కట్టాలి. ఫైనాన్స్ కంపెనీ డ్యూస్ సెటిల్ చెయ్యాలి"

"అవును!"

"ఏం కొంప మునిగిందని ఇవన్నీ ఉండగా మున్సిపాల్టీ పన్నులు కట్టేసిందో అడగండీ! పైగా మూడు సంవత్సరాల డ్యూస్ ఒక్కసారే. ఎంత చెప్పినా వినదే. బీరువాలోంచి డబ్బు తీసి కట్టేసింది. మీకేమో కర్ర విరగ్గూడదు. పాము చావకూడదు. నాకెందుకు మధ్యలో. ఈ ఇంట్లో నా స్థానమేమిటో చెబితే నా పరిధిలో నేను బతుకుతాను. నాకెందుకు అనవసర పెద్దరికాలు"

భార్య మాటలింకా పూర్తికాకముందే తల్లి మీద పడి జుత్తు పట్టుకుని గుంజాయించి నాలుగు బారలు ఈడ్చేసి, పీక గట్టిగా మూడు తిప్పులు తిప్పి....

"తల్లివయినందుకు చెయ్యి చేసుకోలేదు. నీకెందుకే అధిక ప్రసంగం. పెట్టింది తిని మూల కూర్చోక" అని భార్యవైపు తిరిగి

"ఈసారి దానికి చనువిచ్చి చంక నెక్కించుకున్నావో నిన్ను తంతాను జాగ్రత్త" అన్నాడు.

"నేనేం చేసాను మధ్యలో"

"ఏం చేసావా? నాకెందుకు చెప్పడం! నువ్వే నాలుగు అనొచ్చుగా! నువ్వు తంతే ఏ గొడవా ఉండదు. అత్త అనందే కోడలు కొడుతుందా అంటారు. అదే నేను ఇంత అంటే అంత అంటారు"

"సర్లెండి! మీ అమ్మ మీద ఫిర్యాదు చేసిన పాపానికి నేనే శిక్షించుకుంటాను. రెండు పూటలు భోజనం మానేస్తాను"

"మానెయ్! కానీ నువ్వు తినడం కాదు. దానికి పెట్టడం. రెండు రోజులు తిండి లేకపోతే చచ్చిపోదు. నువ్వు పద. పట్టుచీర కట్టుకుందువుగానీ" నడుంమీద చెయ్యివేసి భార్యను తీసుకెళ్ళాడు గోపాలరావు.

కళ్ళనిండా నీళ్ళు – గుండెనిండా ఆవేశం తల్లికి.

"ఒరేయ్! మూర్ఖుడా! పెళ్ళానికి పట్టుచీర పెట్టేవాడు కాదురా! అమ్మకి

అన్నం పెట్టేవాడురా గొప్పవాడు. పొద్దు పొడిస్తే నీ చెత్తా, చెదారం ఎత్తి, రోడ్లు ఊడ్చి, కాలువలు శుభ్రంచేసి నీకు నీళ్ళిచ్చి, లైట్లేసి, రోడ్లు వేసిన మున్సిపాల్టీ నీ అమ్మతో సమానం. దానికి పన్ను కట్టేవాడురా గొప్పవాడు. అందుకే మూడు సంవత్సరాల బాకీ ఒక్కసారే కట్టేసాను. నువ్వేంట్రా నాకు భోజనం పెట్టొద్దని చెప్పేది. నేనే మానేస్తున్నాను. నేనే మానేస్తున్నాను.

కొడుకు చేతి ముద్ద తినాల్సింది ఆ చేతి దెబ్బ తిననంత వరకే. ఇకనుండి నువ్వు పెట్టిన అన్నం విషంతో సమానం. ఆ విషం నేను తినను. తనను గాక తినను" అని పిచ్చిగా అరుస్తోంది ఆ తల్లి.

అవేమీ వినిపించుకోకుండా పెళ్ళానికి పట్టుచీర కట్టబెడుతున్నాడు కొడుకు.

రేపు అత్తను ఎలా తిట్టించాలో కొత్త కారణం కోసం ఆలోచిస్తోంది శ్రీదేవి.

# భయం

ఈ మధ్య జరిగిన ఎలక్షన్స్‌లో గుంటెప్ప కౌన్సిలర్ అయ్యాడు.

ఎక్కడో పల్లెనుండి పూటగడవక పొట్ట చేతబట్టుకొని ఆ మున్సిపాల్టీకి వచ్చాడు. అప్పుడతను ఓ సెట్లర్. గత ఎలక్షన్స్‌లో అతనే డిసైడింగ్ ఫ్యాక్టర్. ఎలక్షన్స్ తర్వాత పెద్ద కాలువ ఎంక్రోచర్. తర్వాత చిన్న కాంట్రాక్టర్. ఆ తర్వాత మున్సిపల్ ఆఫీసుకి మీడియేటర్. ఇప్పుడు సాక్షాత్తు కౌన్సిలర్.

ఇదీ ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతున్న తీరు.

నాలుగు ఓట్ల మెజార్టీతో గెల్చిన గుంటెప్ప ఒకరోజు తీవ్రంగా ఆలోచించాడు. "ఎంతమందికి ఇంటి స్థలాలు ఇప్పించలేదు! ఎంతమందికి కొళాయిలు వేయించలేదు! ఇంకెంతమందికి ఇంటి ప్లానులు సాంక్షను చెయ్యలేదు! ఎంతెంతమందికి ఆదరణలో సైకిళ్ళు ఇప్పించలేదు. అంతమందికి అన్ని ఉప కారాలు జేస్తే తనకొచ్చే మెజారిటీ నాలుగు ఓట్లా?" ఉపకారాలు ఊరికే జేసావా అంటారా! ఈలోకంలో ఊరికే ఎవడేదీ చెయ్యడు. చంటి పిల్లాడైనా ఊరూరుకే ఏడవమన్నా ఏడవడు! కుప్పనూర్చే గొడ్డు రెండు గడ్డి పరకలు మేస్తాది. అది ధర్మంకూడా! అదెంత మాత్రం తప్పుకాదు.

రాజకీయాల్లో ఎదగాలంటే నాయకుడంటే భయమైనా ఉండాలి. భక్తి అయినా ఉండాలి. భక్తి ఉండే రోజులు కావివి. ఇక ఉంచుకోవాల్సింది భయమే! ఆ భయమే లేకపోతే ఇప్పుడు నాలుగు ఓట్ల మెజార్టీ వచ్చింది. వచ్చే ఎలక్షన్సులో నాలుగు ఓట్లు మాత్రమే పడతాయి. ఎందుకంటే పదవి మీద ఉన్నోడు పెంటమీద ఉన్నోడు ఒకటే. ఎప్పుడూ ఏదో ఒక కంపు కొడుతూనే ఉవుంటుంది. ఆ పరిస్థితి తెచ్చుకోకూడదు. పైగా కౌన్సిలర్‌గా గెల్చి నెలరోజులైనా జనాలు తనింటికి రావట్లేదు. ఇల్లు కిటకిటలాడట్లేదు. తనంటే వార్డులో జనాలు భయపడేలా చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. పనుల కోసం తనింటి చుట్టూ తిరిగేలా చెయ్యాలనుకున్నాడు.

గుంటెప్ప ఇంటికి నాలుగిళ్ళ అవతల రామ్మూర్తి ఇల్లుంది. అతను రిటైర్డు వుద్యోగి. పెన్షనరీ బెనిఫిట్స్‌తో ఒక ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. ప్లానుకి అప్లికేషన్ పెట్టుకున్నాడు. ప్లాను వచ్చేలోపల ఒక మంచి ముహూర్తం కుదిరితే భూమి పూజ చేసుకొని పునాదులు తవ్వుకున్నాడు. మిగతావన్ని ప్లాను వచ్చేక ఆరంభిద్దామనుకున్నాడు.

ఈ సంగతి గుంటెప్పకు తెల్సింది. టౌను ప్లానింగ్ సెక్షన్‌కు వెళ్ళాడు.

"ఇంటి ప్లాను ఎన్నాళ్ళలో సాంక్షను చెయ్యాలి" గుంటెప్ప అడిగాడు.

"పదిహేను రోజులు"

"రామ్మూర్తి ప్లాను పధ్నాలుగు రోజుల వరకు సాంక్షను చెయ్యకండి! పధ్నాలుగో రోజున ఏంచెయ్యాలో నేను చెబుతా"

"పధ్నాలుగు రోజులు ఎందుకు పెండింగ్ పెట్టారని కమీషనర్ అడిగితే?"

"పార్టీ కమీషనర్ దగ్గరకు వెళ్తేగదా మిమ్మల్ని అడిగేది. వాళ్ళు కమీషనర్ దగ్గరకు వెళ్ళకుండా నేన్జూసుకుంటాను. పార్టీయే వచ్చి అడిగారనుకోండి! – "గుంటెప్ప చెప్పాడు. మీకేం భయం లేదు. ప్లాను వస్తుంది. ఇల్లు కట్టుకోమని అన్జెప్పండి" అన్నాడు గుంటెప్ప.

అతని మాటల్లోని చిదంబర రహస్యం అర్థమైపోయింది. వాళ్ళ దగ్గరేదో ఇంత కతకడానికి ప్రయత్నిస్తున్నాడనుకున్నారు. కానీ గుంటెప్ప గుండె ఎంత లోతుందో వాళ్ళకేం తెలుసు.

ఒకరోజు సైటు దగ్గర రామ్మూర్తి ఉన్నాడు. గుంటెప్పే వెళ్ళి పలకరించాడు.

“ఏం రామ్మూర్తన్నా! ఇల్లు కట్టుకుంటున్నావ్”

“అవ్! గుంటెప్పా! రిటైర్‌మెంటు దుడ్లు వచ్చినాయ్! వాటితో కొంప ఒకటి నిలబెట్టుకుందామని” రామ్మూర్తి జవాబిచ్చాడు.

“అంతా బాగుందిగానీ; ఇల్లు మరీ చిన్నదౌతా వుంది. ముంగలెందుకు అంత జాగా ఇడిస్తివి” గుంతలన్నీ పరికిస్తూ అన్నాడు గుంటెప్ప.

“ఏంజేస్తాం! సెంటున్నర జాగా! ముందల ఐదు అడుగులు ఇడచాల. సైటు క్రాసు ఉంది. సమంజేసుకొనే పాటికి మరో రెండడుగులు పోతాది. మొత్తం ఏడడుగులు ముందుకి వదలాల్సి వచ్చింది. లేపోతే ఈశాన్యం తక్కువబడ్డది” అంటూ వివరించాడు రామ్మూర్తి.

“ఓమాట జెప్పనా”

“చెప్పు గుంటెప్పా”

“నాకు ఓటెయ్యకపోయినా నా ఓటరువి నువ్వు. ఇప్పుడు గాపోతే మరో పాలి ఏస్తావ్. నీకైతే ఉపకారం జెయ్యాలగదా! ఏమంటావ్”

“దేవుడు వరమిస్తానంటే వద్దంటామా! చెప్పు ఏం ఉపకారం జేస్తావో”

“ముందు, వెనకా జాగా వదలడమంటే అది మన అనుకూలం బట్టి ఉంటాది. నువ్వు ఒక్క అడుగు కూడా వదలొద్దు”

రామ్మూర్తి ఏదో చెప్పబోతుంటే చెప్పనివ్వలేదు.

“నీ భయం నాకర్థమైంది. దాని గురించి తర్వాత చెప్తాను. ఇకపోతే నీ

సైటు క్రాసుంది. దాన్ని సమం జేసుకోవడానికి నీది రెండడుగులు వదలొచ్చు. పక్కనే రెండడుగులు కలుపుకోవచ్చు"

రామ్మూర్తి మీద బాంబు పడినట్టు తుళ్ళిపడ్డాడు.

"పక్క జాగా మున్సిపాల్టీదికదా"

"అందుకే మరి కలుపుకోమంటున్నది. ప్రైవేటుదైతే ఓనరూరుకుంటాడేమి! రెండుకాకపోతే ఆరు కలుపుకొని నీ సైటు సమం జేసుకుంటే మరో గది ఈజీగా వస్తాది. నీకు తెలీంది ఏముంది. నోరులేని వెయ్యింగ్ మెషినైనా కడుపులో రూపాయి బిళ్ళ పడందే మన బరువెంతో చెప్పదు! ఉజ్జోగస్తులు! ఏదో ఆశపడ్తారు. కాస్త విదిలిస్తే వాళ్ళే వదిలేస్తారు. ఏమంటావ్"

రామ్మూర్తి వెంటనే ఒప్పుకోలేకపోయాడు.

ఇంట్లో వాళ్ళతో చర్చించాడు. రామ్మూరికి భయంగా ఉంది. కానీ అతని కొడుకు దూకుడుగా ఉన్నాడు. గుంటెప్ప ఇప్పుడు చాలా పవర్ ఫుల్‌గా ఉన్నా డని, అతనేం జెబితే అది మున్సిపాల్టీలో జరుగుతుందని అంచేత భయపడక్కర్లేదని తండ్రిని ఒప్పించేశాడు. దానికి సపోర్టుగా కొన్ని దృష్టాంతాలు గూడా చెప్పుకొచ్చాడు. రామ్మూర్తి తలొంచక తప్పలేదు.

పక్కనున్న మున్సిపాల్టీ జాగా కొంత ఆక్రమించుకొని ముందు మరో గదితో ఇల్లు చకచక లింటల్ వరకు వచ్చేసింది.

రామ్మూర్తి కొడుకు డబ్బులు తీసుకెళ్ళి మున్సిపాల్టీ వారికిచ్చాడు. "మీ కేసు' గుంటెప్పగారు రికమెండేషన్ చేసారు. మాకు డబ్బులొద్దు. మీ ఇష్టమొచ్చినట్టు కట్టుకోండి" అన్నారు మున్సిపాల్టీ వాళ్ళు.

దాంతో రామ్మూర్తి కుటుంబానికి కొండంత ధైర్యమొచ్చింది. ఆ ధైర్యం ఎంతటిందంటే, వెంకన్న స్వామికి జుత్తు ఇచ్చి గుండు కొట్టించడం కన్న, పానకాల స్వామికి బిందెలు బిందెలు పానకాలు పోసిన దాని కన్నా ధైర్యమది.

భక్తి కన్నా అవినీతి ఎంత భద్రమో మరొక్కసారి ఋజువైంది.

రామ్మూర్తి కుటుంబానికి గుంటెప్ప పరమ మిత్రుడు, సఖుడు, ఆపద్బాంధవుడు. మరికొన్నాళ్ళు పోతే కులదైవంగా కొలిచే వారేమో! కానీ గుంటెప్ప రాజకీయ నాయకుడు. ఇప్పుడిప్పుడే పట్టు సాధించాలని తపిస్తున్న నాయకుడు. ప్రజల్లో తన పట్ల భయభక్తులు సృష్టించాలనుకుంటున్నవాడు.

అలాంటి గుంటెప్ప ఆలోచన మరోలా ఉంది.

ప్రజల్ని ఒకరకమైన ఆలోచనల్లోకి నెట్టి నాయకులు మరోరకమైన ఆలోచనలు చేసేదాన్నే రాజకీయమంటారు. అందులో ఉద్ధండుడు కావాలనుకునే గుంటెప్ప రామ్మూర్తి కుటుంబం ఆశల్ని ఈడేరనిస్తాడా? చచ్చినా కానివ్వడు.

గుంటెప్ప తనకు అతి విశ్వాసపాత్రులైన నలుగురు కార్యకర్తల్ని పిల్చి "ఒరేయ్! మరో నాలుగు రోజుల్లో రామ్మూర్తి ఇల్లు మున్సిపాల్టీ వాళ్ళ చేత గుంటెప్ప పడగొట్టిస్తాడు చూడండి" అని ఊర్లో ప్రచారం చెయ్యమన్నాడు.

వాళ్ళు అతను చెప్పినట్టే అక్కడక్కడ – అంటే 'కమ్యూనిటీ హాలు దగ్గర, అంగన్ వాడీ సెంటర్ల దగ్గర, కల్లు కాంపౌండుల దగ్గర, పేకాట క్లబ్బుల' దగ్గర – ఈ వార్త స్ప్రెడ్ చేసారు. దాన్ని నమ్మినవాళ్ళు నమ్మారు. నమ్మని వాళ్ళు నమ్మలేదు.

కానీ ఒకరోజు ఉదయాన్నే, మున్సిపాల్టీ వాళ్ళు గునపాలు, పారలు పట్టుకొని రామ్మూర్తి ఇల్లు పడగొడుతుంటే ఊరంతా నమ్మక తప్పింది కాదు.

ఇంటి గోడల మీద పడుతున్న ఒక్కో దెబ్బ గుండెల మీద పడినట్టు ఫీలయ్యాడు రామ్మూర్తి.

"అయ్యా! అయ్యా! ఇది అన్యాయం. మీరే కట్టుకోమన్నారు" అని మున్సిపాల్టీ వాళ్ళను ప్రాధేయపడ్డాడు.

"నీ స్థలంలో కట్టుకోమన్నాం. మున్సిపాల్టీ స్థలంలో ఎవడు కట్టమన్నాడు? మున్సిపాల్టీ జాగా అంటే అంత అలుసా నీకు. అంత భయం లేకుండ కట్టేస్తావా" అని దబాయించారు.

ఏం చెయ్యాలో పాలుపోక గుంటెప్ప కోసం పరుగులు పెట్టాడు. ఇంట్లో లేడు. ఆఫీసులో లేడు. పార్టీ ఆఫీసులో లేడు. అసలు ఊళ్ళోనే లేడు. బంధువులింటి కెళ్ళాడన్నారు.

మొత్తానికి రామ్మూర్తి  ఇల్లు మొండిగోడలతో మిగిలింది.

గుంటెప్ప  అనుచరులు ఊళ్ళో చేసిన ప్రచారం మంచి ఫలితాల్నే ఇచ్చింది. గుంటెప్పతో మంచిగుంటే మున్సిపాల్టీలో చక్కగా పనులు జరుగుతాయని పేరొచ్చింది. గుంటెప్ప ఇంటికి జనాల రాక పెరుగుతోంది.

రామ్మూర్తి ఇంటి మొండి గోడల్ని బాగు చేయించుకోడానికి అప్పు కోసం తిరుగుతున్నాడు.

# డెమాలిషన్

కమీషనర్ ఎదురుగా టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, హెల్త్ ఆఫీసర్ కూర్చొని వున్నారు. అతను చెప్పిందంతా ఎంతో శ్రద్ధగా వింటున్నారు.

"ఈరోజు మనం డెమాలిష్ చేయ్యాలి" స్థిర నిశ్చయంతో చెప్పాడు కమిషనర్.

"తప్పకుండా చెయ్యాలి సార్! మున్సిపల్ స్థలంలో ఎలా కడతాడండీ" అన్నాడు హెల్త్ఆఫీసర్. అతని మాటల్తో ఇంకా ఉత్సాహమొచ్చింది కమీషనర్‌కి.

పోలీస్ స్టేషన్ రోడ్‌లో పది సెంట్ల మున్సిపల్ స్థలముంది. ఆ స్థలంలో ఆరేడు బంకులేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని బతుకుతున్నారు బీదవారు. ఈ కమిషనర్ వచ్చాక వాళ్ళందరికీ లైసెన్సులు కూడా ఇచ్చారు. ఈ మధ్య దసరాకు నాలుగు రోజులు శలవులొచ్చాయి. కమిషనర్‌తో పాటు అందరూ స్వంత ఊర్లెళ్ళిపోయారు. శలవుల తర్వాత తిరిగి ఈ రోజే ఆఫీసులకి వచ్చారు. వచ్చేనరికి ఏముంది? మున్సివల్ స్థలం చుట్టూ ప్రహరీగోడ వచ్చింది. ఆ స్థలం నాదేనంటూ పత్రాలు పట్టుకొచ్చాడు సాయినాథ్. అయినా కమిషనర్ విన్పించుకోలేదు. ప్రహరీగోడ పడగొట్టాలని తీర్మానించి ఆ పని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టిపిఒ)కి అప్పగించాడు ఆఫీసర్. రెండు ఫైల్సు కమిషనర్ ముందుపెట్టాడు టౌన్‌ప్లానింగ్. ఒకటి డెమాలిషన్ ఆర్డర్. రెండోది సెక్యూరిటీ కోసం లెటర్. అవి సైన్ చేస్తూ "హెచ్.ఒ. గారు! టి.పి.ఒ గారు ఎంత మంది లేబర్నడిగితే అంత మందినివ్వండి. మీరు కూడా అతనితో పాటు ఉండండి. పూర్తిగా డెమాలిషన్

అయ్యాక మీరిద్దరూ వచ్చి నాకు రిపోర్టు చెయ్యండి" అన్నాడు కమిషనర్.

"ఓ! ష్యూర్ సార్!" అంటూ లేచాడు హెచ్.ఒ. రెండున్నర అయింది. హెల్త్ సెక్షన్లో ఎవరూ రాలేదు. వర్కర్లు బీడీలు కాల్చుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ చెట్ల కింద కూర్చున్నారు. టిపిఓకి ఏం చేయాలో పాలుపోవడం లేదు. రెండు గంటలకు హెచ్.ఓ. రావాలి. వర్కర్లకి మస్టర్ వేసి తనతో పంపిస్తే వారిని తీసుకెళ్ళి ప్రహరీగోడ పడగొట్టాలి. రెండున్నర అయినా ఈయన ఇంకా రాలేదు.

కమిషనర్ ఇంటికి ఫోను చేస్తే బయటికెళ్ళారని చెప్పారు. డెమాలిషన్కి ఆర్డర్ వేసి ఎవరికీ దొరక్కుండా వెళ్ళిపోతారు కమిషనర్లు. ఆ విధంగా వెళ్ళిపోయినట్టుంది కమిషనర్. డిపిఒక టెన్షన్ ఎక్కువైపోతుంది. హెల్త్ సెక్షన్కి వెళ్ళాడు. వాళ్ళకు విషయం చెప్పి ఇరవైమంది వర్కర్లను పంపించమని అడిగాడు టి.పి.ఒ. ఒక ఇన్స్పెక్టర్ కాస్త పాజిటివ్గా స్పందించబోతే గోపాలకృష్ణ అడ్డంపడి అన్నాడు.

"మొన్న సార్ గారి పర్మిషన్ లేకుండా వర్కర్లను మీతో పంపినందుకు హెచ్.ఓ. ఎలా నంజుకుతిన్నాడో మర్చిపోయారా? మమ్మల్నెందుకు సార్ ఇబ్బంది పెడతారు? హెచ్.ఓ. గారు రానివ్వండి" అంటూ ఓ స్పీడ్ బ్రేకర్ వేశాడు.

దాంతో మరో ఇన్స్పెక్టర్ కళ్ళముందు నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన కదలాడింది.

ఆరోజు బిల్డింగ్ ఇన్స్పెక్టర్ స్పీడుగా హెల్త్ సెక్షన్లోకి వచ్చాడు. అప్పటికింకా హెచ్.ఒ. రాలేదు..

"శానిటరీ గారూ! అర్జంటుగా వర్కర్లు కావాలి. రోడ్డు పక్కనెవరో బంకు పెట్టారట. ఆ బంకు తీయకపోతే రేపు కౌన్సిల్లో రైజ్ చేస్తానని రామాంజనేయులు ఫోన్శాడు. బాబ్బాబు! ఓ పదిమందిని పంపియ్య"మని అడిగితే హెచ్.ఒ. పర్మిషన్ లేకుండా పంపించాడు. బంకుతెచ్చి మునిసిపల్ ఆఫీసులో పెట్టారు బిల్డింగ్ ఇన్ స్పెక్టర్.

ఇక ఆరోజు హెచ్.ఒ. ఫుల్గా వాయించాడు ఇన్ స్పెక్టర్ని. కారణం ఆ

బంకు పెట్టించింది హెల్తాఫీసర్. ఇక ముందెప్పుడూ తన పర్మిషన్ లేకుండా వర్కర్లనెక్కడికీ పంపించొద్దన్నాడు. పంపిస్తే తోలు ఒలుస్తానన్నాడు. అదిగో అది గుర్తొచ్చి వర్కర్లను పంపించడానికి ఎవరూ సాహసించలేదు. అప్పుడే చెమటలు కక్కుకుంటూ వచ్చాడు హెచ్.ఒ.

"సారీ బాస్! కొంచెం లేటయ్యింది. గోపాలకృష్ణా! ఇరవైమంది మెరికల్లాంటి వాళ్ళని పంపించు త్వరగా" అని గోపాలకృష్ణను పురమాయించి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. మళ్ళీ అతనే అన్నాడు.

"నువ్వు వర్కర్లని తీసుకొని సైటుదగ్గరికి పద! నేను మస్టర్ వేసి వస్తాను" అన్నాడు. హెచ్.ఒ. వర్కర్లను తీసుకుని గోడ పడగొట్టడానికి బయల్దేరాడు టిపిఒ.

అక్కడ కోలాహలంగా ఉంది. బంకు లేసుకుని బతుకుతున్నవారు ఒక పక్కనున్నారు. మరో పక్క నలుగురు పోలీసులు, వాళ్ళ మధ్య ఎస్.ఐ నిలబడి వున్నాడు. వాళ్ళను చూసి టిపిఓకి ధైర్యం వచ్చింది. వెళ్తూనే ప్రహరీ గోడమీద విరుచుకు పడ్డారు వర్కర్లు.

దభీదభీమని గడ్డపార్లతో గోడ పగలగొడ్తున్నారు. ఇంతలో చేతిలో ఏవో కాగితాలు పట్టుకొని వచ్చి "ఆపండి" అని అరిచాడు సాయినాథ్.

"వద్దు. వడగొట్టండ"ని ఇంకా గట్టిగా అరిచాడు టిపిఒ.

"ఆపకపోతే జైలుకి పోతావు. ఇదిగో స్టే ఆర్డర్" చేతిలో కాగితాలు గాలిలో ఊపుతూ అన్నాడు.

ఎంక్రోచ్‌మెంట్ డెమాలిషన్ మీద స్టే ఇవ్వకూడదు" అన్నాడు టిపిఒ.

"ఇచ్చింది. చూసుకో" జాతీయ జెండాను ఊపినట్టుగా ఊపుతున్నాడు స్టే ఆర్డర్ కాగితాలు.

ఎస్.ఐ ముందుకొచ్చి అన్నాడు "స్టే ఉంటే మనమేం చెయ్యలేం పదండి స్టేషన్‌కి" తన సిబ్బందిని పిలుచుకు పోయాడు. బంకు ఓనర్ల ముఖాలు

దిగాలైపోయినాయి. టిపిఓ వర్కర్లతో వెనుదిరిగాడు.

"ఈ కోర్టులు అన్నిటికీ స్టే ఇస్తాయి. చచ! ఎంత అన్యాయం. మున్సిపల్ స్థలాలు ఏంక్రోచ్ చేసినప్పుడు 'స్టే' ఏంటి భాయ్" అంటూ చాలా బాధపడిపోయాడు హెచ్.ఓ జరిగింది తెల్సుకొని.

కోర్టులో కేసు రెండు సంవత్సరాలు నలిగింది. మున్సిపాల్టీ ఆ స్థలం తమదే అని నిరూపించుకునే స్ట్రీట్ సర్వే మేప్ కనిపించకుండా పోయింది. ఎలాగైతేనేం సాయినాథ్‌దే ఆ స్థలమని కోర్టు తీర్పిచ్చింది. దాంతో ఆ స్థలంలో ఐదు షాపులు కట్టేశారు..!

* * *

షాపులు ఓపెనింగ్ కి రెండు రోజుల ముందు మేడ మీద నలుగురు కలిసి మందు కొడుతున్నారు.

"సబ్ రిజిస్ట్రార్ అడిగనట్లు అతనికి రెండు షాపులిచ్చేద్దాం" అన్నాడు సాయినాథ్.

ఒక్కదానితో సరిపెట్టుకోమని సబ్ రిజిస్ట్రాన్ని కాస్త బతిమాలుతున్నట్టే చెప్పాడు కౌన్సిలర్ రామాంజనేయులు. కానీ అతను ఒప్పుకోవట్లేదు. సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ న్యాయమైందేననిపిస్తోంది సాయినాథ్‌కి.

"మనకీ కృతజ్ఞత ఉండాలి రామంజనేయులూ! పైగా అన్యాయం మనకొద్దు. సబ్ రిజిస్ట్రార్ తీసుకున్న రిస్కుకి తగిన ఫలితం ఇవ్వాల్సిందే! ఆ రోజు కోర్టులో స్టే వచ్చిందంటే మనం చూపించిన డాక్యుమెంటు వలనే కదా? ఆ డాక్యుమెంటు మనకెలా వచ్చింది" ఆగి ఒక గుటక వేశాడు సాయినాథ్.

"ఎలా వచ్చింది? సైటు కొన్నాం వచ్చింది"

కొన్నది పక్కసైటు. కొట్టేసింది మున్సిపల్ సైటు. కొత్త సైటు రిజిస్ట్రేషన్ చేసినప్పుడే చెక్‌బందీలు మార్చేసి మున్సిపల్ సైటుతో సహా రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. ఆ విషయం అక్కడున్న నలుగురికీ తెలుసు. కాని ఎంఫసిస్ కోసం

మరొక్కసారి చెప్పాడు సాయినాథ్.

"సరే! సబ్ రిజిస్ట్రార్‌కి రెండుషాపులు. మిగిలినవి" రామాంజనేయులు ప్రశ్నించాడు.

"డబ్బు ఖర్చు పెట్టింది– వ్యవహారం నడిపింది నేను కాబట్టి నాకు రెండు. ఈ విషయం కౌన్సిల్లో రాకుండా మేనేజ్ చేసినందుకు నీకో షాపు" అన్నాడు సాయినాథ్.

"మరి ఇతనికీ" నాలుగో వ్యక్తినుద్దేశించి అన్నాడు రామాంజనేయులు.

"అదీ ఆలోచించా! ఇదిగో ఇరవై మీరు తీస్కోండి" నాలుగో వ్యక్తి చేతిలో నోట్ల కట్టలు పెట్టాడు సాయినాథ్.

అప్పటికే అతని కిక్ మెదడులోకి, కోపం కళ్ళలోకి వచ్చి చేరుకున్నాయి.

"నేను చేసిన సహాయం అంత చీప్ ఉందా మీకు? మీరంతా షాపులు పంచుకొని నాకు ముష్టి ఇరవై వేలిస్తారా? ఆ షాపులెలా ఉంటాయో నేనూ చూస్తాను" కోపోద్రేకంతో చేతిలోని సీసాను కింద విసిరికొట్టాడు. అది వెళ్ళి సరాసరి మురికి కాలువలో పడింది.

నాలుగో వ్యక్తి ఎవరు?

వాళ్ళకి స్టే వచ్చేంతవరకు ఆగి కావాలనే మస్టర్‌కి ఆలస్యంగా వచ్చిన హెల్త్‌ఆఫీసరు అంటారు కొందరు.

రికార్డుల్లో సర్వే మేప్ చింపేసి కోర్టులో వాళ్ళు గెల్చిన దానికి సహాయపడిన టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ అంటారు మరికొందరు. ఎవరన్నది మిగిలిన ముగ్గురికే తెలుసు.

# కాశీగంగ

చెరువుకి ఒక పక్క మగవాళ్ళు తానాలాడుతుంటే, మరోపక్క ఆడవాళ్ళ స్నానాలు చేసి, చీరచెంగులతో వడకట్టి, నీరు తీసుకొనిపోతుంటారు. ఈ దృశ్యం ఉత్తరకోస్తాలోని మూడు జిల్లాల్లోని అనేక పల్లెల్లో కనిపిస్తుంది.

అలాంటి ఒక పల్లె నుండి పట్నం వచ్చాడు గంగన్న. గంగన్న అల్లుడు పట్నంలో ఎమ్మార్వో దగ్గర జీపు డ్రైవర్‌గా పన్జేస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు ఈ మధ్యనే చచ్చిపోయాడు. ఎలక్షన్ల ముందు బహిరంగ సభకని లారీల్లో జనాల్ని తోలుకెళ్ళారు. లారీ బోల్తాపడిపోయి ఐదుమంది చచ్చిపోయారు. అందులో గంగన్న కొడుకు ఒకడు.

కొడుకు చచ్చిపోయిన తర్వాత కూతురి దగ్గరకు వచ్చేశాడు గంగన్న వస్తూ వస్తూ గంగన్న రెండు వస్తువులు తెచ్చి కూతురికిచ్చాడు. ఇచ్చి ఏమన్నాడంటే

“అమ్మా మొన్న నేను తిరపతి ఎల్లినప్పుడు ఇదిగో ఈ పాత్ర తెచ్చుకున్నాను. నేను చచ్చిపోయేటప్పుడు ఈ కాశీగంగ నా నోట్లో పొయ్యాలి. ఇది మనకున్న మూడెకరాల మెట్టపొలం అమ్మేసినాను. దాన్తాలూకు బాపతు ఇరవై వేల రూపాయలు. నీకేటి కావాలంటే అది కొనుక్కో” అని కాశీగంగ పాత్ర, ఇరవైవేల రూపాయలు కూతురి చేతిలో పెట్టాడు.

కాశీగంగ పాత్ర దేవుని ఫొటోముందు పెట్టింది. ఇరవైవేలు మాత్రం తిరిగి తండ్రికే ఇచ్చి అంది “నీ దగ్గరే వున్నీ నాయనా! నా కెప్పుడు అవసరమైతే అప్పుడు అడుగుతాన్లే” అని.

కూతురి కాపురం చూసి చాలా మురిసి పోయాడు గంగన్న. అల్లుడు గొప్ప చలాకీ అయినాడు. చేసేది ఎమ్మార్వో డ్రైవరుద్యోగమైనా, చెలాయించేది మాత్రం కలెక్టరు డ్రైవర్‌లాగ. బియ్యం, కిర్సనాయిలు, పంచదార డీలర్ల దగ్గర కిట్టించేస్తాడు. కేంపుల కెళ్ళినప్పుడు కోడి, కోడిగుడ్లు, కూరగాయలు మోసుకొస్తాడు. ఉప్పు, పప్పు సరేసరి.

పెళ్ళిళ్ళకు ముందు కౌన్సిలింగ్‌లాంటిది లేకగానీ, వుంటే మాత్రం ఆడపిల్లల్లో చాలామంది ఎమ్మార్వో జీపు డ్రైవర్లనే చేసుకునేవారు. ఆ పోస్ట్‌కంత వన్నె తెచ్చాడు శ్రీనివాసులు. డ్రైవర్ శ్రీనివాసులంటే ఎవరికైనా ఇట్టే తెల్సిపోతుంది.

అంతా బాగానే వుంది కానీ కూతురు గంటల తరబడి పబ్లిక్ కొళాయి దగ్గర నిలబడి నీళ్ళు పట్టి తెచ్చుకోవడం గంగన్నకు చాలా బాధేసింది. పైగా ప్రతీరోజూ కొళాయి దగ్గర గొడవలు, కొట్లాటలు, ఇవన్నీ చూసి గంగన్న ఒక నిర్ణయానికి వచ్చాడు. తన నిర్ణయాన్ని కూతురికి, అల్లుడికి చెప్పాడు. వాళ్ళు కూడా ఒప్పుకున్నారు.

వెంటనే ఓవైటీ స్కీము కింద పన్నెండు వేల రూపాయలు కొళాయి కోసం కట్టారు. మామూలుగా ఆరువేలు. వెంటనే ఆఘమేఘాల మీద కొళాయి కావాలంటే డబుల్ డబ్బులు కట్టాలంటే కట్టారు. ఆఘమేఘాల మీద రాలేదు కానీ, ఆగి ఆగి మేఘాలమీద నడిచివచ్చినట్టు పైపులొక రోజు, బోల్టులొకరోజు, నట్టులొకరోజు బిగించి మీ ఇంటికి కొళాయి వేశాం అన్నారు మున్సిపాల్టీ వాళ్ళు. అలా అనిపించుకునే లోపు చిల్లర ఖర్చుకని సామాగ్రి ఖర్చుకని మిగిలిన ఎనిమిది వేలు అయిపోయాయి. గోడకు అమర్చిన కొళాయిని చూస్తుంటే, శివుని కంఠంకి చుట్టుకున్న నాగుబాములా అనిపించింది గంగన్నకు.

కొళాయి వచ్చేసింది ఇక రావాల్సింది నీరు.

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకు నీళ్ళొస్తాయని ఫిట్టర్ చెప్పిపోయాడు. సంతోషం పట్టలేక యాభై రూపాయలు ఫిట్టర్‌కిచ్చాడు గంగన్న.

నీళ్ళొచ్చే టైమయింది. ఆరోజు శ్రీనివాసులు కూడా తొందరగా డ్యూటీ

ముగించుకొని ఇంటికొచ్చాడు. కొళాయి దగ్గర ముగ్గువేశారు. కొళాయి మెడలో పూదండ వేశారు. ఒక ప్రక్క కొబ్బరికాయ, అరటి పండ్లు పెట్టి అగరొత్తులు వెలిగించారు.

సరిగ్గా ఆరుగంటలయ్యింది. శ్రీనివాసులు ఒక చేత్తో కోడి, మరో చేత్తో కత్తి పట్టుకొని రడీగా ఉన్నాడు. గంగన్న కొళాయి మూత అటుఇటు తిప్పాడు. బయ్ బయ్‌మని రెండుసార్లు, బుయ్‌బుయ్‌మని మరో రెండుసార్లు శబ్దం వచ్చింది.

"అద్గదిగో వస్తున్నాది. ముందు అన్న, తర్వాత తమ్ముడు వస్తాడు" అన్నాడు గంగన్న. కూతురికి, అల్లుడికి అర్థంకాలేదు. అది గ్రహించి గంగన్న చెప్పాడు.

"ముందు గాలి దేవుడు, తర్వాత నీటి దేవుడు వస్తారు. కొయ్! కోడిని కొయ్" అని చిన్నపిల్లాడిలా అరిచాడు. వెంటనే కోడి మెడ తెగి కిందపడింది.

కోడి నుండి చెంబుడు రక్తం వచ్చింది గానీ కొళాయి నుండి మాత్రం గ్లాసుడు నీళ్ళు కూడా రాలేదు.

ఏమైంది చెప్మా! ఎందుకు నీళ్ళు రాలేదని అటుఇటు కాలుకాలిన పిల్లిలా తిరిగాడు గంగన్న. వాళ్ళకే కాదు, ఆ వీధి మొత్తం ఎవరికి రాలేదని తెల్సింది. అందరూ కల్సి మెయిన్ రోడ్డు మీదకు వెళ్ళి చూస్తే ఇంకేముంది పైపులు పగిలిపోయి నీళ్ళు రోడ్డు మీదకు చిమ్ముతున్నాయి. తెల్సిందేమిటంటే రోడ్డు వెడల్పు చెయ్యడానికి కరంటు స్తంభం అడ్డువస్తే ఆ స్థంబాన్ని పక్కకు జరిపారు ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు వాళ్ళు. అలా జరిపేటప్పుడు కింద పైపులున్నాయని తెలియక వాటిని పగల గొట్టేశారు.

కొత్త పైపులు వచ్చి, అవి వేసేసరికి వారంరోజులు అవుతుందట. అంతవరకు ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతుందని తెలిసింది. వారం రోజులయ్యేసరికి రోడ్డుమీద పైపులు వచ్చి పడ్డాయి. వాటిని చూసి గంగన్నకు చాలా సంతోషం వేసింది. ఇంక రెండు మూడు రోజుల్లో పైపులు వేసేస్తారు. నీళ్ళొచ్చేస్తాయని అనుకున్నాడు. రోజూ ఉదయాన్నే లేవడం– పైపులు వేసారేమో చూడడం – నాలుగు రోజుల నుండి ఇదే పనైపోయింది గంగన్నకు. ఫిట్టరొచ్చి ఈ రోజు

రాత్రికి పైపులు వేస్తున్నాం. రేపు తెల్లవారి మీ వీధికి కొళాయి లొస్తాయని చెప్పాడు. ఆ రాత్రి గంగన్నకు సరిగ్గా నిద్రపట్టింది కాదు. ఎప్పుడు తెల్ల వారుతుందా? ఎప్పుడు కొళాయిలో నీళ్ళొస్తాయా అని మగత మగతగా గడిచింది రాత్రంతా!

తెల్లారేసరికి మెయిన్ రోడ్డుమీదకెళ్ళి చూసారు. పైపులు రోడ్డుమీద లేవు. పైపులు వేసినందుకు చాలా ఆనందం కలిగింది. కానీ ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. వి.ఐ.పి.ల విజిట్లో వేసిన రోడ్డు లాగ కొద్ది సేపటిలోనే కనుమరుగై పో యింది. పైవులు ఒక పక్కనుండి వేస్తుంటే మరోపక్క నుండి తీసేస్తున్నారు.

రాత్రివేసిన పైపులు తెల్లారేసరికి ఎందుకు తీసేస్తున్నారని అడిగితే, రోడ్డు వెడల్పు చెయ్యాల్సినచోట పైపులువేస్తే, ఎప్పుడైనా రిపేర్లొస్తే, కష్టమని, చాలాముందు చూపుతో మరికొంత దూరం జరిపి వేస్తామని, అందుకే వేసిన పైపులు తీసేస్తున్నామని చెప్పారు. అందువలన ఆ వీధికి మరికొన్నాళ్ళపాటు కొళాయి నీళ్ళు రావని తేల్చి చెప్పేశారు.

వారం రోజులపాటు కష్టపడి రోడ్డు వెడల్పు చేశారు. ఆ పక్కనే పైపులు కూడా వేసేశారు. ఒకరోజు సాయంత్రం ఫిట్టరొచ్చి రేపు ఉదయం ఆరు గంటలకు నీళ్ళొస్తాయని చెప్పాడు. పార్లమెంటుకు మళ్ళా ఎలక్షన్లొస్తాయంటే నమ్ముతాం గానీ రేపు నీళ్ళొస్తాయంటే మాత్రం నమ్మలేమన్నారు వీధి జనాలు.

గంగన్న మాత్రం వేకువజామున నాలుగు గంటలకే లేచాడు. తలకి స్నానం చేసి, కొళాయికి పూజలు చేసి ఆరుగంట లెప్పుడవుతుందా? నీళ్ళెప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

ఆరయ్యిందిగానీ నీళ్ళు మాత్రం రాలేదు. పక్క ఇళ్ళలోకి చూశాడు. వాళ్ళకీ రావడం లేదు. మెయిన్ రోడుమీదకొచ్చి చూసాడు. చూస్తే ఏముంది? రోడ్డుకి అడ్డ దిడ్డంగా గుంతలు తవ్వి ఉన్నాయి. మొన్న వెడల్పు చేసి వేసిన తారురోడ్డు కూడా తవ్వి పారేశారు. ఎందుకు ఏమిటని అడిగితే టెలిఫోను డిపార్టుమెంటు వాళ్ళు కేబుల్స్ వేస్తున్నారట. అందుకే ఇంకో వారం రోజులు కొళాయిలు రావని తెల్సింది.

గంగన్నకు కోపం ఆగింది కాదు. మున్సిపాల్టీ వాళ్ళను నానాబూతులు తిడుతూ గుంతను దాటబోయి అందులో పడిపోయాడు. ఎక్కడ దెబ్బ తగిలిందో ఏమో ఆ పడటం పడటమే మరి లేవలేదు. స్పృహ తప్పిపోయింది.

వారంరోజులుగా మంచానపడి ఉన్నాడు. ఈ వారం రోజులు కూడా కన్ను తెరిచి చూడలేదు. కూతురు లబోదిబోమంటూ నాయినా నన్ను ఒక్కసారి చూడవా అని ఏడ్చింది. అయినా చూడలేదు. మామా నాకేమాటా చెప్పవా అని అడిగేవాడు అల్లుడు. అయినా ఒక్కమాట చెప్పలేదు. కానీ ఆఖరి రోజున అంత అపస్మారక స్థితిలోనూ ఒక్కమాట మాత్రం మూడుసార్లు అన్నాడు.

"గంగ! గంగ! గంగ!" అని. ఆ మాట వినగానే కూతురికి అతనిచ్చిన కాశీ గంగ పాత్ర గుర్తొచ్చి అది తేవడానికి వెళ్ళింది. దేవుని ఫొటోముందు పెట్టిన పాత్ర కనిపించలేదు. అన్నిచోట్ల వెతికింది. ఎక్కడా దొరకలేదు.

బిందెలో నీళ్ళైనా తెచ్చి తండ్రి నోట్లో పోస్తాననుకుంది. అప్పుడామెకు కొళాయి గుర్తొచ్చి అక్కడకు వచ్చింది.

తండ్రి ప్రాణాలు తీస్తున్న ఆ పైపులు యముని పాశంలా కనబడే సరికి ఆమెలో కోపం, ఆవేశం ఒక్కసారే కమ్ముకున్నాయి. శక్తినంతా కూడ దీసుకొని ఒక్క తన్ను తన్నింది. ఆ తన్నుకి గోడకు బిగించిన బోల్టు ఊడొచ్చింది.

బ్లోక్! బ్లోక్! బ్లోక్! మంటూ కొళాయి నుండి నీళ్ళొచ్చాయి. ఆ నీటిని దోసిట పట్టి తండ్రి మంచం దగ్గరకు పరుగెత్తింది.

"నాయినా! కాశీ గంగ నాయినా! తాగు! తాగు!" ఏడుస్తూ అరిచింది కూతురు. రెండు గుక్కలు వేసి ప్రాణాలు వదిలేశాడు తండ్రి.

తాను తాగింది కొళాయి గంగని తెలిస్తే ఆతని ఆత్మకు ఎంత శాంతి!!!

# పెద్ద కాలువ

భారతదేశంలో గంగానది ఎంత పవిత్రమైనదో, ఆ మున్సిపాలిటీలో పెద్ద కాలువ అంతకన్నా పవిత్రమైనది.

ఆ ఊరి ప్రజల కల్మషాన్నంతటిని తన కడుపులో దాచుకుంటుంది. గబ్బునంతటినీ గుండెల్లో ఇముడ్చుకుంటుంది. ఇళ్ళలో చచ్చిన ఎలుకల్ని, పిల్లుల్ని, ఆఖరికి నెలలు నిండక ముందు తీసేసిన కడుపుల్ని, పుట్టగానే గొంతు పిసికేసిన శిశువుల్ని, చర్మాన్ని వొలిచేసి విసిరేసిన పశువుల్ని– ఇలా ఎన్నో అకృత్యాల్ని, ఎంతో దుర్మార్గాన్ని తనలో ఇముడ్చుకొని ఊరి మధ్యలోంచి నిండు గోదారిలా గాంభీర్యంగా, కొండచిలువలా హుందాగా ప్రవహిస్తోంది మురికికాలువ!

గుడిలో పూజారి దండకం చదివి ఒక చేత్తో గుగ్గిలం పిడత, మరోచేత్తో నెమలికన్ను పట్టుకొని ధూపం వేస్తుంటే అమ్మవారికి ఎంత ఆనందంగా వుంటుందో – ఏ ఇల్లాలో ఇళ్ళు ఊడ్చేసి, ఒక చేత్తో చీపురు, మరోచేత్తో చేటనిండ కసువుని పట్టుకొని తనలో పడేస్తే ఆ కాలువకంత ఆనందంగా ఉంటుంది. కొత్త బట్టలేసుకొని, ఆఫీసుకు బయల్దేరుతూ లేకలేక పుట్టిన కొడుకుని ఎత్తుకుంటే వాడు ఒంటేలు పోసేస్తే, ఆ తండ్రి ఎంత పులకించిపోతాడో– ఏ పిల్లాడైనా బట్టలన్నీ విప్పేసి గబగబ తన దగ్గరకు పరుగెత్తుకొచ్చి తన భుజంమీద కూచుని వాడి పని కానిస్తుంటే– అంత పులకించిపోతుంది. ఆడమ్ బతికొస్తే కోటానుకోట్లు వారసులైన మనుష్యులంతా ఒక్కసారి తాతయ్యా! అని అతని మీద మూగితే

ఎంత మైమరచిపోతాడో, ఝుమ్మని ఓంకార నాదాన్ని చేస్తూ తనపై ముసురుతున్న దోమల్ని చూసి అంత మైమరిచిపోతుంది ఆ మురికి కాలువ...

మురికి కాలువకి పెద్ద చిన్న భేదంగానీ, ఉన్నోడు, లేనోడని తారతమ్యం గానీ లేదు. కోట్లకు పడగలెత్తిన కుబేరుడైనా, కడుబీద కుచేలుడైనా ఆ మురికి కాలువలో కలవవలసిందే! దాని పెద్ద మనసుని గుర్తించేమో దాన్ని అందరూ 'పెద్దకాలువ' అని ముద్దుగా పిలుస్తుంటారు.

ఇలా ఎన్నో ఏళ్ళుగా ఎంతో ఆనందంగా గడిచిపోతున్న ఆ మురికి కాలువ జీవితంలో ఒకనాడు హఠాత్తుగా చీకట్లు ముసురుకున్నాయి.

ఆ మున్సిపాల్టీలో 'గుంటెప్పని' ఒక వ్యక్తి వున్నాడు. ఊరి బయట ఉన్న కొట్టాల్లో అతని నివాసం. పక్కనున్న పల్లెల్లో కరువొచ్చి, అతను, అతనితోపాటు మరో యాభై కుటుంబాలు వలన వచ్చి ఆ మున్సిపాల్టీలో సెట్లర్స్‌గా సెటిల్ అయిపోయారు.

1994లో మున్సిపాల్టీకి ఎలక్షన్లు జరిగినాయి. పోటీ– పోటాపోటీగా నువ్వా, నేనా అన్నంతగా ఉంది. ప్రతీ ఓటు ఇంపార్టెంటు అయి కూర్చుంది. అలాంటి సమయంలో నాయకుల దృష్టి ఆ సెట్లర్స్ మీద పడింది. ఓ అర్ధరాత్రి ఛైర్మన్ కేండెట్, కౌన్సిలర్ కేండెట్, పార్టీ నాయకులు మొత్తం కదిలి ఆ ప్రాంతానికి వచ్చారు.

సెట్లర్స్ తో ఓ రెండు గంటలు చర్చలు జరిగాయి.

సెట్లర్సు గుడిసెలన్నీ ముప్పైవార్డుకి ఆనుకొని ఉన్నాయి. కాబట్టి తొమ్మిది గంటలకే వాళ్ళు ఓట్లన్ని ముప్పయి వార్డులో వేసేసి – సాయంత్రం అయిదులోపు ఇంకో ఐదు వార్డుల్లో దొంగోట్లు వెయ్యాలి. దానికి బదులుగా వాళ్ళందరికీ ఊరి మధ్యలో పాక వేసుకోవడానికి స్థలం చూపించాలి – ఇది సెట్లర్స్‌కి, నాయకులకి మధ్య జరిగిన ఒప్పందం.

ఈ ఒప్పందం కుదర్చడంలో ఇటు నాయకులకి, అటు ప్రజలకి మధ్య సంధానకర్తగా ప్రముఖ పాత్ర వహించాడు గుంటెప్ప. ఎలక్షన్సులో ఛైర్మన్, వాళ్ళ మనుష్యులు అఖండ మెజార్టీతో గెలిచారు.

ఒప్పందం ప్రకారం ఇప్పుడు సెటిలర్స్‌కి ఊరి మధ్యలో స్థలం ఇవ్వాల్సి ఉంది.

చైర్మన్ గారు టౌనింగ్ ప్లానింగ్ వాళ్ళను పిల్చి ఖాళీ స్థలం ఎక్కడుందో చూడమన్నాడు. ఖాళీ స్థలాలు చాలా ఉన్నాయి. కానీ అవి పబ్లిక్ పర్పస్‌కి వుపయోగించాలి. ఇలా కొట్టాలు వేసుకోవడానికి వీల్లేదని చెప్పారు. ఇంకెక్కడా స్థలం లేదు.

ఇదిగో అదిగో అంటూ ఆర్నెల్లు గడిచి పోయింది. ఒప్పందం ప్రకారం కొట్టాలేసుకోడానికి స్థలం ఇవ్వలేదు చైర్మన్. స్థలాలిస్తున్నారని తెలిసి సెటిలర్స్ చుట్టాలు పక్కాలు అందరు వచ్చి చేరుకున్నారు. ఇప్పుడు సూటయాభై కుటుంబాలైనాయి. మధ్యవర్తిగా ఉన్నందుకు గుంటెప్ప మీద ఒత్తిడి ఎక్కువ అవుతోంది. కొంతమంది కిట్టనివారు గుండెప్పకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. ఏమనంటే చైర్మన్ దగ్గర కొంత కతికేసి మనకి అన్యాయం చేస్తున్నాడని. దాంతో గుంటెప్పకు పౌరుషం పొడుచుకొచ్చింది. అందర్నీ పిల్చుకొచ్చి మున్సిపల్ ఆఫీసు ముందు పెద్ద ధర్నా చేయించాడు. నాల్రోజుల్లో స్థలాలివ్వకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని అల్టిమేటమ్ కూడా ఇచ్చాడు.

దాంతో గుంటెప్ప నిజాయితీని, త్యాగ బుద్ధిని, తెగింపుని చూసి ప్రజలెంతో ముచ్చటపడిపోయారు. అనవసరంగా అపార్థం చేసుకున్నామని తెగ నొచ్చుకున్నారు.

ఈ స్వతంత్ర విశాల ప్రజాస్వామిక దేశంలో ప్రజల అవసరాల పునాదిపై ఒక కొత్త నాయక వృక్షం మొలకెత్తడానికి బీజం పడిపోయింది.

గుంటెప్ప తాకిడికి తట్టుకోలేక కమిషనర్ని, హెల్తాఫీసర్ని, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ని, కొంతమంది ముఖ్యులైన కౌన్సిలర్స్‌ని పిల్చి సమస్య గురించి చర్చించాడు చైర్మన్. రెండుగంటలపాటు మీటింగ్ నడిచినా పరిష్కారం ఎవ్వరూ చెప్పలేక పోయారు.

ఆ సాయంత్రం హెల్తాఫీసర్ చైర్మన్ ఇంటికి వెళ్ళాడు. "మధ్యాహ్నం

కమిషనర్ ఎదురుగా చెప్పడం బాగుండదని చెప్పలేదుగానీ గుంటెప్ప సమస్యకు పరిష్కారముంది" అన్నాడు హెల్తాఫీసర్.

"ఏంటది?"

"శివాలయం టర్నింగ్ దాటిన తర్వాత రెండు వీధుల నీరే పెద్ద కాలువలోకి వస్తాయి"

"ఏ వీధులు"

"బ్రాహ్మణవీధి, కోమటి గేరి – కోమట్లలో కలిగినోళ్ళు పట్నాలుపోయి వ్యాపారాలు చేసుకుంటున్నారు. బ్రాహ్మలు కూడా ఉద్యోగాల్జేసుకుంటున్నారు– రోజుకి నాలుగుసార్లు స్నానాలు ఎవరు జేస్తున్నారు. పెద్దగా యూసేజ్ లేదు. కాలువ మాత్రం కె.సి.కెనాలంత ఉంది"

"అయితే ఏంజెయ్యమంటావ్"

"విను. విను. కాలువకు రెండు అడుగులు వదిలేసి రెండు పక్కల తలో ఇరవై బళ్ళ మట్టేసుకోమంటే – వాళ్ళే పూడ్చేసుకుంటారు. కొట్టాలు వేసుకుంటారు. సమస్య సాల్వ్ అయిపోతుంది"

హెల్తాఫీసర్ ఇచ్చిన సలహాకి ఎంతో సంతోషపడిపోయాడు చైర్మన్. పరిపాలన నడిపేటప్పుడు స్వంత కులస్థుడు ఒక్కడైనా ఉండాలనేవాడు తన తండ్రి. కులం విలువ మళ్ళీ తెలిసొచ్చింది చైర్మన్‌కి.

ఉదయానికే కబురు వెళ్ళిపోయింది –సెట్లర్స్‌కి.

ఇంట్లోని తల్లీ, పిల్లా, ముసలీ ముతకా అంతా కలిసీ తలో తట్టా, బుట్టా, పార, పలుగు, గంప, చేటా పట్టుకొని పెద్దకా లువ కప్పేయడానికి బయల్దేరి పోయారు.

ఆల్‌మట్టి డ్యాం నిర్మాణానికి చూపిస్తున్న చొరవ ప్రదర్శించి పెద్ద కాలువకు శివాలయం టర్నింగ్ దగ్గర నుండి సుమారు ఒక మూడొందల మీటర్ల పొడువున

కప్పెట్టేశారు. రెండు సైడుల మూసేస్తుంటే తనే సూసైడ్ చేసుకుంటున్నట్టనిపించింది. తననెవరో హత్యచేసి భూమిలో పాతి పెడుతున్న ఫీలింగ్ కలిగింది కాలువకి.

ఇంతకీ హెల్తాఫీసర్‌కి ఈ ఆలోచన ఎందుకు వచ్చిందంటే– గతసారి సి.ఎం. గారు ఆకస్మిక తనిఖీకి వచ్చినప్పుడు శివాలయం టర్నింగ్ దగ్గర నిలబడి పెద్దకాలువను చూశాడు. కాలువలో పేరుకు పోయిన మట్టిని, మట్టి పైన చెరుకు చేను లాగ మొలిచిన గడ్డిని, కాలువనే పిచ్‌లా చేసుకొని క్రికెట్ ఆడుతున్న ఎలుకల్ని, అంపైర్ లాగ కళ్ళు తిప్పకుండా ఎలకల్ని చూస్తున్న పాముని– పాముకి భయపడి బొరియల్లో దాక్కున్న కప్పల్ని– ఇలా ఫారెస్టుకి తక్కువ, జూకి ఎక్కువ అనిపించే పెద్ద కాలువ అనబడే దాన్ని సి.ఎమ్ గారు చూడనే చూశారు. కళ్ళతోనే నిప్పులు కురిపించారు. నిలువునా చీరేస్తానన్నాడు. మళ్ళీ వచ్చేసరికి కాలువ ఇలా కనిపించడానికి వీల్లేదని హెల్తాఫీసరుకు హుకుం జారీచేసి వెళ్ళారు సి.ఎమ్.

“ఈ కాలువను ఇలా కనబడనివ్వను” అని గట్టిగా నిర్ణయించుకున్నాడు హెల్తాఫీసర్. అందుకే అలా కనబడకుండా చేసేశాడు.

మూడువందల మీటర్ల పొడువున కాలువకి రెండుపక్కల నూటయాభై గుడిసెలు వచ్చి కాలువలో పడ్డాయి. చిన్న వర్షాలకే పట్టణాలు మునిగి పోతున్నాయంటే కారణం కాలువలు కప్పెయ్యడమే!

# పుట్టినిల్లు

స్థానిక సంస్థలు భావి నాయకులకు జన్మనిచ్చే పుట్టినిల్లు. అంతే కాదు ప్రజాస్వామ్యానికి అవి ప్రయోగశాలలు అంటారు.

నిజమే నేటి కౌన్సిలరే రేపటి ఛైర్మన్. రేపటి ఛైర్మనే ఎల్లుండికి ఎమ్మెల్యే.

కౌన్సిలర్ అయిన తర్వాత రామాంజనేయులుకి గొప్ప తెలివొచ్చి పడిపోతోంది. డబ్బు కూడా వచ్చి పడిపోతుందంటారు. కానీ ఆ విషయం అతనంతగా పట్టించుకోడు. ఎందుకంటే అది అతని భార్య శ్రీలక్ష్మి చూసుకుంటుంది. అతనికి మాత్రం ప్రజాసేవే పరమావధి.

తను కౌన్సిలరుగా గెల్చిన వెంటనే ఎకాఎకిన తిరుపతి వెళ్ళి గుండు గీయించేశాడు. ఆతర్వాత శ్రీశైలం వెళ్ళి మొక్కు తీర్చుకున్నాడు. ఆ తర్వాత షిర్డీ వెళ్ళి నాలుగురోజులుండి వచ్చాడు. మంత్రాలయం వెళ్ళి రాఘవేంద్రస్వామి దర్శనం చేసుకుని వస్తుంటే ఒక ముసలాడు కనబడ్డాడు. మరి రాఘవేంద్రస్వామే అలా కనబడ్డాడో, వెంకన్నస్వామి దర్శనమిచ్చాడో, మల్లన్నకే దయగలిగిందో ఏమైందో సరిగా తెలీదుకానీ, ఆ ముసలాడు తన చెయ్యి పట్టుకొని ఆపి "నాయినా నిన్ను నమ్మినవాళ్ళను అన్యాయం చెయ్యొద్దు" అని ఒకే ఒక్కమాట చెప్పి గుంపులో కల్సిపోయాడు.

నలుగురు కనిపిస్తే చాలు జరిగిన అనుభవాన్ని ఒళ్ళంతా గగుర్పాటుకు లోనయిన ఫీలింగుతో ఆ విషయం చెబుతుంటాడు రామాంజనేయులు.

ఇలాగే ఒక రోజు ఈ అనుభవం గురించి చెబుతుండగా తనతోటి ముగ్గురు కౌన్సిలర్లు వచ్చారు. వాళ్ళను సాదరంగా ఆహ్వానిస్తూ చుట్టూ కూర్చున్న వాళ్ళను బయటకి పంపించేసాడు. "ఏంటి చెప్పండి" అన్నాడు వాళ్ళనుద్దేశించి. "ఈనెల అజెండా చూశావన్నా!" అన్నాడు వెంకట స్వామి. అతను ఎనిమిదో వార్డు కౌన్సిలరు.

"ఇంక చూళ్ళే ఏం!"

"ఏమి అన్యాయమన్నా ఇది. నా వార్డులో ఒక్క వర్కులేదు. ఇతని వార్డులో అస్సల్లేదు. పోనీ వర్కుల్లేకపోతే పోయె! ఆ కమిషనర్‌కి, ఆ చైర్ పర్సన్‌కి టెండర్లు ఈ మీటింగులో పెట్టొద్దని చెప్పాం. మావాళ్ళకి ఒక్క టెండరు రాలేదు. వచ్చిన వాళ్ళు మా దగ్గరకి వచ్చినవరకు టెండర్లు కౌన్సిల్ మీటింగుకి రాకుండా చూసుకోతల్లీ అని మొక్కి మొక్కి చెప్పినాం. ఏంజేసిందో చూడు" అని చేతిలోని అజెండా కాపీ విసిరికొట్టాడు జగదీష్.

"ఈ దఫా మీటింగులో మన తడాఖా చూపించాలి. లేకపోతే మనకి వేల్యూ ఉండదు. మన పనులు జరగవు. మన కేష్టు అన్యాయమైపోతుంది" అని ఇంకా ఏదేదో శోషవచ్చి పడిపోయినంత ఆవేశంగా మాట్లాడాడు వెంకటస్వామి. కుమార్ మాత్రం ఏం మాట్లాడలేదు. ఎందుకంటే కుమార్ కొత్తగా గెల్చిన కౌన్సిలరు. ఇది అతని మొట్టమొదటి కౌన్సిల్ మీటింగు అంతా విని రామాంజనేయులు చాలా కూల్ గా మాట్లాడాడు.

"వెంకటస్వామీ! నువు ఇండిపెండెంటువి. జగదీష్ మావాళ్ళతో పొత్తు పెట్టుకుని గెల్చినవాడు. ఇక కుమార్ జాతీయ పార్టీకి చెందినవాడు. నాది ప్రాంతీయ పార్టీ. మనందరం పార్టీలు, సింబల్స్, స్లోగన్స్, మేనిఫెస్టోలు అన్నీ మర్చిపోయి ఒక గూటిలోకి ఎందుకు చేరినాం. ఒక బాటలో ఎందుకు నడవాలనుకున్నాం. కేష్టు కోసం. మనం గెలవడానికి కారణం కేష్టు. కాబట్టి కేష్టుకి అన్యాయం జరిగినా, కేష్టుకి న్యాయం జరగకపోయినా చూస్తూ సహించేది

ఎంతమాత్రం లేదు. పైగా నిన్ను నమ్మినవాళ్ళను అన్యాయం చెయ్యొద్దని సాక్షాత్తు దేవుడే చెప్పాడు" అని ఎంతో ఆవేశంతో ప్రసంగించి గ్లాసుడు మంచినీళ్ళు గటగట తాగాడు రామాంజనేయులు.

కేష్టు పట్ల రామాంజనేయులుకున్న కమిట్మెంటు చూసి వాళ్ళకు చాలా సంతోషం వేసింది.

"సరేనన్నా! రేపు మీటింగులో ఏంచేయాలో చెప్పు!" అన్నారు.

"మనం అడిగిన పనులు పెట్టలేదు కాబట్టి, మనం పెట్టొద్దని అడిగినా టెండర్లు పెట్టింది కాబట్టి రేపటి కౌన్సిల్ మీటింగ్ రసాభాస కావాల్సిందే. కుమార్ నువ్వు అజెండా చదవకముందే లేచి చైర్మన్ గారూ! మా వార్డులో శానిటేషన్ ఏమీ బాగోలేదు. కాలువలు క్లీన్ చెయ్యట్లేదు. కసువు కుప్పలు ఎత్తట్లేదు. నాలుగు పందులు చచ్చిపోయి రోడ్డు మీద పడివున్నాయి. కుళ్ళి కంపు కొడుతున్నాయి. ఇదేంటిది! నా వార్డంటే చిన్న చూపా? లేకపోతే మా వార్డులోని వారు ప్రజలు కారా! శానిటేషన్ వారికి అవసరం లేదా" అని అడుగు.

చైర్మన్ వెంటనే కమిషనర్ వైపు చూస్తుంది. కమిషనర్ హెల్తాఫీసర్ వైపు, హెల్తాఫీసరు ఇన్‌స్పెక్టర్ వైపు ఇన్ స్పెక్టర్ మేస్త్రీ వైపు చూస్తారు. వాళ్ళలా ఒకర్నొకరు చూసుకుని జవాబిచ్చేలోపల నువు రెచ్చిపోయి అడగాలి.

"ఏమని" అడిగాడు కుమార్.

"ఏమైనా అడగొచ్చు. శానిటేషన్ మీద నుండి టౌను ప్లానింగ్ విషయాలు మాట్లాడు. తర్వాత స్కూళ్ళు ఆ తర్వాత రోడ్లు. తర్వాత కుళాయిల్లో నీరు సరిగా రావట్లేదని చెప్పు. ఆ తర్వాత బిల్ క్లింటన్ విజిట్ గురించి, నేపాల్ రాజు గురించి, తర్వాత 'చాలాబాగుంది' సిన్మాగురించి.

"వాటితో మనకేం సంబంధం" అన్నాడు కుమార్.

"ఓరి పిచ్చోడా! కౌన్సిల్లో ప్రస్తావనకు కాదేది అనర్హం! ఏదైనా మాట్లాడేయొచ్చు! అన్నీ మాట్లాడేసి మీరు, మీ పార్టీ వాళ్ళు, మీ పార్టీ అధ్యక్షులు లంచగొండులు అను"

"దాంతో నేను రెచ్చి నీమీద పడతాను. మమ్మల్ని ఏమైనా అను గానీ మాపార్టీ అధ్యక్షుడ్ని ఒక్కమాటన్నా నీ రక్తం కళ్ళ జూస్తానని ఆవేశంతో ఊగిపోతాను. అది చూసి మీవాళ్ళు నామీద పడతారు. మావాళ్ళు మీవాళ్ళ మీద పడతారు. ఇలా మేము ఒకర్నొకరం తోసుకుంటుండగా, ప్రజాస్వామ్యాన్ని చంపేయకండి! స్వేచ్ఛని బతికించండని! అని ఆవేశంతో ఊగిపోయి అలవోకగా మైకు ఊడదీసి, గాలిలోకి విసరాలి"

"ఎటువైపు విసరాలి" కుమార్ ప్రశ్నించాడు.

"ఎటు విసిరినా ఫర్వాలేదు. ఆ మైకు వెళ్ళి చైర్‌పర్సనుకు తగలాలి. దాంతో మా వాళ్ళింకా రెచ్చిపోయి నీ మీదకు వస్తారు"

"అమ్మో మీవాళ్ళు నన్ను తంతారేమో!" భయపడుతూ అడిగాడు కుమార్.

"నిజానికి తన్నాలి! కానీ వెంకట స్వామి, జగదీష్ అప్పటికే నీ చుట్టూ చేరి నువు చేసింది తప్పని నిలదీస్తుంటారు. అదే సమయంలో మావాళ్ళు నిన్ను తన్నకుండా నిలువరిస్తుంటారు. అంటే నిన్ను ఒకపక్క తిడుతూ మరోపక్క రక్షిస్తారన్న మాట. అర్థమైందా?"

ఈసారి వెంకటస్వామి, జగదీష్‌ని అడిగాడు రామాంజనేయులు. అర్థమైందన్నారు వాళ్ళు.

"అలా మీరు కుమార్‌ని మీ ఇద్దరి మధ్య ఇముడ్చుకొని ఛైర్మన్ టేబిల్ దగ్గరకు తీసుకువెళ్ళండి. మా పార్టీ వాళ్ళు ఒకంతట వదలరు. నేను వాళ్ళందర్నీ దూరంగా నెడుతూ, మీ దగ్గరకు వస్తాను. ఇలాగే అందరం ఛైర్మన్ టేబిల్ ముందుకొస్తాం. అప్పటికే మీ ఇద్దరూ కుమార్ చేసిన పనిని ఖండిస్తున్నట్లు, కుమార్ చేత ఛైర్‌పర్సన్‌కి క్షమాపణ చెప్పించడానికి ఒత్తిడి చేస్తున్నట్టు ఎస్టాబ్లిష్ చెయ్యాలి.

ఇలా ఈ గందరగోళంలో చైర్ పర్సన్ ఉక్కిరిబిక్కిరి అవుతుంటుంది. చెమటలు పడతాయి. కాళ్ళుచేతులు ఆడవు. నోటి మాట రాదు. ఇలాంటి పరిస్థితిని చూస్కొని వెంకటస్వామి కుమార్‌ని ఆమె మీదకు నెట్టాలి.

సెంటీమీటర్ నెడితే కిలోమీటర్ దూరం నెట్టిన ఫీలింగుతో పడిపోతావ్. జగదీష్ నిన్ను ఆపబోతాడు. ఆ నెపంతో ఆమె మీద చెయ్యేసి చీరో, జాకెట్లో చింపేయాలి! ఎవరు చింపారో తెలీకూడదు.

ఆ తర్వాత కుమార్ ని అక్కడినుండి తప్పించి ఇంటికి పంపించెయ్యండి''

''ఇదంతా తప్పుకాదా'' అమాయకంగా అడిగాడు కుమార్.

''తప్పే. కానీ నేరం కాదు. నేరాలు చేసినవాళ్ళే అధికారం చెలాయిస్తున్నారు. వాళ్ళే రాజ్యాలు ఏలుతున్నారు. తప్పులు చెయ్యకుండా నేరాలు చేసే స్థాయికి ఎదగలేం. కాబట్టి ఈసారి నేను చెప్పినట్టు చేయండి. మరోసారి చైర్‌పర్సన్ మనం చెప్పింది చెయ్యకపోతే మీ చెప్పుతో నన్ను కొట్టండి'' అని ముగించాడు రామాంజనేయులు.

గీతోపదేశం విన్న ముగ్గురు అర్జునులూ లేచారు; ఆ ముగ్గురు కౌన్సిలర్లు. ఇదిగో ఇకముందు ఇలా ఇళ్ళ దగ్గర కల్సుకోవద్దు. వచ్చే వారం మన కులపోళ్ళం వనభోజనం ఏర్పాటుచేసుకొని అక్కడకల్సుకుందాం.

'సరే'నంటూ బయటికొచ్చారు ముగ్గురు.

# తేడా

మనం లంచం ఇచ్చామనుకోండి. పుచ్చుకునేవాడు చల్లగా పుచ్చుకుంటాడు. పుచ్చుకోనివాడు ఒకసారే వద్దంటాడు. ఇంకా ఎక్కువ కావాలనుకునే వారు నాలుగుసార్లు వద్దంటారు.

"వద్దు, వద్దులే, వొద్దూ, వద్దో" అంటాడు.

ప్రతిసారీ అంతో ఇంతో పెరిగితే వద్దంటూనే తీసుకుంటాడు. ఆ ఊర్లో అలాంటి ఆఫీసర్లు ఇద్దరున్నారు. ఒకరు ఎమ్మార్వోగారు, మరొకరు కమిషనర్ గారు. ఇద్దరు మంచిమిత్రులు. ప్రతిరోజూ పేకాటలోనో, డ్రింకు దగ్గరో ఎక్కడో ఒకచోట కల్సుకుంటుంటారు. వాళ్ళిద్దరూ కూర్చున్నప్పుడు భలే తమాషా విషయాలు బయటకొస్తుంటాయి.

ఒకసారి ఇద్దర్లో ఎవరు చెప్పారో గానీ అవినీతిపరులు మూడు రకాలట. మొదటి రకం మేక వర్గం. మేక నీళ్ళు ఎలా తాగుతుంది. చెరువులోకి దిగకుండా బయటే ఉండి పెదాలు ఆన్చి గొంతు తడుపుకుంటుంది. నీళ్ళు తాగినట్టే ఉండదు. కానీ తాగుతుంది. లంచం తీసుకున్నట్టే ఉండదుకానీ తీసుకుంటారు. రెండోది గోవు వర్గం. ఆవు నీళ్ళెలా తాగుతుంది. నీళ్ళలో కొంచెం దిగుతుంది. మోకాళ్ళ వరకు. తాగేటప్పుడు కూడా కొంచెం చప్పుడు చేస్తుంది. వీళ్ళు అనుకున్న

ఫిగరు రానప్పుడు అరుస్తారు. అయితే ఆ అరుపులు లంచం కోసమని అనిపించదు. పని బాగోలేదనో డిసిప్లిన్ తగ్గిందనో – ఏది దొరక్కపోతే టెండూల్కర్ బాగా ఆడలేదనో – ఇలా చప్పుడు చేస్తారు. టార్గెట్ రీచ్ కాగానే చల్లగైపోతారు.

ఇక మూడోది దున్నపోతు వర్గం. దున్నపోతు నీటిలో దబాల్న పడిపోతుంది. అటు పొర్లుతుంది. ఇటు పొర్లుతుంది. మొత్తం నీటినే కెలకెల చేస్తుంది. వీళ్ళకి తిండే గమ్యం. ఏది తింటున్నారో చూడరు. ఎంత తింటున్నారో చూడరు. ఎవరి దగ్గర తింటున్నారో చూడరు. వీళ్ళు ఏ సంస్థలో పనిజేసినా తర్వాత అదెందుకూ పనికిరాదు.

ఎమ్మార్వో, కమిషనర్ ఏ వర్గానికి చెందుతారని అడిగితే, తలో విధంగా చెబుతారు. కమిషనర్ రెండు ఎమ్మార్వో మూడంటారు. లేదులేదు ఎమ్మార్వో రెండు, కమిషనర్ మూడంటారు. ఏది ఏమైనా అందరూ కలిసి ఒప్పుకున్న – నిజం ఒకటుంది. అదేమిటంటే ఇద్దరు కూడా ఒకటి మాత్రం కాదని.

అలాంటి వీళ్ళిద్దరు భూమికి సంబంధించిన ఒక విషయంలో ఇరుక్కున్నారు. మున్సిపాల్టీ స్థలంలో పట్టా ఇవ్వడానికి కమిషనర్ రెకమెండ్ చేశాడు. ఎమ్మార్వో పట్టా ఇచ్చాడు. ఆ పట్టా కూడా ఎవరికిచ్చారు? ఎమ్మెల్యేగారి రికమెండేషన్ మీద ఒక కౌన్సిలర్ కీప్ కి.

ఆమధ్య జరిగిన ఎలక్షన్సులో కౌన్సిలర్ ఎమ్మెల్యే వర్గం నుండి ప్లేటు ఫిరాయించి అపోజిషన్ వాళ్ళకి సపోర్టు చేసాడు. తను చేయడమే కాకుండా మరో ఆరుగురి కౌన్సిలర్స్ మద్దతు ఇప్పించాడు. దాంతో ఎమ్మెల్యే బలపర్చిన వ్యక్తి చైర్మన్‌గా ఓడిపోయాడు. ఎమ్మెల్యే ఊరుకుంటాడా? కౌన్సిలర్ భాగోతాలన్నీ బయటకు తీసాడు. సంపాయించిందంతా ఎక్కడ నుండి ఎలా సంపాయించాడో చెప్పమనండని ఎంక్వయిరీ వేయించారు. కౌన్సిలర్ బినామీగా తన బావమరిది పేరున చేయించిన కాంట్రాక్టులమీద, రోడ్డు మార్జిన్స్‌లో పెట్టించిన బంకులమీద – ఇప్పించిన పట్టాలమీద – ఎంక్వయిరీ జరుగుతోంది. మనకో సామెత ఉంది. ముడ్డి మీద తంతే మూతిపళ్ళు రాలినాయని, మూతిపళ్ళు రాలాలంటే ముడ్డిమీద తన్నాలని అర్థం. అలాగే నాయకుల మీద కక్ష తీర్చుకోవడమంటే వాళ్ళకు

సాయంజేసిన ఆఫీసర్ల మీద ఎంక్వయిరీ వెయ్యడమన్నమాట. ఆవిధంగా ఇప్పుడు కమిషనర్ మీద, ఎమ్మార్వో మీద ఎంక్వయిరీ నడిచి పట్టాల సంగతి బయట పడింది. అందులో కౌన్సిలర్ కీప్ కిచ్చిన పట్టా కూడా ఒకటి.

వ్యవహారమేదో గట్టిగా ముదిరిపోయేటట్టుందని గ్రహించిన కమిషనర్ ఎమ్మెల్యే దగ్గరకెళ్ళి ప్రాధేయపడ్డాడు.

"సార్! అప్పుడు మీరు చెబితేనేకదా ఆ పట్టా ఇవ్వొచ్చని రికమెండ్ చేసాను. ఇప్పుడు..."

కమిషనర్ మాట పూర్తికాకుండానే తోక తొక్కిన తాచులా లేచాడు ఎమ్మెల్యే,

"ఏం మాట్లాడుతావయ్యా నువ్వు. నేను చెప్పినవన్నీ చేసేస్తావా? అలాగైతే ఏది మీ మున్సిపల్ ఆఫీసు మా డ్రైవర్ గాడికి రాసిచ్చి చూస్తాను. ఇది ప్రజాస్వామ్యం. మేం ప్రజాప్రతినిధులం. ప్రజలు మా దగ్గరకి వస్తారు. అనేకం అడుగుతారు. మేం ఏదీ కాదనం. చెయ్యమనే చెప్తాం, చెయ్యొచ్చో, చెయ్యకూడదో, ఆలోచించుకొని చెయ్యాల్సిన బాధ్యత నీది. నువు ఇర్రెగ్యులర్ పనులు జేసి నన్నంటావేల! నన్నీ గొడవల్లోకి లాగొద్దు, గెటవుట్" అన్నాడు ఎమ్మెల్యే.

ఎంక్వయిరీ పూర్తయింది. కమిషనర్ మీద, ఎమ్మార్వోమీద యాక్షన్ తీసుకోవాలని రిపోర్టు పంపించారు.

కమిషనర్ మీద ఫైలు హెడ్డాఫీసులో ఉంది. ఎమ్మార్వో ఫైలు కలక్టరాఫీసుకి వచ్చింది.

కమిషనర్ మీద ఏ యాక్షన్ తీసుకోవాలన్న దానిమీద తర్జనభర్జనలు జరిగాయి.

ఇతన్ని వదిలేస్తే మిగతా కమిషనర్లకి భయముండదని, ఇదే అలవాటై పోతుందని, కాబట్టి సస్పెండ్ చేసెయ్యాలని తీర్మానించేసుకున్నారు.

ఎమ్మార్వో మీద తీసుకోవాల్సిన యాక్షన్ గురించి చర్చించి "ఎమ్మార్వో మీద యాక్షన్ తీసుకుంటే డిపార్ట్మెంటు పబ్లిక్‌లో చీప్ అయిపోతుందని కాబట్టి

ట్రాన్స్‌ఫర్ చేస్తే సరిపోతుందని" నిర్ణయించుకున్నారు.

సస్పెన్షన్ ఆర్డర్ అందుకున్న కమిషనర్ ఇంటికొచ్చి గదిలోకి వెళ్ళి ధడాలున తలుపులేసుకున్నాడు.

ఏదో కీడు శంకించిన కుటుంబ సభ్యులు నెత్తినోరు కొట్టుకుంటూ తలుపుల మీదపడి దబదబ బాదారు. పది నిమిషాల తర్వాత తలుపులు తీసుకొని బయటకొచ్చాడు.

ఇంటిల్లిపాది గదిలోకి వెళ్ళి ఫ్యాను వైపు చూసారు. ఫేనుకి తాడు కట్టలేదు. ఫ్యానుకింద స్టూలులేదు.

అందరిలోను ఒకటే ప్రశ్న. తలుపులెందుకు వేసుకున్నట్టు??? రాజకీయ నాయకుల మాటలిని అడ్డమైన పనులు చేసినందుకు తన చెప్పుతో తన చెంపలు వాయించుకున్నాడు.

అదెవరు చూడకూడదని వేసుకున్నాడు తలుపులు.

# లీకేజీ

"కమిషనర్ డౌన్, డౌన్... కమిషనర్ డౌన్, డౌన్" అంటూ ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ మహిళలంతా మున్సిపల్ ఆఫీసు చుట్టూ చేరారు. అందర్లోనూ ఎంతో అసహనం కనిపిస్తోంది. రెండురోజుల నుండీ నీళ్ళు రాకపోతే అసహనమే మరి!
–

కమిషనర్ ఏదో మీటింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళి ఆరోజే వచ్చాడు. ఆఫీసుకు రాగానే ఈ గందరగోళం. గుంపులో ఒక పక్కన కౌన్సిలర్ రామాంజనేయులున్నాడు. "గట్టిగా అరవండి! ఇంకా! ఊ...! కమిషనర్ మీ వీధిలోకి వచ్చి చూసేవరకూ ఇక్కడి నుండి కదలకండి! కూచోండి! కింద బైఠాయించండి" అని పురిగొల్పి చల్లగా అక్కడినుండి జారుకుని కమిషనర్ ఛాంబర్ లోకి వచ్చాడు.

"ఏంటి సార్ ఇది! ఆ ఇంజనీరుకి ఇంత కూడా బాధ్యత లేదు!" కుర్చీ బర్రున ముందుకి లాక్కుని కమిషనర్ కి ఎదురుగా కూర్చున్నాడు. కమిషనర్‌కి చెమటలు పోస్తున్నాయి. ఆఫీసు చుట్టూ రెండవందల మంది మహిళలు ఖాళీ బిందెలు – నినాదాలు– తిట్లు – శాపనార్థాలు. ఇదంతా చూస్తూ వినోదిస్తున్న జనాలు. కమిషనర్‌కి తల కొట్టేసినట్టయింది. "ఇంజనీరు ఎక్కడయ్యా!" అటెండర్‌ని పిలిచి అడిగాడు.

"ఇంకా రాలేదుసార్" అటెండర్ జవాబిచ్చి బయట నిల్చున్నాడు.

"మీరు ఊర్లో లేకపోతే ఇంజనీరు ఆఫీసుకే రాడు సార్" రామాంజనేయులు పితూరీ. అవేమీ విన్పించుకునే స్థితిలో లేడు కమిషనర్. గభాల్న వాటర్ వర్క్సుకి ఫోన్ చేసి అడిగాడు.

"నిన్న, మొన్న హరిజనవాడకి నీళ్ళు విడవలేదా?"

"విడిచాం సార్"

"ఎంత సేపు?"

"మామూలుగా వదిలేటట్టే సార్"

"అంటే ఎంతసేపు?"

"ముప్పావు గంట"

"ముప్పావుగంట నీళ్ళు వదిల్తే – నీళ్ళు రాకపోవడమేమిటి? అదీ రెండు రోజులు పైగా పబ్లిక్ హెల్త్ వారు ఆ ఏరియా అంతా కొత్త పైపులైన్లు వేసారు". కమిషనర్‌కి ఏంచేయాలో పాలుపోలేదు. అటెండర్‌ని పిల్చి ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఎవరున్నారో తీసుకురమ్మన్నాడు. కాస్సేపటికి ఫిట్టరొచ్చాడు.

"ఇంజనీరు ఎక్కడి కెళ్ళాడయ్యా?" ఫిట్టర్‌కి కూడా అదే ప్రశ్నవేసాడు.

"ఏమో తెలీదు సార్!"

"సరే. హరిజనవాడకు నీళ్ళెందుకు రావట్లేదు?"

"ఏమో తెలీదు సార్!"

"ఛ! ఏం మనుషులయ్యా మీరు" విసుక్కుంటూ మహిళల దగ్గరకు వచ్చాడు కమిషనర్. అతన్ని చూసి ఇంకా రెచ్చిపోయారు మహిళలు. వాళ్ళను ఓ అరగంటసేపు బతిమాలి, బుజ్జగించి ఎలాగోలా అక్కడినుండి పంపించేసి హరిజనవాడకు బయల్దేరాడు కమిషనర్.

*****

ఒక మున్సిపల్ కాంట్రాక్టర్ మోపెడ్ డ్రైవ్ చేస్తున్నాడు. ఆ మోపెడ్ వెనుక

సీటులో ఇంజనీరు హనుమంతరావు కూర్చున్నాడు. మోపెడ్ మీద సాక్షాత్తు వినాయకుడు తొండం లేకుండా కూర్చున్నట్టుంది.

మోపెడ్ దిగిన ఇంజనీరు తన గదిలోకి వెళ్ళాడు. అప్పటికే రామాంజనేయులు ఉన్నాడక్కడ, ఒకరికొకరు నమస్కారం పెట్టుకుని షేక్ హాండ్స్ ఇచ్చుకున్నారు. "కమిషనర్ ఏంటి మీ మీద అంత హీటెక్కిపోతున్నాడు?"

"ఎందుకట" చాలా నింపాదిగా అన్నాడు ఇంజనీరు.

"ఎక్కడో నీళ్ళు రాలేదట"

"ఎక్కడట?"

"ఎక్కడో నీళ్ళు రాకపోతే రాకపోవచ్చు. కానీ పదిమందిలో మీ గురించి అతనలా అనకూడదు సార్"

"ఏమన్నాడు?"

"ఏదోలెండి. అతను అనగూడనిది నేను చెప్పకూడనిది, సరేగానీ మావాడి రోడ్డు బిల్లు ఏంచేసారు?"

"చేస్తానుగానీ, ముందు నన్ను కమిషనర్ ఏమన్నాడో చెప్పు"

రామాంజనేయులు ఏదో చెప్పబోగా కమిషనర్ వెహికల్ కాంపౌండ్‌లోకి వచ్చింది. దాంతో ఇద్దరూ అటు వైపు చూసి మాట్లాడటం ఆపేసారు.

ఇంజనీరు వచ్చాడని అటెండర్ చెప్పగానే, అతన్ని పిలవమన్నాడు కమిషనర్.

"రెండు రోజులనుండి ఆఫీసుకు రావట్లేదట. ఏంటండీ ఇది. నేను ఊళ్ళో లేనప్పుడు ఎంత బాధ్యతగా ఉండాలి. ఆ వడ్డే గేరి పక్కన పైపులు లీకేజీ అయిపోయి నీళ్ళన్నీ మురికికాలువలోకి పోతున్నాయి. హరిజనవాడకు రెండు రోజుల నుండి నీళ్ళు లేవు. బాధ్యత లేకపోతే ఎలాగ?'

"సార్! నేను కూడా ఊళ్ళోలేను"

"ఎక్కడికెళ్ళారు?"

"మా రిటైర్డ్ ఎస్.ఇ. గారొస్తే పుణ్య క్షేత్రాలు చూపించడానికి వెళ్ళాను. ఫోన్ చేసి కనుక్కుంటున్నాను సార్! నీళ్ళు అన్ని వార్డులకు నార్మల్ గానే వదుల్తున్నట్లు చెప్పారు సార్ మావాళ్ళు"

"మీ వాళ్ళు వదుల్తున్నారండీ! కానీ పోవట్లేదు. పైపులు వేసి రెండు నెలలు కూడా కాలేదు. వడ్డేగేరి పక్కన లీకేజీ. రెండు వందలమంది వచ్చి ధర్నాచేసి పోయారు. మీరు లేనప్పుడు మీ ఫీల్డ్ స్టాఫ్ చూసుకోవాలికదా!"

"చూసుకుంటారు సార్. లీకేజీ వాటర్ కాలువలోకి పోవటంవల్ల కనిపించి ఉండదు"

"సరే జరిగిందేదో జరిగింది. ఇప్పుడు రిపేర్ పెడితే టౌన్ అంతటికి సాయంత్రం సప్లై ఉండదు. అందుకే ఆ చాకలి గేరి, మసీదులైను, రాగి మాను ఏరియాలకు నీళ్ళు బందు చేద్దాం. ఆ ఏరియాలకు టాంకర్లు ఏర్పాటు చేస్తాను. ఉదయాన్నే అయిదుగంటలకు రిపేర్ స్టార్ట్ చేస్తే పది, పదకొండుకి పూర్తయి పోతుంది. ఈవినింగ్ టౌన్ అంతటికీ సప్లై రెస్టోర్ చెయ్యొచ్చు. వెళ్ళండి! అంతా రెడీ చేస్కోండి. ఉదయాన్నే 5 గంటలకి స్టార్ట్ చేస్తే తప్ప, రిపేర్ కంప్లీట్ కాదు. 5 గంటలకే వెళ్ళాలి మీరు"

"అలాగే!" అంటూ కమిషనర్ ఛాంబర్ నుంచి బయటపడ్డాడు ఇంజనీరు. ఫిట్టర్‌ని, టర్న్‌కాక్‌ని, మిగతా ఫీల్డ్ స్టాఫ్ నంతటినీ పిలిచి రేపు చేయబోయే రిపేర్ గురించి చర్చించాడు. గోడౌన్‌లోంచి తీసుకోవాల్సిన రింగులు, వాచర్లు, ఏవి తీసుకోవాలో చెప్పేసి, అందర్నీ పంపించేసి, ఒక్క ఫిట్టర్ని ఉండమన్నాడు.

అంతవరకూ తన మనసులో నలుగుతున్న ధర్మ సంకటాన్ని బయట పెట్టాడు ఇంజనీరు.

"ప్రోబ్లమ్ ఏమిటంటే – చెన్నప్పా! శేషఫణిగారని రిటైర్డ్ ఎస్.ఇ గారు వచ్చారు. అతను నాకు గురువుగారు. నేను ఎన్.ఎం.ఆర్ వర్క్ ఇన్ స్పెక్టర్‌గా ఫస్టు అతని దగ్గరే పన్చేసాను. ఆ తర్వాత అతనే రెగ్యులర్ చేయించారు. నీతో

చెప్పటానికి భయమేముంది. ఆదోనిలో పనిచేసినపుడు నా ఉద్యోగం పోయే పరిస్థితి వస్తే– అతనే నన్ను కాపాడినాడు"

"ఆదోని ఇష్యూ ఏంటి సార్?" చెన్నప్ప కుతూహలం ఆపుకోలేక అడిగేసాడు.

"అదింకోసారి చెబుతానుగానీ, ఎస్. ఇ ఫామిలీతో వచ్చాడు. గత రెండు రోజులుగా మహానంది, మంత్రాలయం, అహోబిలం చూపించేసాను. ఒక్క శ్రీశైలం మిగిలిపోయింది. రేపేమో దగ్గరుండి లీకేజీ రిపేరు చేయించమంటున్నారు కమిషనర్. ఏం చెయ్యడం!"

ఫిట్టర్ చెన్నప్ప దీర్ఘంగా ఆలోచించి అన్నాడు.

"మీరు ఎస్.ఇ.గారితో శ్రీశైలం వెళ్ళిపోండి"

"కమీషనర్ అడిగితే…?"

"మేం తెల్లవారికెళ్ళి బొక్కలు పెట్టేస్తాం. కమిషనర్ వచ్చి మీ గురించి అడిగాడనుకోండి. మన దగ్గర రింగులూ, వాచర్లూ అయిపోయాయి, అవి తేవటానికి డివిజన్ ఆఫీసుకని కర్నూలు పోయినారని చెప్పేస్తాం" '

'నేను రాత్రికి గానీ రాలేనే!"

"రాకండి"

"భలే చెప్తావయ్యా! స్పేర్స్ కోసం వెళ్ళానని కమిషనర్‌తో చెప్తానంటున్నావు. నేను రాకుండా రిపేర్ ఎలా పూర్తవుతుంది?"

"అవుతుందని ఎవడన్నాడు? పైపులైను చుట్టూ నాలుగుబొక్కలు పెట్టి మేము కూచుంటాం. కమిషనర్ డివిజన్ ఆఫీసుకు ఫోన్ చేస్తాడు. మీరెలాగూ అక్కడ మేనేజ్ చేసేస్తారు. అయిపోయిందా! ఏ అర్ధరాత్రికయినా మీరొస్తారుకదా!"

"ఓ తప్పకుండా"

"మరింకేమి! స్పేర్స్ మీరే తెచ్చినట్టు చూపిస్తాం. ఎల్లుండి రిపేరు చేయిస్తాం"

చెన్నప్ప తెలివి చూసి ఇంజనీరుకి పట్టలేనంత ఆనందంగా ఉంది. జేబులో చెయ్యి పెట్టి అది పట్టినన్ని నోట్లు తీసి ఫిట్టర్ చేతిలో కుక్కాడు.

*****

మర్నాడు 5 గంటలకు పైపులైను తవ్వడం ప్రారంభించారు. రాత్రి ఇంజనీరు, ఫిట్టర్ వేసిన ప్లాన్ మిగతావాళ్ళకు తెలీదు. అందువలన స్పేర్స్ అన్నీ స్పాట్‌లోకి తెచ్చేసారు.

కమిషనర్ స్పాట్ దగ్గరకు వస్తున్నాడు. అంతదూరం నుండే కమిషనర్‌ని చూసాడు ఫిట్టర్.

ఎదురుగా స్పేర్ సామానుంది. కమీషనర్ వచ్చేస్తున్నాడు. ఫిట్టర్‌కి ప్రాణం పోయినంత పనయింది. చుట్టూ చూసాడు. స్పేర్ పార్ట్స్ ఎక్కడ దాచాలో అర్థంకాలేదు. కమిషనర్ వెహికల్ ఇంకా దగ్గరవుతోంది. గభాల్న సామానంతా పక్కనున్న డ్రైనేజీల పడేసాడు.

*****

రాత్రి వేసిన ప్లాను ప్రకారమే అంతా చెప్పాడు ఫిట్టర్. అది విని స్పేర్స్ తేవడానికి స్వయంగా వెళ్ళిన ఇంజనీరుని అభినందించకుండా ఉండలేకపోయాడు కమిషనర్.

కానీ, అతనికి తెలీదు. ఆరోజు కూడా నీళ్ళు రావని. సాయంత్రం ధర్నా కోసం మహిళల్ని రామాంజనేయులు ప్రేరేపిస్తున్నాడని.

# లాలన పాలన

పెళ్ళికాకముందే పెళ్ళాం మీద కోరిక కలిగినట్టు. వంట కాక ముందే భోజనం మీద ఇష్టపడినట్టు నామినేషన్ వెయ్యకముందే శారద పదవి మీద ఆశలు పెట్టుకున్నాడు సుబ్రహ్మణ్యం.

శారద, సుబ్రహ్మణ్యం భార్యాభర్తలు. శారద మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తుంటే ఏవేవో ఊహాలోకాల్లో తేలిపోయాడు సుబ్రహ్మణ్యం. రేపటి నుండి పేరు ఆమెది. పదవి తనది, తెల్లవారే సరికి మున్సిపాలిటీ వాళ్ళు ఇంటికి వస్తారు. విషయాలేవైనా ముందు తనతో చెప్పాక, తను ఓ.కె. గో ఆ హెడ్ అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకనే మేడమ్ దగ్గరకి ఫైల్స్ పోతాయి. ఆఫీసర్లు, కాంట్రాక్టర్లు వచ్చే పోయే వాళ్ళతో రేపటి నుండి బిజీ, బిజీ, బిజీ. ఒక్కసారి చప్పట్లు మారుమ్రోగితే ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు.

చాలామంది శారదను అభినందిస్తూ పూలదండలతో ముంచెత్తారు.

"ఇక ఇంటికి పోదామా అలసిపోయినట్లున్నావు"

"మీరు వెళ్ళండి"

"నువ్వా"

"నేను తర్వాత వస్తాను" కమిషనర్ వైపు తిరగి " వెళ్దామా" అంది శారద.

"పదండి" ముందు కమిషనర్, ఆ వెనుక చైర్ పర్సన్. ఆమెను అనుసరిస్తూ ఇంజనీరు, శానిటరీజన్ స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ స్టాఫ్ అంతా వారి వారి వాహనాల్లో బయల్దేరారు.

సుబ్రహ్మణ్యం ఒక్కడే ఇంటి ముఖం పెట్టాడు.

పట్టణమంతా సుడిగాలి పర్యటన చేసింది శారద. లెట్రిన్స్ లోనికి వెళ్ళి తనిఖీ చేసింది. చాలా అపరిశుభ్రంగా ఉన్నాయి. స్కావింజర్స్‌ని పిలిచి ఎలా క్లీన్ చెయ్యాలో చెప్పింది. క్లీన్ చేసి చూపించింది.

ఆమె చీపురు పట్టి క్లీన్ చేస్తుంటే అందరూ ముక్కు మీద వేలేసుకున్నారు. – "మన ఆలోచనా విధానం మారాలి. ఆడది దేశానికి ప్రధానమంత్రి అయినా ఒక బిడ్డకు తల్లే. బిడ్డకు అన్నీ చేయట్లేదా? పాయఖానాల్ని చూసి ముక్కులు మూసేసుకుంటున్నాం. ముక్కు మూసుకుంటే కంపుపోదు కడిగితే పోతుంది. పబ్లిక్ లెట్రిన్లన్నీ శుభ్రంగా ఉంచాలి" అని వర్కర్లకి చెప్పి..! ముందుకు కదిలింది.

ఒకచోట సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. సిమెంట్, కంకర, ఇసుక వేసిన మిక్సర్ గిర్రున తిరుగుతోంది. మాల్ ఎత్తిన గంపలు చకచక నడుస్తున్నాయి. చైర్‌పర్సన్‌ను చూసి మరింత హుషారుగా చేస్తున్నారు.

"ఇంజనీరుగారు! ఏదెంత వెయ్యాలో అంత వేస్తున్నారా?"

"వేస్తున్నాం మేడమ్! కావాలంటే చూస్కోండి. వన్ ఈస్ట్ టూ ఈస్ట్ ఫోర్"

"ఈ ఈస్ట్‌ల సంగతి నాకు తెలీదు. ఎందుకంటే నేను పెద్దగా చదువుకోలేదు. కానీ, రోస్ట్‌లు చేసిన చెయ్యినాది. ఫ్రైకి, రోస్టుకి, కుర్మాకి, సాంబారుకి, రసానికి పోపులు పెట్టినదాన్ని, వంటల అనుభవంతో చూస్తే ఇక్కడ ఏదో తేడా కనపడుతుంది. అదేంటో మీరు చెబుతారా! నన్నే చెప్పమంటారా?" అంది శారద.

“ఏం కాదు – మేడమ్, అంతా కరెక్టుగా ఉంది” కాస్త దబాయించినట్టు అన్నాడు ఇంజనీరు.

“అట్లానా! అయితే శాండ్ కుషన్ ఎంత వెయ్యాలి ఇంజనీరుగారు”

“నాలుగించులు”

“మీరెంత వేస్తున్నారు?”

ఇంజనీరేమి మాట్లాడలేదు.

“ఒక సిమెంట్ గంపకి నాలుగు గంపల కంకర, ఆరు గంపల ఇసుక అన్నావు కదా. సిమెంటు గంప, ఇసుక, కంకర గంపలు ఒకే సైజులో ఉన్నాయా! ఏం మాట్లాడవు, పైగా సరిగ్గా మిక్స్ కాకుండానే గంపల కెత్తేస్తున్నారు. పైన దట్టంగా సిమెంటు కనబడుతూనే ఉంటుంది. లోన వట్టి ఇసుకే. మొత్తం రోడ్డు తీసివేసి మళ్లీ వెయ్యండి. మళ్ళీ వేస్తేగాని తప్ప బిల్లు ఇవ్వకండి కమిషనర్ గారు” అంటూ అక్కడి నుండి మున్సిపాలిటీలోని ఒక వీధిలోకి వెళ్ళింది. ఆ వీధిలో ఇళ్ళన్నీ ముందుకు ఆక్రమించుకుని ఉన్నాయి. చైర్‌పర్సన్ వచ్చిందనగానే ప్రజలంతా గుమిగూడారు.

“ప్రజలకు నమస్కారం? మనం ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత గాలీ, వెలుతురు అవసరం. బిగుతుగా ఉన్న బట్టలు – ఎంత అసౌకర్యమో, ఇరుకుగా ఉండే వీధులూ అంతే అసౌకర్యంగా ఉంటాయి. అందుకే ఇంటి వెనుకముందు ఐదడుగుల ఖాళీ స్థలం వదిలి పెట్టాలనే నిబంధన విధించారు. ఏ రూలైనా మన సౌకర్యం కోసమే. ఆ మీరు ఐదడుగులు వదల్లేదుకదా మున్సిపాలిటీ స్థలాన్ని రెండేసి అడుగులు ఆక్రమించుకొని ముందుకు కట్టేసారు. దానివల్ల – రోడ్డు ఇరుకైపోయింది. ఏ అగ్నిప్రమాదమో జరిగితే ఫైర్ ఇంజన్ రాలేదు. ఎవరికో ఏ పురిటి నొప్పులో వస్తే ఆటోరిక్షా కూడా లోనికి రాలేదు. ఆలోచించండి.

విశాలమైన రోడ్లు మనకెంతో అవసరం. ఆపద, అవసరాల్లో మనల్ని చాలా ఆదుకుంటాయి. నా మాటలు నిజమో అబద్దమో మీరే ఆలోచించండి”

“నిజమే” అన్నారు ముక్తకంఠంతో.

“ఇంకేమి, మీరు ఆక్రమించుకున్న స్థలాన్ని ఖాళీ చేసి రోడ్డు విశాలంగా చేసుకోండి.

అందరూ ఆమెతో ఏకీభవించి ఓ నాల్రోజుల్లో రోడ్డు విశాలంగా చేసుకుంటామని మాట ఇచ్చారు.

అక్కడ నుండి తిన్నగా ఆఫీసుకు వచ్చింది.

స్టాఫ్ మీటింగ్ పెట్టింది.

ప్రజలు దేనికీ ఇబ్బంది పడకూడదు. పదే, పదే మున్సిపల్ ఆఫీసు చుట్టూ తిరగకూడదు. వాళ్ళ పనులు మనం శ్వాస పీల్చుకున్నంత సహజంగా, సులభంగా జరిగిపోవాలి. అంటూ ఏదేదో చెప్పుకుపోతోంది. ఆడది చైర్‌పర్సన్ అయితే ఆమెకి ఏమీ తెలీదనీ, తమ ఇష్టారాజ్యంగా పరిపాలన వెలగబెట్టొచ్చని కలలుకన్న ఆఫీసర్లకు గొంతులో వెలక్కాయ పడినట్లయింది.

స్టాఫ్ మీటింగ్ పూర్తిచేసుకొని ఇంటికొచ్చింది శారద.

అప్పటికే నిప్పులు కక్కుతున్నాడు సుబ్రహ్మణ్యం.

“నీకైమైనా బుద్ధీ జ్ఞానం ఉన్నాయా? నన్ను వదిలేసి ఆ కమిషనర్‌గాడి వెనక వెళ్ళిపోతావా? అప్పుడే నీకు కొమ్ములొచ్చాయా? నీ సొంత తెలివితేటలు వుపయోగించొద్దు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా! ఏ ఫైలుమీద సంతకం చెయ్యాలన్నా నన్ను అడగాలి. నా సలహా సంప్రదింపులు అవసరం నీకు. నేను పక్కన లేనని పసిగట్టారనుకో ముంచి పారేస్తారు మున్సిపాల్టీ ఆఫీసర్లు జాగ్రత్త!”

“చూడండీ మీరు నాకు దేవునితో సమానం! దేవుని ఆశీస్సులు కోరుకుంటాం... అంతే కదా! అలాగే నేను మీ దీవెనలు మాత్రమే కోరుకుంటున్నాను. ఎవరైనా అడుగడుగునా జోక్యం చేసుకుంటే భరించలేం. మీరు అర్థం చేసుకోండి. నేను స్త్రీని. మీ పురుషులకంటే రెండింతలు ధైర్యం, నాలుగింతల సమయస్ఫూర్తి, ఆరింతలు చతురత, ఎనిమిదింతలు సామర్థ్యం

ఉన్న దాన్ని. ఇంటి వ్యవహారాన్ని తీసుకోండి. ఏ ఇల్లయినా పాడయిపోయిందంటే అది పురుషునికున్న బలహీనత వలనో, అసమర్థత వలనో అవుతుంది తప్ప స్త్రీ అజమాయిషీలో ఉన్న ఏ ఇల్లు ఇంతవరకు పాడయిపోలేదు. పాడయిపోదు కూడా!

ఇద్దరి బిడ్డల తల్లిని నేను. పిల్లల్ని కడుపులో పెట్టుకొని తొమ్మిది నెలలు ఎలా రక్షించడమో తెల్సిన మాతృమూర్తిని నేను. ఈ పట్టణ ప్రజల్ని మున్సిపాల్టీని ఐదు సంవత్సరాలు నా గుండెల్లో పెట్టుకొని ఎలా 'రక్షించడమో నాకు తెలీదా! తెల్సు"

"ఆడదానికి తెల్సింది లాలనే కాదు – పాలన కూడా! రండి భోంచేద్దురు గానీ" అని వంటింట్లోకి నడిచింది చైర్ పర్సన్ శారద.

సుబ్రమణ్యం ముఖంలో కత్తివేటుకు రక్తపు చుక్క లేదు!

# హుండీ

"ఎలాగైనా సరే ఈ విషయంలో మీరే మాకు సహాయం చెయ్యాలి సార్" అంటూ ప్రాధేయపడ్డాడు మర్చంట్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటాచలం కౌన్సిలర్ రామాంజనేయుల్ని...

"సహాయపడదామనే వుందయ్యా.. కానీ కమిషనర్‌తో ప్రాబ్లం..." నసిగాడు రామాంజనేయులు. ఆ నసుగుడుకు అర్థం తెలీనివాడు కాదు వెంకటాచలం.

"సార్! మీరు చెప్తే కమిషనర్ గారు కాదంటారా" రెచ్చగొడుతున్నట్లు అడిగాడు వెంకటాచలం.

అహం తన్నుకొచ్చింది రామాంజనేయులకి. కాదంటే మాత్రం నేనూరుకుంటానా... అయినా మనమేమైనా మొత్తం కొట్టేయమని అడగటంలేదుగా తగ్గించమంటున్నాం అంతే.. కాకపోతే.. మళ్ళీనసిగాడు రామాంజనేయులు.

నసుగుడుకు అర్థం తెలసీ ఇంకా ఊరుకుంటే అసలుకే మోసం వస్తుందని గ్రహించేశాడు వెంకటాచలం. కౌన్సిలర్ రామాంజనేయులతో వ్యవహారం అంటే ఏమిటో గతంలో బాగా అనుభవం ఉన్నవ్యక్తి అతను. అందుకే సూటిగా వ్యవహారంలోకి వచ్చేశాడు.

చెప్పండి సార్! మీరేంచెప్పినా కాదనం... అనేశాడు.

ఇప్పుడు దారికొచ్చావు అన్నట్లు చూసి... మొత్తం మనవాళ్ళు ఎంతమంది అడిగాడు.

"నలభైమంది రెడీగా వున్నారు సార్..." టక్కున చెప్పాడు.

"అయితే ఓపని చేయండి.. మనిషికో పాతిక పట్టుకొచ్చేయండి".

"పాతికా"! నోరు వెళ్ళబెట్టాడు వెంకటాచలం.

"పాతికా అని నోరుతెరవకు. నువ్వు తగ్గించమంటున్న అమౌంట్‌లో ఇదెంత"!

"అది కాదు సార్..."

"ఇంకేదీకాదు, అసలే ఇది పాలసీ మ్యాటర్, మార్పులు చేర్పులు చేయ్యాలంటే ఎన్ని చేతులు తడవాలి.. కమిషనర్ సంతకం చెయ్యాలి. ఛైర్మన్ సంతకం చెయ్యాలి. ఆ తరువాత కలెక్టర్‌గారు ఓకె చెయ్యాలి. అబ్బో చాలా తతంగం వుంది..." తాపీగ చెప్పాడు రామాంజనేయులు.

పాతిక కన్నా ఎక్కువ అడుగుతాడేమోనని భయపడుతూ వచ్చిన వెంకటాచలం అమ్మయ్య అనుకున్నాడు పాతికతోనే పనైపోతున్నందుకు. అయినా అదే మోయలేని భారం అన్నట్లుగా మొహం పెట్టాడు.

"మరీ పాతిక అంటే చాలా ఇబ్బంది సార్.. కాస్త దిగకూడదూ..."

"చూడు వెంకటాచలం అసలిలాంటి వ్యవహారాల్లో నేను తలదూర్చకూడదు. నీకోసం, కేవలం నీకోసం ఒప్పుకుంటున్నాను అయినా పాతిక మీకో లెక్కంటయ్యా.. ఆలోచించుకోండి..."

ఆలోచించినట్లు నటించి నసుగుతూనే సరేనన్నాడు వెంకటాచలం.

"అయితే రేపు ఉదయానికల్లా మొత్తం పట్టుకొచ్చెయ్యి.. దాంతోపాటు మీ

మర్చంట్స్ అసోసియేషన్ తరపున కమిషనర్ గారికి ఓ అప్లికేషన్ కూడా పట్టుకురా – సంతకం చేయించే పూచీనాది..” భరోసా ఇచ్చేశాడు రామాంజనేయులు.

“పనవుతుందా సార్..?”

“వెళ్తున్నది నేనయ్యా! నీకేం భయంలేదు. రేపుపొద్దునకల్లా చెప్పింది తీసుకురాపో...” ఇక మాట్లాడేదేంలేదన్నట్లు తాపీగా చూసాడు రామాంజనేయులు.

నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు వెంకటాచలం.

అనుకున్నప్రకారం మర్నాడు ఉదయానికల్లా పదిలక్షల సూట్‌కేసులతో తమ అప్లికేషన్‌తో వచ్చి ఆరెండూ రామాంజనేయులు చేతిలో పెట్టి నీవే దిక్కు అన్నట్లు మరో నమస్కారం పారేసి వెళ్ళాడు వెంకటాచలం.

*****

తాను ఒప్పుకున్న విషయం చిన్నది కాదని తెలుసు రామాంజనేయులుకి. కానీ ఈ విషయంలో అనుకున్నది జరిగితే తన పరపతి ఎంతగా పెరిగిపోతుందో తెలుసు. అందుకే తనకు సపోర్టుగా వుంటాడని యం.ఎల్.ఎ.ని ఆశ్రయించాడు. యం.ఎల్.ఎ రామాంజనేయులు కన్నా పదాకులు ఎక్కువ చదివాడు. రామాంజనేయులు మర్చంట్స్ అసోసియేషన్ వాళ్ళదగ్గర ఎంతనొక్కాడో ముందే వివరాలు సేకరించాడు.

అయితే ఇపుడేం చెయ్యమంటావయ్యా! తాపీగా అడిగాడు యం.ఎల్.ఎ అంతా విని అలా అడిగితే ఏం చెప్పగలనండీ... అయినా మీరే ఆలోచించండి. ఒక్కోషాపుకు అంతేసి అద్దెలంటే వాళ్ళు మాత్రం ఏమైపోతారు చెప్పండి. ఏదో రెండు లక్షల వరకు అయితే వాళ్ళకు భారంగా వుండదు. విషయం చెప్పాడు రామాంజనేయులు. నిజమే పాపం మరీ అయిదు లక్షలంటే ఎవరు మాత్రం భరించగలరులే.. అనేశాడు యం.ఎల్.ఎ.

రామాంజనేయులు మొహం వికసించింది ఆ మాటతో.

“అందుకేసార్ నేను మీదగ్గరికి వచ్చాను. మీరెలాగైనా కమిషనర్ గారితో

ఒక్కమాటచెప్పి డిపాజిట్ తగ్గిస్తే పాపం మన వాళ్ళందరూ మీపేరు చెప్పు కుంటారు".

"దాందేముందీ చెప్తాన్లేగానీ.. సాయంత్రం ఓ అయిదు పట్టుకొచ్చెయమను" సూటిగా విషయంలోకి వచ్చేశాడు యం.ఎల్.ఎ.

"అయిదా"? నోరువెళ్ళబెట్టాడు రామాంజనేయులు.

"నువ్వు నొక్కిన దాంట్లో సగమేగా నేనడుగుతున్నది.."

అన్నీ తెలుసుకున్నావా మహానుబావా అనుకున్నాడు రామాంజనేయులు. ఆలోచించండి సార్ అయిదంటే కాస్త ఇబ్బంది. ఇంకా చాలామందికి పంచాలి వినయంగా చెప్పాడు రామాంజనేయులు.

అసలీ పనికి పదికి తగ్గకూడదయ్యా. ఏదో మనోడివి గనుక అయిదుకు ఒప్పుకుంటున్నాను ఖరాకండిగా చెప్పాడు యం.ఎల్.ఎ.

సర్లేండి అలా ఖాయం చేసేసుకోండి ఒకె అనేశాడు రామాంజనేయులు.

పొద్దున్నే కమిషనర్ గారిని కలుద్దాం..

ఎలాగైనా పని జరగాలి సార్.

నేను చేయిస్తాగా!

తృప్తిగా లేచాడు రామాంజనేయులు నమస్కారం పెట్టి.

ఇదిగో కమిషనర్! అంత ఆలోచిస్తావేంటి.. నిన్నేమైనా ఆ షాపింగ్ కాంప్లెక్స్ ఉచితంగా ఇవ్వమంటున్నామా.. ఫీజు మొత్తం తగ్గించమనేగా అడుగుతున్నాం.. యం.ఎల్.ఎ గారు చెవిలో అగ్గిపుల్లతో తిప్పుకుంటూ తాపీగా అడిగాడు.

కమిషనర్‌కి ఏంచెప్పాలో తోచలేదు. మీరు అడిగేది కరెక్టే సార్! కానీ ఫీజ్ తగ్గించే అధికారం నాకు లేదు.

తగ్గించమని రికమండ్ చేసే అధికారం ఉందిగా రామాంజనేయులు

టపీమని అన్నాడు.

అదసలు పాలసీ మేటర్ సార్.. ఒక్కసారి నిర్ణయం తీసుకున్నాక తగ్గడం వుండదు.

మీరు మరీనండి గొప్పగొప్ప నిర్ణయాలే ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు మార్చేస్తూ ఉంటారు. ఏదీ శాశ్వతంకాదు. అయినా రెకమెండ్ చేస్తే మీ కొంపేం మునగదుగా అన్నాడు యం.ఎల్.ఎ.

నేనేదో మర్చంట్ అసోసియేషన్ వాళ్ళదగ్గర ముడుపులు తీసుకున్నానని పైవాళ్ళు అనుకుంటారు సార్.. కమిషనర్ బాధపడ్డాడు.

అనుకునేవాళ్ళు ఎలాగు అనుకుంటారు. వాళ్ళను మనం ఆపలేం గానీ మీరో సంతకం చేయండి.. అయితే అవుతుంది లేకపోతేలేదు అన్నాడు యం.ఎల్.ఎ.

రామాంజనేయులు గుండె గుభేల్‌మంది ఇదేంటీయన ఇలా మాట్లాడు తున్నాడు అవకపోతే ఎలా! అనుకుని యం.ఎల్.ఎ. వంక చూసాడు.

ఏం భయంలేదు అంతా సవ్యంగా జరుగుతుందిలే అన్నట్లు భరోసాగా చూసాడు యం.ఎల్.ఎ.

యం.ఎల్.ఎ మాట కాదంటే ఏంగొడవ కొస్తుందో అయినా సంతకం చేసినంత మాత్రాన పోయిందేముందిలే అనుకుని ఆ అప్లికేషన్ మీద సంతకం చేశాడు కమిషనర్.

గుండెనిండా గాలి పీల్చుకున్నాడు రామాంజనేయులు.

ఇక పైవాళ్ళతో నేను మాట్లాడుతా! ఎందుకు ఒప్పుకోరో చూస్తాను అంటూ లేచాడు యం.ఎల్.ఎ.

ఆయనవెంటే రామాంజనేయులు... కమిషనర్ నిర్వేదంగా చూస్తూ కూర్చున్నాడు.

* * *

కొంప మునిగింది యం.ఎల్.ఎ గారూ! ఆక్రోశిస్తూ లోపలికి వచ్చాడు రామాంజనేయులు.

ఎవరిది? తాపీగా అడిగాడు యం.ఎల్.ఎ.

ఇంకెవరిదండీ మనదే..

ఏమైందయ్యా!

గవర్నమెంటు మన అప్లికేషన్‌ను తిరస్కరించారు

మన అప్లికేషన్‌నా! ఏంటదీ.

అదేనండీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ రెంట్ తగ్గించాలంటూ ఇచ్చిన అప్లికేషన్ తిరస్కరించారట. ఒక్కసారి తీసుకున్న నిర్ణయాన్ని మార్చే ప్రసక్తి లేదన్నాడు.

అయితే మనమేం చెయ్యగలం. అది గవర్నమెంట్ పాలసీ మేటర్... తాపీగా అన్నాడు యం.ఎల్.ఎ.

పాలసీ మేటర్ సంగతి అలావుంచండి ఈ విషయం తెలిస్తే మర్చంట్ అసోసియేషన్ వాళ్లు గోలపెడతారు గదండీ.

దానికి మనమే చెయ్యగలం. అవుతుందనుకున్నాం కాలేదు. మనప్రయత్నం మనం చేసాం. అవకపోతే ఏంచేస్తాం చేతులు దులుపుకున్నాడు యం.ఎల్.ఎ.

అది సరేసార్! కనీసం వాళ్లిచ్చిన అమౌంటైనా వాళ్ళకు వాపస్ చెయ్యాలిగా..

ఏ అమౌంట్!

అదేనండీ ఆ పదిలక్షలూ.. గొణిగాడు రామాంజనుయులు.

అందులో నాకిచ్చింది అయిదేగా.. తేల్చేశాడు యం.ఎల్.ఎ.

అదేలెండి వాళ్ళది వాళ్ళకిచ్చేస్తే మర్యాదగా వుంటుంది కదండీ..

నువ్వో పిచ్చోడివయ్యా..

దేవుడి గుడికెళ్ళి ఏదో కోరుకుంటాం హుండీలో డబ్బులు వేస్తాం. కోరిక తీరకపోతే హుండీ పగలగొట్టి మనం వేసిన డబ్బులు మనం తీసుకోగలమా.. ఇదీ అంతే.. కాకపోతే ఈ సారేదైనా సమస్యవచ్చినపుడు చూసుకుందాంలే.. చెప్పడం ముగించుకొని లోపలికివెళ్ళిపోయాడు.

రామాంజనేయులు గుండెల్లో రాయిపడింది. ఏంచెయ్యాలో తోచలేదు. యం.ఎల్.ఎతో గొడవ పెట్టుకోలేడు. అలాగని మొత్తం డబ్బు తనొక్కడే కట్టుకోలేడు. దేవుడా! ఈ గండం నుంచీ గట్టెక్కించు నీ హుండీలో వంద రూపాయలు వేస్తాను. అని గుర్తొచ్చిన దేవుడికల్లా మొక్కుకుంటూ అలాగే కూలబడ్డాడు.

# ప్రారంభోత్సవం

కమిషనర్‌కి చాలా మంటగావుంది. అది కోపంతో కూడిన మంట. వెధవ వుద్యోగం మానేసి ఏ బస్టాండు సెంటర్లోనో కిళ్ళీకొట్టు పెట్టుకుందా మనిపించేంత మంటగా వుంది. ఏం చెయ్యాలో తోచడంలేదు. ఏమీ చేయకుండా ఉండలేని పరిస్థితి. ఏంచేస్తే ఏం కొంపమునుగుతుందో తోచిచావని స్థితి. విసుగ్గా, అసహనంగా పచార్లు చేస్తున్నాడు. ఇంజనీరు హనుమంతరావు లోపలకి వచ్చాడు.

"సార్!" పిలిచాడు హనుమంతరావు. పచార్లు ఆపి విసుగ్గా చూసాడు కమిషనర్.

"ఇన్విటేషన్ కార్డులు ప్రింటింగ్‌కి ఇచ్చిరమ్మంటారా!"

మళ్ళీ మంటెక్కింది కమిషనర్‌కి ఆమాటతో.

"ఇప్పుడిది అర్జంటాండీ" కోపంగా కసిరాడు కమీషనర్.

"అదేంటిసార్! వచ్చే వారమే కదా ప్రారంభోత్సవం" జవాబిచ్చాడు ఇంజనీర్.

'ప్రారంభోత్సవం కాదు నా తద్దినం' గొణుక్కున్నాడు కమిషనర్.

ఆ గొణుగుడు వినబడినా వినబడనట్లు అడిగాడు ఇంజనీర్.

‘ఏమిటిసార్’ అని.

“ఏంలేదు మీరెళ్ళండి”

మరి ఇన్విటేషన్స్...

“ఆ సంగతి నేను చూస్తాను. ముందు ఆ హరిజనవాడలో నీళ్ళు రావడం లేదట. ఆ కాలనీ ఆడవాళ్ళంత బిందెలతో వచ్చి ధర్నాలు చేసేట్లున్నారు. వెళ్ళి ఆ పని చూడండి” అని చాలా చిరాకుని ప్రదర్శిస్తూ ఇంతక ముందు ఏయే పనులు చేయలేదో అన్ని గుర్తుకు తెచ్చుకొని మరీ అరిచాడు కమిషనర్.

కమిషనర్ పరిస్థితికి లోలోపలే నవ్వుకుంటూ మొహంలో మాత్రం వినయం కనబరుస్తూ గదిలోంచి బయటకి నడిచాడు ఇంజనీర్. అలా కమిషనర్ చేత తిట్లు తిన్న ప్రతిసారి ఇంజనీర్ అనుకుంటాడు – “నాకెప్పటికైనా దొరక్కపోవు. ఈ పగనంతా తీర్చుకోకపోను” అని

“ఏంటీ? లోపల కమీషనర్‌గారు హీట్ హీట్‌గా వున్నట్టున్నారు?” బయటకొచ్చిన ఇంజనీరుని అడిగాడు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్.

“ఇందాక చైర్మన్ గారి చాంబర్‌లోకి వెళ్ళి వచ్చారుగద అక్కడేదో అష్టోత్తరం జరిగుంటుంది. అందుకే మూలశంక వచ్చిన వాడిలా అటూ ఇటూ తిరుగు తున్నాడు” నవ్వుతూ జవాబిచ్చాడు ఇంజనీర్.

“అప్పుడప్పుడు ఇలాంటి అష్టోత్తరాలు పడాల్సిందేలెండి. లేకపోతే ఈయనెవరికైనా లొంగుతాడా!” టిపిఒ కచ్చగా అన్నాడు.

“బాగా చెప్పారు. ఆర్డర్లు పురమాయించడం తప్ప ప్రాక్టికల్‌గా పని చేసేదేమైనా వుంటేగా. చచ్చీచెడీ జనం మద్యకెళ్ళి పనిచేసేది మనం, క్రెడిట్ ఆయన్ది...” ఇంకా కచ్చగా అన్నాడు ఇంజనీర్.

“అదిసరే ఇంతకీ విషయం ఏమిటీ!” కుతూహలంగా అడిగాడు టి.పి.ఒ.

“ఏమో!” పెదవి విరిచాడు తెలీదన్నట్లు ఇంజనీర్.

*****

"నమస్కారం కమిషనర్‌గారు" మొహాన నవ్వు పులుముకొని లోపలికొచ్చాడు రామాంజనేయులు.

"రండి రామాంజనేయులుగారూ.. కూర్చోండి.."

రామాంజనేయులు తాపీగా కూర్చుంటూ కమిషనర్ వంకచూసాడు. సునామీలో సర్వం కోల్పోయిన వాడిలాగా వుంది కమిషనర్ మోహం.

"ఏంటిసార్ అలావున్నారు ఏమైంది!" అడిగాడు కౌన్సిలర్.

"ఏమి చెప్పమంటారులేండి నాబాధ.. అయినా ఒకరితో చెప్పుకుంటే ఆరేదికాదు తీరేదికాదు" నిస్పృహతో చెప్పాడు కమిషనర్.

"ఆర్చకపోయిన తీర్చకపోయినా కనీసం తోచిన సలహా అయినా ఇస్తానుగా. విషయం ఏమిటో చెప్పండి" రెట్టించాడు కౌన్సిలర్.

"ఆ సంగతి వదిలెయ్యండి. ఇంతకూ మీరేదో పనిమీద వచ్చినట్లున్నారు" మాట మార్చాడు కమిషనర్.

వెంటనే తనొచ్చిన పని గుర్తుకొచ్చింది కౌన్సిలర్ రామాంజనేయులుకు.

"అసలు విషయమే మర్చిపోయాను. వచ్చేవారం గాంధీనగర్‌లో వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం వుంది కద. నా తరపున ఓ యాభై మంది దాకా రావచ్చు. ఇన్విటేషన్స్ తయారు కాగానే పంపించండి..." విషయం చెప్పాడు కౌన్సిలర్ యథాలాపంగా.

మళ్ళీ మంటెత్తింది కమిషనర్‌కి. ఈసారి నిస్సహాయతతో కూడిన మంట...

ఆ ప్రారంభోత్సవమే నా కొంప ముంచేలా వుంది. తనలో తాను గొణుక్కుంటున్నాను అనుకుని గట్టిగా అన్నాడు కమిషనర్. ఆశ్చర్యంగా చూసాడు కౌన్సిలర్.

"మీ కొంప మునిగేలా వుందా! ఎందుకు?" కావల్సినదానికన్న చాలా ఎక్కువ ప్రకటించాడు.

ఎలాగూ తన గొణుగుడు వినేశాడు ఇక తప్పదట్లుగా చెప్పాడు కమిషనర్.

"అయ్యా! రామాంజనేయులుగారూ! ఇలాంటి సమస్య శత్రువుక్కూడా రాకూడదు. అడకత్తెరలో వక్కముక్కలా తయారైంది నా బతుకు. ఏంచేయాలో తోచకుండా వుంది" విచారంగ చెప్పాడు కమిషనర్.

"అసలు విషయం ఏమిటిసార్"

అప్పుడు చెప్పాడు అసలు విషయం...

ఆ ఊరి యం.ఎల్.ఎ ప్రతిపక్షానికి చెందినవాడు. మునిసిపల్ చైర్మనేమో అధికార పార్టీ మనిషి. వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డి వేద్దామనుకునేలోగానే భగ్గుమంటుంది... అలా భగ్గుమనడానికి రాజకీయపార్టీలతో పాటు అనేక రకరకాల కారణాలున్నాయని తలోరకంగా అనుకుంటారు. పైకి మాత్రం ఇద్దరూ గుంభనంగా మిత్రుల్లాగానే వున్నా సమయం చూసి ఒకరిమీద ఒకరు బురద చల్లుకోడానికి తయారుగా వుంటారు.

ఇప్పుడు వచ్చిన సమస్య ఏమిటంటే గాంధీనగర్‌లో కొత్తగా నిర్మించబడ్డ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి యం.ఎల్.ఎ.ను ఆహ్వానించడానికి వీల్లేదని ఆర్డర్‌వేశారు చైర్మన్.

ప్రొటోకాల్ ప్రకారం ఇలాంటి వాటికి లోకల్ యం.ఎల్.ఎలను పిలవడం తప్పనిసరి అన్నాడు కమిషనర్.

ప్రొటోకాల్ లేదూ వంకాయలేదు అసలా యం.ఎల్.ఎ పేరు ఇన్విటేషన్ కార్డులో కనిపించడానికి వీల్లేదు అని ఖండితంగా చెప్పాడు చైర్మన్.

తనమాటకాదని అలాటి పనేదైనా జరిగితే జరిగే పరిణామాలకు తాను బాధ్యుడిని కానని సిన్సియర్ వార్నింగ్ కూడా ఇచ్చాడు చైర్మన్. ఒకపక్క చైర్మన్ ఇలాంటి వార్నింగ్ ఇస్తోంటే, మరోపక్క యం.ఎల్.ఎ ఫోన్లమీద ఫోన్లు చేస్తున్నాడు

ప్రారంభోత్సవం ఎప్పుడు అని. ఆ రోజున తన మందీమార్బలంతో అట్టహాసంగా రావాలని ఆయన కోరిక. యం.ఎల్.ఎని పిలిస్తే చైర్మన్‌తో తంటా. పిలవకపోతే యం.ఎల్.ఎతో తంటా.

ఎటుచూసినా తన సీటు కిందకి నీళ్ళు రావడం ఖాయం. అన్న విషయం స్పష్టంగా తెలిసిపోయింది కమిషనర్‌కి అందుకే ఏం చెయ్యాలో తెలీక జుట్టు పీక్కుంటున్నాడు.... అదీ అసలు విషయం.

అంతా విని తాపీగా చిద్విలాసంగా నవ్వాడు రామాంజనేయులు.

"ఇంత చిన్న విషయానికి అంత ఆలోచించాలా సార్..." అనేశాడు.

"ఎవడి తలనొప్పి వాడికే తెలుస్తుందండీ" ఆక్రోశంగా అన్నాడు కమిషనర్.

"మీరు పాండవ వనవాసం సినిమా చూశారా!" ఉన్నట్లుండి అడిగాడు రామాంజనేయులు.

"వేళాకోళంగా వుందాండీ మీకు. ఏం చేయాల్రా దేవుడా అని నేనేడుస్తుంటే పాండవ వనవాసం చూశారా! పచ్చిబద్దలు తిన్నారా అనడుగుతారేం" ఆక్రోశాన్ని కోపంగా మార్చి అడిగాడు కమిషనర్.

"కోప్పడకండి కమిషనర్‌గారూ! శాంతంగా వినండి. ఆ సినిమాలో ఎన్.టి.రామారావుగారు భీముడి వేషంలో ఓ సన్నివేశంలో తొడ చరిచి గడగడా రెండు పద్యాలు పాడేసి చాలా గొప్పగా నటించాడు కానీ అదే సీన్‌లో ఎస్.వి. రంగారావుగారు ఒకే ఒక్క డైలాగ్‌తో... ఏంటబ్బా ఆ డైలాగ్.. ఆ... 'బానిసలకింత అహంకారమా' అంటూ ఒక్క డైలాగ్‌తో ఎన్టీఆర్‌ని డామినేట్ చేశాడు. అంత వరకూ సెట్లో ఎన్‌టిఆర్ నటనకు పిచ్చెక్కిపోయిన జనం ఎస్‌విఆర్ గారు ఆ డైలాగ్ చెప్పగానే చప్పట్లు కొట్టారట. అది చూసి ఎన్టీఆర్‌గారు మండిపడిపోయి ఆ చిత్ర నిర్మాతను పిలిచి ఆ డైలాగ్ తీసెయ్యండి అని వెళ్ళిపోయారట. ఆ సంగతి తెలిసిన ఎస్వీ రంగారావు గారు ఆ డైలాగ్ తీసేస్తే షూట్ చేసి పారేస్తానని వార్నింగ్ ఇచ్చి వెళ్ళారట. నిర్మాతకు ఏం చెయ్యాలో తోచలేదు. తీస్తే ఈయనతో తంటా, వుంచితే ఆయనతో తంటా... అప్పుడు వెలిగిందతని బుర్ర. వెంటనే

అలా చేశాడు. ఇద్దరు నటులూ ప్రశాంతంగా ఉండిపోయారు"

"ఏం చేశాడు?" ఆత్రంగా అడిగాడు కమిషనర్.

"ఏముందీ... సిన్మా ప్రివ్యూకి ముందు ఎన్టీయార్‌ని పిలిచి ఆ డైలాగ్ లేకుండా చూపించాడు, ఆ తర్వాత మళ్ళీ ఆ డైలాగ్‌ని తగిలించి ఎన్నీఆర్‌కి చూపించాడు. అంతే ఇద్దరూ తృప్తి పడ్డారు" తాపీగా ముగించాడు రామాంజనేయులు.

"అయితే నన్నేం చేయమంటారు ఇప్పుడు" అడిగాడు కమిషనర్.

"ప్రారంభోత్సవానికి ఎం.ఎల్.ఎ. పేరుతో కొన్ని ఇన్విటేషన్లు, ఎం.ఎల్.ఎ పేరు లేకుండా కొన్ని ఇన్విటేషన్లు ప్రింట్ చేయండి. ఆయన పేరు లేనివి చైర్మన్ వర్గానికి పంచండి. ఆయన పేరున్నవి ఎం.ఎల్.ఎ వర్గానికి పంచండి"

సంబరపడిపోయాడు కమిషనర్. వెంటనే అనుమానం వచ్చేసింది. "అదికాదు రామాంజనేయులు గారూ... అలా చేసినా ప్రమాదమే కదా. ప్రారంభోత్సవానికి ఎం.ఎల్.ఎ గారు వచ్చేస్తారు గదా. అప్పుడైనా మా చైర్మన్‌గారితో ప్రాబ్లమేగా"

"ఏమీ రాదు. ఎందుకంటే ఎల్లుండి నుండి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మన ఎం.ఎల్.ఎ గారు అక్కడికి వెళ్ళాలి గద" అసలు విషయం చెప్పాడు.

వెంటనే మంట తగ్గి ఆనంద పడ్డాడు కమిషనర్.

అర్జెంటుగా ఇంజనీరు హనుమంతరావుని పిలిచి రెండు రకాల ఇన్విటేషన్లు తయారు చేయించి ఎవరెవరికి పంపాలో, ఎవరెవరికి పంపకూడదో వివరంగా చెప్పాడు.

చకచకా పనులు పూర్తయ్యాయి.

సమస్య ముగిసిపోయిందనుకున్నాడు కమిషనర్ పాపం...

ఆయనకు అసలు విషయం తెలీదు.

ఇంజినీర్ హనుమంతరావు సందర్భం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇప్పుడు దొరికిందతనికి కమిషనర్ జుట్టు.

చైర్మన్‌గారికి ఇవ్వాల్సిన ఇన్విటేషన్‌ను ఎం.ఎల్.ఎ గారికీ, ఎం.ఎల్.ఎ గారికి ఇవ్వాల్సిన దానికి చైర్మన్‌గారికీ పంపించాడు హనుమంతరావు.

పాపం విషయం తెలీని కమిషనర్ అమిత ఉత్సాహంతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నాడు.

# ట్రాన్స్‌ఫర్

అవినీతిని అల్లుకొని ఉద్యోగముందో, ఉద్యోగాన్ని ఆవరించి అవినీతి ఉందో అర్థం కావట్లేదు.

సుబ్బారావు ఒక మున్సిపాల్టీలో గుమస్తా. ఉద్యోగానికి గుమాస్తాయేగానీ అన్ని పనులకు కమిషనర్ అతని మీదే ఆధారపడతారు. అలాగే ఛైర్మన్‌కి కూడా అతని మాటంటే గురి.

ఛైర్మన్‌కి, కమిషనర్‌కి, ఛైర్మన్‌కి వైస్ ఛైర్మన్‌కి ఎవరెవరి మధ్య ఎలాంటి అపార్థం చోటు చేసుకున్నా సుబ్బారావు వెళ్ళి సర్దుబాటు చెయ్యాల్సిందే. సుబ్బారావు విదురుడు లాంటివాడు. విదురుడు ఇటు పాండవుల వలన గౌరవాన్ని, కౌరవులవల్ల పదవినీ పొందినట్లు – సుబ్బారావు పాలక ప్రతిపక్షాల రెండింటి నుండి నమ్మకాన్ని, గౌరవాన్ని పొందుతున్నాడు. అలాంటి సుబ్బారావుకి ఇప్పుడో పెద్ద చిక్కొచ్చి పడింది. అదేమిటంటే – మున్సిపాల్టీకి వీధి దీపాలు కొనాలని టెండర్లు పిలిచారు. రెండు కంపెనీలు రేట్లు కోట్ చేసాయి.

యల్ 1 కన్న యల్ 2 కంపెనీ పదిశాతం ఎక్కువ కోట్ చేసింది. రూల్సు ప్రకారమైతే యల్ 1 కంపెనీకే టెండర్ ఇవ్వాలి. కానీ యం.ఎల్.ఎ గారు

యల్2 కంపెనీకి టెండర్ ఇవ్వాలని పట్టు పడుతున్నారు. కమిషనర్‌ని పిల్చి నువ్వేం చేస్తావో నాకు తెలీదు టెండర్ మాత్రం పదిశాతం ఎక్కువ కోట్ చేసిన యల్2 కి వచ్చేటట్టు చేయ్యాలని గట్టిగా చెప్పారు. దాంతో కమిషనర్ జుట్టు పీక్కుంటున్నారు. ఇప్పుడేం చేద్దామని సుబ్బారావుని అడిగాడు. సుబ్బారావుకి ఏంచెప్పాలో తెలీక ఆలోచించి వస్తానని తన సీట్లోకి వచ్చి కూర్చున్నాడు.

ఇలా వచ్చికూర్చున్నాడో లేదో రమ్మనమని కమిషనర్ పిల్చాడు. సుబ్బారావు లోనకెళ్ళాడు.

"యం.ఎల్.ఎ మళ్ళీ ఫోన్‌జేసాడయ్యా! ఏంచేద్దాం" అన్నాడు కమిషనర్. "ఒకసారి ప్రోబ్లమ్ ఇలా ఉందని చైర్మన్ చెవిన ఒకమాట వెయ్యండి సార్! యస్ అన్నాడనుకోండి! గండం గట్టెక్కినట్టే! నో అన్నాడనుకోండి! నింద చైర్మన్ మీదకు నెట్టేసి మీరు తప్పించుకోవచ్చు" – అన్నాడు. సుబ్బారావు. ఆ సలహా విని ఊపిరి పీల్చుకున్న కమిషనర్. ఉన్న ఫళంగా చైర్మన్ ముందు వాలిన కమిషనర్‌ని చూసి చైర్మన్ ముఖం చిట్లించాడు. ఎందుకంటే ఈ మధ్య యం.ఎల్.ఎ. మాటలువిని కమిషనర్ తనను నెగ్లెక్ట్ చేస్తున్నట్టు ఫీలవుతున్నాడు చైర్మన్. రెండు చురకలు వెయ్యడానికి ఇదే అదును అనుకున్నాడు.

"ఏంటి సార్! యం.ఎల్.ఎ గారు ఊళ్ళోలేరా! గాలిటువైపు మళ్ళింది" పుల్ల బాగా విరిచానని ఫీలౌతున్నాడు చైర్మన్.

విషయాన్ని ఎలా ప్రారంభించాలా అనే సందిగ్ధంలో ఉన్న కమిషనర్‌కి యం.ఎల్.ఎ. విషయం చైర్మనే ప్రస్తావించడం ఒకందుకు మంచిదనిపించింది. "ఆ యం.ఎల్.ఎ. సంగతి నాదగ్గర మాటాడకండిసార్! అన్నీ తప్పుడు పనులు చెయ్యమంటాడు" – అన్నాడు కమిషనర్. ఆరో భర్తగా కర్ణుడు కావాలని ద్రౌపది అడిగినప్పుడు కృష్ణుడెంత ఆశ్చర్యాన్ని నటించాడో అంత ఆశ్చర్యాన్ని నటించాడు చైర్మన్.

"అదేంటలా అనేసారు! యం.ఎల్.ఎ గారేగా పదిమంది సీనియర్లని ప్రక్కన పెట్టించి మిమ్మల్ని ఈ మున్సిపాల్టీలో వెయ్యించింది" చాలా తాపీగా అని కమిషనర్ ముఖంలోని భావాల్ని చదవడానికి ప్రయత్నిస్తున్నాడు చైర్మన్.

కమిషనర్‌కా సంగతి తెలుసు. అందుకే చికెన్ ముక్కల్ని లోన దాచుకున్న బిర్యానీ ప్లేటులాగా పైన సున్నంకొట్టి సింగారించిన చెత్తకుప్పలాగా యం.ఎల్.ఎ. పట్ల ఉన్న కృతజ్ఞత అంతటిని మనసులోనే దాచుకొని బయటకు ఆయన పట్ల విసుగుని వ్యతిరేకత ప్రదర్శిస్తు అన్నాడు.

"ఏవి వెయ్యించడంసార్. వచ్చిన దగ్గర నుండి అతని గొంతెమ్మ కోర్కెల్ని తీర్చలేక చస్తున్నాను. మీకున్న మంచితనం, మంచిపేరు... అని చిన్న పాజ్ తీసుకున్నాడు. సరిగ్గా ఆ పాజ్ టైమ్‌లోనే జరగాల్సింది జరిగిపోయింది.

ఛైర్మన్ రూంలోకి ఎంటరవుతూ కమిషనర్ గొంతువిని బయటే ఆగిపోయాడు కౌన్సిలర్ సీతారాం. సీతారాం యం.ఎల్.ఎ అన్న కొడుకు. కమిషనర్ యం.ఎల్.ఎతో డైరెక్టుగా మాట్లాడతాడని, తనకివ్వాల్సినంత వెయిటేజ్ కమిషనర్ ఇవ్వడం లేదని చాలా కోపంగా ఉన్నాడు. కమిషనర్‌ని ఎలాగైనా దెబ్బ కొట్టాలని ఎదురు చూస్తున్న కొంతమంది కౌన్సిలర్స్‌లో అతనొకడు – అలాంటి సీతారాం కమిషనర్ యం.ఎల్.ఎకి వ్యతిరేకంగా మాట్లాడ్డం విన్నాడు. వినిందే తడువుగా యం.ఎల్.ఎ దగ్గరకు పరుగెత్తాడు.

ఇదేదీ గమనించని కమిషనర్ చెప్పుకుపోతున్నాడు – చాలా చాకచక్యాన్ని ప్రదర్శిస్తూ చెప్పుకుపోతున్నాడు. యం.ఎల్.ఎ గురించి రెండు చెడుమాటలు చెప్పి ఛైర్మన్ తన గ్రిప్‌లోకి వచ్చాక మంచిగా చెప్పాలనుకొని చెప్పుకుపోతున్నాడు.

"...పాపం ఏమాటకు ఆమాటే చెప్పాలి. రూల్స్‌కి వ్యతిరేకంగా చెయ్యామంటాడే? ఒక్క పైసా తీసుకోడు – అంతా కేడర్‌కే పెట్టేస్తాడు. చుట్టూ వున్నవాళ్ళు బాగోవాలనుకుంటాడు – పదిమంది హ్యాపీగా ఉండాలంటాడు – ఎంతమంచోడంటే నా పోస్టింగ్‌కోసం అంత ట్రై చేసాడా! దైవసాక్షిగా చెబుతున్నాను నా దగ్గర కప్పు కాఫీ కూడా తాగలేదు" అని ఆగాడు.

ఇంతకూ ఏమంటావ్ అన్నాడు ఛైర్మన్.

"ఏముంది సార్! కౌన్సిల్‌కి సబ్జెక్ట్ తెస్తాను. నేను యల్1 అప్రూవ్ చెయ్యాలని రాస్తాను. మీరు యల్ 2 అప్రూవ్ చేసేయండి!" అన్నాడు కమిషనర్.

"అదెలా? నువ్వు యల్ 1 ని రికమెండ్ చేస్తే, కౌన్సిల్ యల్ 2 ఎలా అప్రూవ్ చేస్తుంది. మమ్మల్ని ఇరికించాలని చూస్తున్నావు గానీ" అన్నాడు చైర్మన్.

"అబ్బెబ్బే! అలాకాదండీ! రేట్ తక్కువవున్నా ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ పెట్టలేదంటాం"

"పెట్టలేదా?"

"పెట్టకుండా ఎలా ఉంటారండీ! పీకిపారేస్తాం-సర్టిఫికెట్ లేదు కాబట్టి డిఫెక్టివ్ టెండరని రాస్తాం. రేటు తక్కువున్న ఆమోదించలేమని తీర్మానంలో రాసి యల్ 2 ని లాగించేద్దాం. యం.ఎల్.ఏ కూడా హ్యాపీ అవుతాడు. ఇంకో విషయం ఏంటంటే సార్! ఆ కంపెనీ వాళ్ళు క్లోజ్ ఫ్రెండ్సట. ఫ్రెండ్‌షిప్ కోసం ప్రాకులాట తప్ప ఇందులో ఆయన కొచ్చేదేంలేదు" అనిచెప్పి చైర్మన్ డెసిషన్ కోసం ఆగాడు కమిషనర్.

"యం.ఎల్.ఏ కంపెనీ వాళ్ళ ఫ్రెండ్‌షిప్ కోసం ఎలా పాకులాడుతున్నాడో – నేను మీ ఫ్రెండ్‌షిప్ కోసం తణుకులాడుతున్నాను. మీరు పూర్తిగా యం.ఎల్.ఏకి కొమ్ము కాస్తూ నన్ను నెగ్లెక్ట్ చెయ్యకండి. ప్రజల్లో నాక్కూడా మర్యాదుండాలిగా" అన్నాడు చైర్మన్. ఇక నుండి చూస్తారుగా – ఇద్దర్నీ ఎలా కలుపుకుపోతానో – అంటూ లేచాడు.

యం.ఎల్.ఏ చెప్పిన ఒకపని ఇంత తేలిగ్గా చేయగలుగుతున్నందుకు అదే తన మీదకు రాకుండా కౌన్సిల్ మీదకు నెట్టేస్తున్నందుకు చాలా చాలా హేపీగా ఫీలవుతూ యం.ఎల్.ఏ దగ్గరకు బయల్దేరాడు కమిషనర్.

కమిషనర్ ఇలా వెళ్ళగానే అలా యంటీ రూంలోకి వెళ్ళాడు చైర్మన్. ఆ రూంలో యల్2 కంపెనీ వాళ్ళున్నారు. వాళ్ళ పక్కన సుబ్బారావు ఉన్నాడు. "మీపని ఎలా చెయ్యాలా అని రెండు రోజులుగా తల బద్దలు కొట్టుకుంటున్నాను. కమిషనర్ వచ్చి సూత్రం చెప్పి వెళ్ళాడు" అన్నాడు చైర్మన్ ఆనందంగా.

"అతను రాలేదు సార్ – నేనే వెళ్ళమని సలహా ఇచ్చాను" అన్నాడు సుబ్బారావు. ఆమాత్రం నాకు తెలీదా! అందుకేగా నిన్నింతగా నమ్ముతున్నాను.

ఛైర్మన్ రాకతో యల్ 2 కంపెనీ వాళ్ళు సుబ్బారావు చేతిలో ఓ ఐదు వేలు పెట్టారు. ఆ డబ్బు తీసుకొని చాంబర్ నుండి బయటకొచ్చాడు సుబ్బారావు. మరో పదినిమిషాలకు తీసుకెళ్ళిన సూట్కేసు ఛైర్మన్ చాంబర్లో వదిలేసి బయటకొచ్చారు యల్ 2 కంపెనీవాళ్ళు.

సరిగ్గా అదే సమయంలో కమిషనర్ యం.ఎల్.ఎ ఇంటిలోకి అడుగు పెడుతున్నాడు. యం.ఎల్.ఎ ఉగ్రనర్సింహావతారంలో ఉన్నాడు. చుట్టూ ఆరుగురు కౌన్సిలర్లున్నారు. వాళ్ళలో సీతారాం కూడా ఉన్నాడు. కమిషనర్ని చూసి పళ్ళు పటపట కొరికాడు.

"ఏమయ్యా నీ కేడర్ ఈ మున్సిపాల్టీ గ్రేడుకన్నా తక్కువైనా గవర్నమెంటు మీద ఒత్తిడి పెట్టి నిన్నీ మున్సిపాలిటీలో వెయ్యించుకుంటే ఇదా నువు చేయ్యాల్సిన పని? నా గురించి ఆ ఛైర్మన్గాడి ముందు అడ్డమైన కూతలు కూస్తావా? నేను తప్పుడు మనిషినా? అవినీతి పరుడినా? అక్రమాల్జెయ్యమని నీ పీకలమీద కూర్చుంటానా? నీకు బుద్ధుందా? నీ కళ్ళు నెత్తిమీద కొచ్చాయా" యం.ఎల్.ఎ అలా రంకెలేస్తుంటే ఆరుగురు కౌన్సిలర్స్ చిద్విలాసంగా నవ్వుతున్నారు.

తన మాటలు వాళ్ళలో ఎవరు విన్నారో కమీషనర్కి అర్థంకావట్లేదు. ఎమ్మెల్యే తిట్లప్రవాహం అయిపోయాక కమిషనర్ నెమ్మదిగా –

"సార్! మీరలా నన్ను వెయ్యించినందుకే కదా మీరు చెప్పినట్టు మీ కార్యకర్త కొడుక్కి ఆఫీసులో ఉద్యోగమిచ్చాను. మీ పేరు చెప్పి మున్సిపల్ ఖాళీ జాగాలో యాభై గుడిశలేసుకుంటే నోర్మూసుకొని ఊరుకున్నాను. మీ పార్టీ నగర వైస్ ప్రెసిడెంట్ కొడుకు మున్సిపల్ షాపుకి రెండు సంవత్సరాలు నుండి అద్దె కట్టకపోయినా కనీసం నోటీసుకూడా ఇవ్వలేదు. మీ పార్టీ పండుగ జరిగినపుడు వర్తకుల దగ్గర ఐదులక్షలు వసూలుచేసి ఇచ్చాను" అన్నాడు.

దాంతో ఎమ్మెల్యే తోకత్రొక్కిన త్రాచులా లేచాడు.

"ఇవన్నీ చేసానని ఆ ఛైర్మన్ గాడిదగ్గర నా పరువు తీస్తావా? ఇదిగో నువ్వు నాకోసం చేసిన పనుల్నే, ఇప్పుడు నీ మీద కంప్లయింట్ పెట్టడానికి

ఉపయోగిస్తున్నాను. ఒరే సీతారాం! పిటిషన్ రడీ చేయ్! రేపే హైదరాబాద్ వెళ్ళి ట్రాన్స్ఫర్ ఆర్డర్స్‌తో తిరిగొస్తాను. నువ్వింక వెళ్ళొచ్చు"

చరచర పుట్టలోకి వెళ్తున్నపాములాగ మీద మీదకు వెళ్ళిపోయాడు యం.ఎల్.ఎ.

కౌన్సిలర్స్ వైపు ఓచూపు విసిరి రాబోయే ట్రాన్సఫర్ గురించి తల్చుకొని వుస్సూరుమంటూ యం.ఎల్.ఎ ఇంటినుండి బయటపడ్డాడు కమిషనర్.

చిద్విలాసంగా నువ్వుతున్నారు ఆ ఆరుగురు కౌన్సిలర్స్.

# ఆ ముగ్గురు

ఆ మున్సిపాల్టీ ఈమధ్య బాగా డెవలప్ అయింది. ఎంత బాగా అయ్యిందంటే గజం ధర లక్ష రూపాయిలు పలికేంత. ఎన్.ఆర్.ఐ.లు ఎంతోమంది అక్కడే పెట్టుబడి పెట్టేటంత. ఆ మున్సిపాల్టీ చుట్టూ ఉన్న పొలాలు స్థలాలుగా మారిపోయేంటంత. వ్యాపారులు సంచుల్తో డబ్బు గుమ్మరించి జాగాల్ని అదుగుల్లో కొనుక్కొనేటంత. రౌడీలు విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసేటంత.

అలాంటి ఆ పట్టణంలో ఓ అందమైన పార్కు. ఆ పార్కులో ఆ ముగ్గురు ఎదురెదురుగా కూర్చొని ఉన్నారు. వారిలో ఇద్దరు మూడో వ్యక్తిని తదేకంగా చూస్తున్నారు. అతనేం చెబుతాడోనని శ్రద్ధగా చూస్తున్నారు. వారి కళ్ళలో శ్రద్ధతో పాటు భయం కూడా ఉంది. ఆ మూడో వ్యక్తి రాజిరెడ్డి, మిగిలిన ఇద్దరితో అన్నాడు.

"మీ ఇద్దర్నీ చూస్తుంటే ఒక్క పక్క సంతోషంగా ఉంది. మరో పక్క కసిగా వుంది. నాలో రోజురోజుకి ఏదో తెలియని భావం – దాన్ని భయమనాలో తెలీదు, బాధ అనాలో తెలీదు – ఒకలాంటి వెలితి ఎక్కువవుతోంది. మిమ్మల్ని చూస్తున్నప్పుడది ఇంకా ఎక్కువై భూతంలాగా నన్ను ఆవహిస్తోంది. అలాంటప్పుడు నాకు కాళ్ళు చేతులు ఆడట్లేదు – నోరు పిడచకట్టుకపోతోంది. మాట పెగలట్లేదు"

మిగిలిన ఇద్దరిలో ఒకరి పేరు క్రిష్టోఫర్. ఆర్టీవోగా పన్జేస్తున్నారు. మాదిగ వీరన్న కొడుకు. రాజిరెడ్డి వేదనను అర్థం చేసుకున్నాడేమో క్రిష్టోఫర్ నెమ్మదిగా అన్నాడు.

"రెడ్డి గారూ! మిమ్మల్ని కాదని మేమేది చేయ్యలేం, మీ మనసుకి కష్టంగా అనిపిస్తే ఈ పండగకి మేముకూడా ఊరెళ్ళం, ఏరా?" నీ మాట కూడా అదే కదా అన్నట్టు ముత్యాలరాజుని చూసాడు. ముత్యాలరాజు కూడా సరేనన్నట్టు తలూపాడు. ముత్యాలరాజు మున్సిపల్ కమిషనర్‌గా పన్జేస్తున్నాడు. అతను చాకలి రాంబాబు తమ్ముడు. వాళ్ళ ఊర్లో అతనలాగే ప్రసిద్ధుడు. ఎందుకంటే ముత్యాల రాజు కళ్ళు తెరిచిన కొన్ని దినాలకే తండ్రి కన్నుమూసాడు గనుక.

రాజిరెడ్డి గట్టిగా శ్వాస పీల్చి వదిలి, మళ్ళీ పీల్చి, వదిలి ఆ గాలిచ్చిన బలంతో గట్టిగా చెప్పాడు. "అవును, అమ్మవారి పండగకి మీరు మావూరు రావద్దు. నేను వెళ్తాను. మానాయనికి మరొక్క సంవత్సరం గడువిమ్మంటాను. ఈ సంవత్సరంలో నేను మీకన్నా ప్రయోజకుడినయ్యానని నిరూపించుకొని ఆ మేడ కొనేస్తాను"

"నిజమే, మేం కనిపించకపోతే పెద్దరెడ్డిగారు మీకు పని లేని సంగతి, మేం ఆఫీసర్స్ అయిన సంగతి మర్చిపోతారు. దాంతో ఆ మేడ కూడా ఆయనకు గుర్తుకురాదు. వచ్చే పండగ నాటికి మీ పనులన్నీ సానుకూలమైతే మా కన్నా మీరే ధనవంతులైతారు. ఆ మేడ కొనేస్తే మీ ప్రయోజకత్వం నిరూపించబడుతుంది. పెద్దరెడ్డిగారికి మనశ్శాంతి ఉంటుంది" అన్నాడు ముత్యాలరాజు.

మరి కొంత తర్జన భర్జన తర్వాత ముగ్గురు ఎవరి కార్లో వారు బయల్దేరారు.

అయితే వారిలో ఎవరికీ తెలీదు – రాజిరెడ్డి కారుని సాయుధులైన కొంతమంది సఫారీ వెహికిల్‌లో వెంబడిస్తున్నారని.

*****

ఆ ముగ్గురిది ఒక పల్లెటూరు, క్లాస్‌మేట్స్ కూడా, రాజిరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి వందెకరాల ఆసామి. క్రిష్టోఫర్, ముత్యాలరాజు కుటుంబాలు పేదవర్గాలకు

చెందినవి. ముత్యాలరాజు పూర్వీకులు రాజిరెడ్డి ఇంటి చాకళ్ళు, ఇక క్రిష్టోఫర్ కుటుంబీకులు రాజిరెడ్డి ఇంటివైపు కన్నెత్తి చూసే అర్హత కూడా లేని వాళ్ళు.

సానుభూతి అనే పదం చాలా విచిత్రమైంది. కృష్ణారెడ్డిలో అది ఎంతగా వుందో అంచనాలకు అందదు. తన కన్నా తక్కువ వారు ఆనందంగా ఉంటే ఎంతో సంతోషిస్తాడు. వాళ్ళ కళ్ళెప్పుడు సంతోషంతో తడిగా ఉండాలంటాడు. తనతో సమానమైనవారు, ఎక్కువగా ఉన్నవారి కళ్ళు కూడా తడిగానే ఉండాలంటాడు. అలా ఉంచడానికి తను చెయ్యాల్సిందంతా చేస్తాడు కూడా. కానీ ఆ'తడీ', ఈ'తడీ' ఒకటి కాదు.

ఈ సిద్ధాంతం ప్రకారమే క్రిష్టోఫర్‌కు, ముత్యాలరాజుకు ఉద్యోగాలు రానంత వరకు, వాళ్ళ కుటుంబాల్ని ఎంతో ప్రేమించగలిగాడు. ఆదరించగలిగాడు. అభిమానించగలిగాడు. కానీ వాళ్ళకు సమాజంలో గౌరవ మర్యాదలు వచ్చినప్పుడు సహించ లేకపోయాడు. పైగా వాళ్ళ సమవయస్కుడైన రాజిరెడ్డికి ఉద్యోగం, సజ్జోగం లేకపోవడంతో, ఊర్లో వాళ్ళంతా రాజిరెడ్డిని ఓ పోరంబోకులా భావించడం, అతనికి భరించరాని విషయంగా తయారైంది. అందుకే ఒకరోజు కొడుకుని పిల్చి బండబూతులు తిట్టాడు.

"ఏరా ఎదవ నా కొడకా! నీ పుట్టుక మర్చిపోయావురా! నీ ఒంట్లోని రక్తమాంసాలు కాదట్రా, నీకు సిగ్గు, అభిమానం ఏ కోశానా లేదట్రా! పరిస్థితిని ఒక్కసారి అర్థం చేసుకోరా! మనమిచ్చే తిండిగింజల కోసం, చిల్లర పైసల కోసం, మన ఇళ్ళముందు పడిగాపులు పడి ఉండే వారు, ఈ రోజున ఆఫీసర్లయ్యారు. జీతాలొస్తున్నాయి. వాళ్ళ ఇంటర్వ్యూల కోసం జనాలు ఎగబడుతున్నారు"

"అయితే నన్నేమి చెయ్యమంటావ్" కాస్తా కోపంగానే తండ్రిని ప్రశ్నించాడు రాజిరెడ్డి. దాంతో రెచ్చిపోయాడు కృష్ణారెడ్డి. కాళ్ళకున్న చెప్పుతీసి పడీ, పడీ మని చేతులు అలిసిపోయే వరకు కొట్టాడు.

రాజిరెడ్డికి కూడా సొమ్మసిల్లినంత పనైంది.

కాస్సేపటికి ఇద్దరికీ అలసట తీరింది. కొడుకుని కుదేసినట్టు లేపి కూర్చోబెట్టాడు.

ఏం చెయ్యాలో, ఎందుకు చెయ్యాలో చెబుతాను విను, అంటూ చెప్పడం ప్రారంభించాడు.

"నా చిన్నప్పుడు మాల, మాదిగల్ని ముట్టుకుంటే స్నానాలు చేసేవారం, మనకెదురుగా నడవడానికి, మన ముందు  కూర్చొనడానికి,  మన కళ్ళలో కళ్ళు పెట్టి చూడడానికి సాహసించేవారు కాదు. ఊరికింత దూరంలో పశువుల కన్నా హీనంగా బ్రతికే వారు. చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరిలాంటి కులాలు మనతో పాటు ఊర్లోనే ఉండేవారు. కానీ వాళ్ళయితే మనలాంటి పెద్ద వాళ్ళకు సేవలు చేస్తూ బతికేవారు. ఇదంతా ఎన్నో యుగాలుగా జరిగిపోతూ వచ్చింది. కానీ ఇప్పుడు పరిస్థితేంటి? మాల మాదిగలు పోరాటాలు చేస్తున్నారు. చాకలి, మంగళ్ళ కుర్రాళ్ళు చదువుల కోసం ఎగబడుతున్నారు. కానీ మన కులపు కుర్రాళ్ళు భూముల్జూసుకొని, ఆస్థులు చూసుకొని, ఒంటి మదంతో విర్రవీగుతున్నారు. చదువులబ్బడం లేదు. వాళ్ళ కుర్రాళ్ళు పట్నాలకు పోతుంటే నీలాంటి ఏబ్రాసీ నా కొడుకులు ఈ పల్లెల్లోనే చస్తున్నారు. ఇంకో రెండు తరాలు గడిచేసరికి ఏమౌతాదో తెలుసా?

మన దగ్గరున్న భూములు ఒక దఫా పండి, మరో దఫా ఎండి, ఎకరా ఎకరా చెయ్యిజారిపోతాయి. వాళ్ళ దగ్గర లక్షలు లక్షలు జీతాలు రూపాన, లంచాల రూపాన పోగతవి. ఆ డబ్బుపెట్టి మన భూములన్నీ వాళ్ళు కొంటారు. అప్పుడు వాళ్ళు మనకు చేసిన సేవలన్నీ వాళ్ళకి మనం చెయ్యాలి. అందుకే చదువు లేకపోయినా ఫర్వాలేదు. సంస్కారం అబ్బకపోయినా ఫర్వాలేదు. దొంగతనం చేస్తావో, దోపిడీలు చేస్తావో, రౌడీయిజం చేస్తావో, వ్యాపారం చేస్తావో, వ్యవహారం చేస్తావో,  ఏం చేస్తావో నాకు తెలీదు. వాళ్ళిద్దరూ జీవితాంతం ఉద్యోగంలో సంపాయించిన దానికన్నా ఎక్కువ డబ్బు, నువు ఒక సంవత్సరంలో సంపాయించాలి. వచ్చే ఏడాది అమ్మవారి పండగనాటికి ఆ డబ్బుతో మన జమిందారీ గారి మేడ, దాని చుట్టూ ఉన్నవంద ఎకరాల భూమిని కొనాలి. అంతవరకు నువ్వు నాకు లేనట్టే లెఖ్ఖ" అన్నాడు కృష్ణారెడ్డి.

తండ్రి మాటలు విన్న రాజిరెడ్డి గీత బోధ విన్న అర్జునునిలా లేచాడు. తండ్రి అంత కోపంగా చెప్పినా, కొడుకు మాత్రం ఎంతో సహనంతో విన్నాడు. ప్రతీ చెప్పు దెబ్బ ఒక వేద వాక్కులా పన్జేసింది.

అదే రోజు పట్నం వచ్చేసాడు రాజిరెడ్డి. తేలిగ్గా డబ్బు సంపాయించడానికి ఎన్నో ఆలోచనలు చేసాడు. లాటరీలు కట్టడం దగ్గర నుండి ఈజీ మనీ రావడానికి ఎన్ని ఉపాయాలున్నాయో అన్నీ చేసి చూసాడు. ఉహూ...ఏదీ క్లిక్ కాలేదు. జమిందారు తాలుకా పాత మేడ, చుట్టూ ఉన్న వందెకరాల భూమికొనడానికి అవసరమైన పదికోట్లు సంపాయించలేకపోయాడు.

పార్కు నుండి వచ్చిన రాజిరెడ్డి కారుదిగి ఇంట్లోకి వెళ్ళాడు. అతన్ని వెంబడించి వచ్చిన సఫారీ లోంచి సన్నగా, నాజుగ్గా ఉన్న అరవయేళ్ళ వ్యక్తి దిగాడు. అతని కన్నా ముందు దిగినవాడు వెళ్ళి, రాజిరెడ్డి ఇంటి కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపు తీసిన నౌకర్‌తో "రాజిరెడ్డితో మాటాడానికి చౌదరి గారొచ్చారని చెప్పు" అన్నాడు కాలింగ్‌బెల్ నొక్కినవాడు.

రాజిరెడ్డి, చౌదరి ఎదురెదురుగా కూర్చొని ఉన్నారు. ఆ చౌదరి ఏ పని మీద వచ్చాడో చెప్పడం ప్రారంభించాడు.

"నా పేరు రామకృష్ణ చౌదరి, మాది నెల్లూరు జిల్లా. మా బంధువులు ఈ టౌనుని ఆనుకొని పదెకరాలు కొన్నారు. పదేళ్ళ కిందట మాట. అప్పుడింత రేట్లెక్కడవి? కొని స్టేట్స్‌కి వెళ్ళి పోయారు. ఇప్పుడా భూమిని ఎం.ఎల్.ఏ. మనుష్యులు ఆక్రమించుకున్నారు. ఎకరం పది కోట్లుకు పైన పలుకుతుంది. మా భూమి మాకు ఇప్పిస్తే మీకు రెండెకరాలిస్తాం. అంటే దాదాపు ఇరవై కోట్లు చెప్పండి మీరు చెయ్యగలరా?" రాజిరెడ్డి మనసు ఆనందంతోను, మెదడు ఆలోచనలతోనూ నిండిపోయింది. రాజిరెడ్డి వ్యూహం పన్నుతుండగా రామకృష్ణ చౌదరి చెప్పుకుపోతున్నాడు.

గతంలో ఇలాంటి సెటిల్‌మెంట్లు నెనెన్నో చేసాను. ఇప్పుడు మీరు మాత్రమే చెయ్యగలరు. ఎందుకో మీకూ తెల్సు.. మీరు గానీ, మేం గానీ మూడు ముఖాలు, నాలుగు చేతులు పెట్టుకొని పుట్టలేదుగా, మీరైనా, మేమైనా ఎప్పుడు మగాళ్ళం?

పైన కాపాడేవాడు, కాచుకొనే వాడుంటేనే కదా! అప్పుడు మాకున్నారు. ఇప్పుడు మీకున్నారు. కాబట్టి ఈ పన్జేసి పెట్టండి. మీది మీరు తీసుకోండి. కాస్సేపాగాడు రామకృష్ణ చౌదరి.

"అదే అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు రాజిరెడ్డి. అన్నాడేగానీ, ఇంకా ఆలోచనలోంచి బయటపడలేదు. చౌదరికి చెప్పే తీట కూడా తీర లేదు. అందుకే అతనింకా చెప్పుకుపోతున్నాడు.

"కులం గురించి ఎక్కువ మాట్లాడుతున్నాననుకోకండి. ఈ రోజుల్లో నాయకులకు కులమే బలం. ఈ పనికి మిమ్మల్ని ఎంచుకోవడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి మా భూమి ఆక్రమించుకున్న ఎం.ఎల్.ఏ. మీ కులస్థుడు. రెండో కారణం ఏమిటంటే మీ సొంత ఊరు ఇక్కడకు ముప్పై కిలోమీటర్లు దూరంలో ఉంది. మంది మార్బలం కావాలంటే క్షణాల మీద మీవూరు నుండి రప్పించొచ్చు. మూడోది, ముఖ్యమైంది ఏమిటంటే, మీ నాన్నగారు జిల్లా మంత్రిగారికి చాలా సన్నిహితుడు. ముఖ్యమైన అనుచరుడు. మంత్రి తన అనుయాయులందరికీ ఏదో ఒక పనిచేసి పెట్టి, వారికి తనపట్ల ఉన్న ప్రేమను ప్రకటించుకొని ఋణం తీర్చుకుంటున్నాడు. మేము బాగా స్టడీ చేసాం. మీ నాన్నగారు ఇంత వరకు అతని ద్వారా ఏ పనీ చేయించుకోలేదు. కాబట్టి మీ నాన్నగారు ఒక్కసారి మంత్రిని కల్సి ఇది నాకు పర్సనల్ ఇంట్రెస్ట్ అని అన్నారనుకోండి, మాపనైపోతుంది. మా పనైపోవడమంటే ఇరవైకోట్లు మీ చేతిలో పడినట్లే" అని గ్లాసుడు మంచినీళ్ళు గటగట తాగాడు.

అప్పటికి రాజిరెడ్డి ఆలోచనల వలయం నుండి బయట పడ్డాడు. "మీ పనికి ఒప్పుకుంటున్నాను. రేపు ఒక కోటి రూపాయలు అడ్వాన్సుగా తీసుకురండి. గుడ్‌నైట్" అంటూ లేచాడు రాజిరెడ్డి. మర్నాడు కోటి రూపాయిలు తీసుకొని, తండ్రి దగ్గరకెళ్ళాడు రాజిరెడ్డి.

కొడుకు తెచ్చిన కోటి రూపాయల్ని చూసి మురిసిపోయాడు కృష్ణారెడ్డి. కొడుకు పుట్టినప్పుడు కూడా అంత సంతోషం కలగలేదు అతనికి. కృష్ణారెడ్డిలో ఒక రకమైన సంతోషం కాదు, రకరకాల సంతోషాలు రకరకాలుగా కలిగింది.

అందులో ఒకటి తన కులం వలన కలిగింది. తన కులాన్ని ఎన్నో సార్లు తిట్టుకున్నాడు. తక్కువ కులాల వాళ్ళకిస్తున్న రాయితీల గురించి విన్నప్పుడు, వాళ్ళు పైకి ఎదుగుతున్నప్పుడు, ముఖ్యంగా రిజర్వేషన్ వలన తన సర్పంచ్ పదవి పోయినప్పుడు, మరీ ముఖ్యంగా ఎలక్షన్స్‌లో తన మాట వినకుండా ఎవరి ఓట్లు వాళ్ళు వేసుకున్నప్పుడు – గత వైభవానికి, ఈనాటి పరిస్థితికి మధ్యనున్న తేడాను గమనించి ఎన్నో సార్లు తనకులాన్ని లోలోన నిందించుకున్నాడు. మాల మాదిగోడిగా పుట్టి ఉంటే బాగుండు అనుకున్నాడు. కాని ఇప్పుడా బాధంతా పోయింది. తన కులానికున్న బలాన్ని, విలువను చూసి పొంగిపోయాడు. కొడుకుని చూసి మరీ మరీ పొంగిపోయాడు. దుర్యోధనుడ్ని చూసిన ధృతరాష్ట్రుడిలా ఉబ్బితబ్బిబై పోయాడు.

మర్నాడు జిల్లా మంత్రిని కలిసి విషయమంతా వివరించాడు. ఈ పని నాకెలాగైనా చేసిపెట్టాలని మళ్ళీ మళ్ళీ అడిగాడు. “నేనెక్కువ సార్లు రాలేను, ఇదిగో రాజిరెడ్డి! నా కొడుకు. వీడికి ఎలాగైనా నువ్వే లిఫ్ట్ ఇవ్వాలని” కొడుకు చెయ్యితీసి మంత్రి చేతిలో పెట్టాడు – మంత్రి దగ్గర హామీ తీసుకొని తండ్రి కొడుకు లిద్దరూ ఇంటికొచ్చేసారు.

ఆ మర్నాడు చౌదరి వచ్చి కృష్ణారెడ్డిని కలిసాడు. రెండెకరాలు రాజిరెడ్డి పేర్న రిజిష్టర్ అయిపోయింది. మరో వారం రోజుల్లో చౌదరి భూమి చౌదరికి రికవరీ అయిపోయింది. చౌదరి, రాజిరెడ్డి ఇద్దరూ కల్సి రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. దాంట్లో కోట్లు కోట్లు, కలిసొచ్చాయి. పల్లెలో జమిందార్ మేడతో పాటు, చుట్టూ ఉన్న వందెకరాల పొలం కొనేసి తండ్రి కోరిక తీర్చాడు రాజిరెడ్డి.

కృష్ణారెడ్డి, కొడుకుని చూసి భలే ముచ్చటపడి పోతుంటాడు. డబ్బు, హోదా, అధికారం, అంతస్థుల్లాంటి విషయాలకు, చదువుకి, మంచితనానికి ఏమాత్రం సంబంధంలేదనేది కృష్ణారెడ్డి క్రొత్త అనుభవ సిద్ధాంతం.

ఆ తర్వాత సంవత్సరం అమ్మవారి పండగకి ఆ ముగ్గురు స్నేహితులు పల్లెకు వెళ్ళారు. ముగ్గురు కృష్ణారెడ్డి ఎదురుగా కూర్చున్నారు. కృష్ణారెడ్డికి ఇప్పుడు

మాల మాదిగల్ని చూస్తే మనసునిండా ప్రేమ. వాళ్ళంతా చదువు కొని పైకి రావాలనే ఆశ. క్రిష్టోఫర్‌ని, ముత్యాలరాజుని ఆదర్శంగా ప్రజలకు చూపిస్తుంటాడు. ఆ ముగ్గురిలో వాళ్ళిద్దరూ ఎంత కష్టపడ్డారో ఎలా పైకి వచ్చారో ప్రజలకు చెబుతుంటాడు. కాని తన కొడుకెలా పైకొచ్చాడో, దాని వెనుక దాగి ఉన్న ధార్మిక, ఆర్థిక, సామాజిక సూత్రమేంటో ఎవ్వరికీ చెప్పడు. చెప్పినా చాలా మందికి అర్థం కాదు.

# చైర్మన్ గారి భార్య

ఆ మున్సిపాల్టీ చైర్మన్ పేరు బడ్డీల శ్రీను. ఆ పేరేలా వచ్చిందంటే టౌనులో రద్దీ, ప్రాధాన్యతలేని రోడ్డు ప్రక్కన శ్రీను చెక్క బడ్డీలు వరసగా, పెట్టేవాడు. అవికూడా బడ్డీలంటే బడ్డీలుకావు. కావా అని గట్టిగా అడిగితే అడిగినంత గట్టిగా కావనలేం. ఎందుకంటే మూడు ప్రక్కల చెక్కలుండేవి ముందుకి డోరుండేది పైన కప్పుండేవి. వీటన్నింటికి మంచి మున్సిపాల్టికి కట్టిన టెంపరరీ ఎక్రోచ్‌మెంటు రసీదుండేది. ఇకన బ్రహ్మదేవుడైనదాన్ని బడ్డీకాదనగలడా! అన్లేదు– శ్రీనుగాడు అప్పట్లో అలాగే పిల్చేవారు, పెట్టిన రోడ్డు అంత ప్రాధాన్యత లేనిదని ముందే చెప్పుకున్నాం కాబట్టి ఆ బడ్డీల సంగతి మున్సిపాల్టీవాళ్ళు అంతగా పట్టించుకొనే వారు కాదు. ఒక వేళ పట్టించుకొని వాటిని తొలగించడానికి ప్రయత్నిస్తే మున్సిపాల్టీ వాళ్ళిచ్చిన రశీదులు పట్టుకొని, బడ్డీల కిరాయి ఓనర్లంతా ప్రత్యక్షమైపోయేవారు.

ఒక్కడ్ని చంపినోడు ఖూనీ కోరు. అదే వందమందిని చంపితే వీరుడు. అలాగే ప్రజాస్వామ్యంలో ఒక సమస్య వెనక ఒక్కడుంటే అది ఆరాటం. కలిసి పదిమంది అడిగితే అది పోరాటం. ఆ సూక్తిననుసరించి శీనుగాడి దగ్గిర డబ్బులు తీసుకొని బడ్డీల ఓనర్లుగా నిలబడినవాళ్ళు, వాళ్ళ వెనకున్న కుటుంబ సభ్యులు, వారి మద్దతుదార్లు – ఇంత మంది జీవనోపాధి కోల్పోతారని, దయ తలచి వదిలేయడమో, అలా అని కోర్టు నుండి ఆర్డరు రావడమో జరిగేది. దాంతో మున్సిపాల్టీవాళ్ళు బడ్డీలు తొలగించడం జరిగేది కాదు. ఇదంతా జరిగి ఇష్యూకి ఒక ఫైనాల్టీ వచ్చేసరికి కొన్ని సంవత్సరాలు గడిచిపోయేది. ఈ లోగా ఆ ప్రాంతానికీ ప్రాధాన్యత వచ్చేది. అప్పుడు శ్రీనుగాడు ఒక్కో బడ్డీని తెగనమ్మేసేవాడు. కొన్ని

వేలు సంపాయించాడు. ఆ తర్వాత శ్రీనుగాడి వ్యాపారం గుడిసెల వరకెళ్ళింది. గుడిశెలెయ్యడం, మళ్ళి పోరాడటం. లక్షలు సంపాయించాడు. అలా బడ్డీలతో తన జీవితాన్ని ప్రారంభించాడు కాబట్టి బడ్డీల శ్రీనుగాడు, కొన్నాళ్ళకు కౌన్సిలర్ అయ్యాడు. ఆ తర్వాత చైర్మన్ కూడా అయ్యాడు.

చైర్మన్ అయ్యాక దూరంగా ఉన్న పొలాలు చవగ్గా కొనేసి ప్లాటు వేసి అమ్మి – కోట్లు సంపాంచాడు. రోదసిలోకి ప్రయోగించిన రాకెట్టు దూసుకుపోతున్న కొద్ది అనవసర బరువును వదిలేస్తుంటుంది. అలాగే శ్రీను గాడు కూడా గాడు, గీడు లాంటి పదాల్ని రాల్చేసుకొని దూసుకు పోయాడు. అయితే తనకు కల్సొచ్చిన బడ్డీ అనే పదం మాత్రం వదలదల్చుకోలేదు. తను గొంగలి పురుగు దశ నుండి సీతాకోక చిలుకలాగ మారుతున్న తరుణంలో తనింటి పేరు తగిలించి 'వంజరం శ్రీను' అనిపిలిస్తే, అదెవర్నో పిలుస్తున్నారనుకొనే వాడు. 'అన్నా నిన్నే' అని కదిలించేవరకు పిల్చింది, తననే అనే స్పృహ కలిగేదికాదు. అందుకే నామినేషన్ పత్రాల్లోగానీ, బ్యాలెట్ పేపర్లోగానీ ఇంటిపేరుకి, బయటపేరుకి మధ్యలో 'బడ్డీ' అని తగిలించేవాడు. ఆ విధంగా ప్రజల నాలికలమీద నర్తించే తనపేరును ఓట్లు సంపాదించుకోవడానికి వాడుకున్నాడు.

ఇటువంటి బడ్డీ శ్రీనివాస్‌కి పద్మావతితో పెళ్లయింది. పెళ్ళయ్యి పదేళ్ళయింది. కూతురు పుట్టి ఎనిమిదేళ్ళయింది. ఆ కూతురి పేరు నిఖిల. ముద్దుగా నిక్కీ అని పిలుస్తారు. అందానికి సరిపోయేటట్టుగా ఎవరుపిల్చినా వెంటనే పలకదు. నిక్కి నీలిగి పలుకుతుంది. ఈ మధ్యనే కూతురికి బర్త్‌డే అయ్యింది. ఆ బర్త్‌డే వాళ్ళింట్లో పన్జేసే చంద్రమ్మకు ఉజ్జోగం ఊష్టింగ్‌డే అయ్యింది.

అదెలాగయ్యిందో చెప్పడానికే ఇదంతా చెప్పాల్సి వచ్చింది. చంద్రమ్మ నమ్మకమైన పనిమనిషి. ఎంత నమ్మకమంటే చైర్మన్ భార్య స్నానం చేస్తూ చంద్రమ్మా! అని పిలిచి వీపు రుద్దించుకునేంత నమ్మకం. పండుగలు, పున్నాలకు ఇంట్లో వండిన గారెలు, బూరెలు, కోడి కూరలతో కారేజ్‌కట్టి, వాళ్ళ పుట్టింటికి పంపుతూ క్రింద కప్పులో నాలుగు కట్టలున్నాయి జాగ్రత్త అన్జెప్పి, అప్పగించేటంత నమ్మకం. చైర్మన్‌కి, ఊళ్ళో ఉన్న ఒక అందమైన మహిళా కార్యకర్తకి లింకుపెట్టి మాట్లాడినప్పుడు కూపీ లాగడానికి "చంద్రమ్మా! ఆ వెంకట లచ్చి వచ్చినట్టుంది. నువు

చీపురొట్టుకొనెళ్ళి తుడుస్తున్నట్టు అక్కడక్కడే తచ్చాడ"ని పురమాయించేటంత నమ్మకం.

అలాంటి చంద్రమ్మ దేవుని మీద నమ్మకంపెట్టుకొని ఎన్ని మొక్కులు మొక్కినా ఒక్కగానొక్క కొడుక్కి మంచి బుద్ధులు రాలేదు. చద్రమ్మ మొగుడు ఏదో ప్రైవేటు ఫ్యాక్టరీలో వాచ్‌మెన్ ఉద్యోగం చేస్తున్నాడు. వాడికి రాత్రి పగలు తాగుడు గోల. కొడుకు చూస్తే ఎప్పుడూ సినిమా హీరోగోలే.

ఆ హీరో సినిమా రిలీజ్ అయితే చాలు వాడి ఫోటోకి దండవెయ్యడం, ఊరేగించడం, పాలాభిషేకాలు చెయ్యడం – హంగామా ఒక రకం కాదు – వాడు పదిరోజులు ఇంటికిరాడు – అప్పుడే ఆ హీరో మీద పీకల్దాకా కోపమొచ్చేది చంద్రమ్మకు. ఆడియో రిలీజులని, సినిమా రిలీజులని పిలుస్తారు. వాళ్ళ తింగరి మాటలకు, కోతి వేషాలకు చప్పట్లు కొట్టి, గోల జేయిస్తారు. వీళ్ళు చప్పుడు చెయ్యకుండా గమ్మనుంటే ప్రోగ్రాముకి లక్షలు తీసుకొనే యాంకరమ్మ పుల్లెట్టి కెలుకుతాంది. ఆ హీరోల గురించి వర్ణించి, వర్ణించి వగలుబోతారు. అంత హుషారెక్కించకపోతే తర్వాత ప్రోగ్రామ్‌కి పిలవరని వాళ్ళ భయం. ఎవుడి బతుకాడిది. ఆఖర్నొచ్చిన హీరో అందర్నీ జాగ్రత్తగా ఇంటికెళ్ళమని సుద్దుల్జెపుతాడు. ఇంటి దగ్గర అమ్మ నాన్నలు ఎదురుజూస్తుంటారని గేపకం జేస్తాడు. అంతా మాయ! రాజకీయ నాయకులకన్న మాయలావైపోయింది ఎదవ నా కొడుకులకి అని ఒక సారి తిట్టుకుంది చంద్రమ్మ.

ఎప్పటిలాగే కొడుకు అభిమాన హీరో ఆడియో రిలీజ్ సభకు వెళ్ళాడు. తిరిగొచ్చినప్పుడు లారీబోల్తా పడి ముగ్గురు పిల్లలు చచ్చిపోయారు. అందులో చంద్రమ్మ కొడుకు ఒకడు. ఐదారుగురికి కాళ్ళు చేతులిరిగిపోయాయి.

కొడుకు పోయిన్నుండి చంద్రమ్మలో ఒక నిర్వేదం కమ్ముకుంది. వాడున్నప్పుడు ఎలాగ బాగుపడతాడా అని బెంగ, బెంగగా ఉండేది. ఇప్పుడాబెంగ పోయింది. తెలుగు మాటల్లేని తెలుగు భాషలాగ, మనిషి మీద కనీస సానుభూతిలేకుండా ప్రవచనకర్త చేసే ఆధాత్మిక ఉపన్యాసంలాగ అయిపోయింది చంద్రమ్మ జీవితం. తిన్నామంటే తిన్నాము. ఉన్నామంటే ఉన్నాము అంతే. ప్రత్యేకించి దేనిమీద శ్రద్ధలేని మనిషైపోయింది చంద్రమ్మ.

ఈ ధోరణి చంద్రమ్మకిప్పుడలవాటయ్యింది గానీ ఆమె పెనిమిటి అప్పల నర్సింహంది మొదటి నుండి అదే పద్ధతి. ఇప్పుడా జంటను చూస్తే ఋషి దంపతులు గుర్తుకువస్తారు. కాళిదాసు లాంటి కవి కంటబడితే వాళ్ళ జీవనశైలి మీద అద్భుతమైన తాత్విక కావ్యం రాయొచ్చు.

నిక్కీ ఎనిమిదవ పుట్టిన రోజుయ్యిందన్నాను కదా! ఈ ఎనిమిదేళ్ళుగా చంద్రమ్మ ఒక దాదిలా ఆ పిల్లను సాకింది. తల్లి ఒడిలో కన్న చంద్రమ్మ ఒడిలోనే ఎక్కువ కాలం గడిపింది. నిద్రలో ఉలిక్కి పడితే గబుక్కున వచ్చి ఎత్తుకున్నది తల్లికాదు చంద్రమ్మే!. నడకలు నేర్చుకుంటున్నప్పుడు క్రిందపడి మోకాలు దోక్కుపోతే, ఎత్తుకొని లాలించింది చంద్రమ్మే. నిక్కి ఆకలీ, అవసరాలు, అన్నీ తల్లికన్న చంద్రమ్మకే తెలుసు. నిక్కి నోట్లోంచి అమ్మ, అమ్మ అనేమాటకన్న చంద్రమ్మ, చంద్రమ్మ అనే ఎక్కువ సార్లు వినిపిస్తుంది.

చంద్రమ్మ నిక్కీ పట్ల ఏదో తెలియని ప్రేమను పెంచుకుంది. కొడుకు పోయిన తర్వాత ఆ ప్రేమ మరింత గాఢమైంది.

అందుకే నిక్కీ ఎనిమిదో పుట్టిన రోజుకి మంచి బహుమతిని ఇవ్వాలనుకుంది. పెనిమిటిని అడిగితే నీ ఇష్టం అన్నాడు. దాంతో కొడుకి కోసం కూడాబెట్టిన డబ్బంతా తీసి లెఖ్ఖ పెట్టింది. దానికి తోడుగా మరికొంత చేబదులు తీసుకొని బంగారు గొలుసుకొనింది. దాదాపు లక్ష రూపాలయ్యింది.

నిక్కీ పుట్టిన రోజు చాలా ఆర్భాటంగా జరిగింది. ఛైర్మన్ బడ్డీల శ్రీను ఇంటిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సిటీ నుండి మంచి చెఫ్‌లను రప్పించారు. కార్యకర్తలకు, నాయకులకు, బంధువులకు, సమీప బంధువులకు, ఆంతరంగిక మిత్రులకు రకరకాల వలయాల్లో భోజనాలు వడ్డించారు. అదొక కోలాహలం పట్టణానికే పండగలాంటింది.

రాత్రి పదకొండు కావొస్తుంది. సందడి నెమ్మదిగా సద్దుమణుగుతోంది. చంద్రమ్మ నెమ్మదిగా ఛైర్మన్ భార్య దగ్గరికెళ్ళింది. అప్పటికి బంధువులంతా వారి దగ్గర నుండి వీడ్కోలు తీసుకొని ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు.

అటు ఇటు చూసి, ఎవరూ చుట్టు ప్రక్కల లేరని నిర్ధారించుకొని "అమ్మా!" అని పిల్చింది.

"ఏటి చంద్రమ్మా?" అంది చైర్మన్ భార్య కూతురి నిక్కీ ముస్తాబుని తీసి, మామూలు బట్టలు వెయ్యడానికి సిద్ధపడుతూ.

"అమ్మా! నిక్కీ తల్లిని నా చేతుల మీదే పెంచాను. లాలపోసాను. పాలు పట్టాను. నా కళ్ళముందే నలుసులాటి పిల్ల..." ఇంకా ఏదో అనబోయి మాటలు దొరక్క ఆగిపోయింది చంద్రమ్మ. చైర్మన్ భార్య చిరునవ్వు నవ్వింది. ప్రక్కనున్న కప్‌బోర్డు వెతికి, దాంట్లోంచి ఒక చీర తీసింది. ఆ చీర చంద్రమ్మ చేతిలో పెట్టబోతూ "చంద్రమ్మా! పిల్లకు నువ్వు చేసింది మర్చిపోతానా? కనడమైతే నేను కన్నాను కానీ, దానికి మంచి చెడ్డా అన్ని నువ్వే చూసావు. ఇక ముందు నువ్వే చూడాలి. దానికే కాదు, దాని పిల్లలకు నువ్వే చూసుకోవాలి. అది ఎవరింటికెళ్ళినా, దాని వెనక నువ్వే వెళ్ళాలి" అంటూ కళ్ళు చెమరుస్తుండగా అంది చైర్మన్ భార్య.

చంద్రమ్మకైతే ఏడుపొక్కటే తక్కువైంది.

పైట చెంగు తీసి కళ్ళొత్తుకుంది. నిక్కీ తల పుచ్చుకొని తన గుండెలకు హత్తుకుంది చంద్రమ్మ. నిక్కీ కూడా తన రెండు చేతుల్ని చంద్రమ్మ నడుముచుట్టు వేసి చుట్టుకుపోయింది. ముగ్గురికీ అవి ఉద్వేగభరిత క్షణాలు.

ఆ క్షణాలు దొర్లి నిమిషాలుగా మారినాయి.

"అమ్మా!"

"ఏటి చంద్రమ్మా! చెప్పు ఇంకేమైనా కావాలా?"

చాలా ప్రసన్నమైన స్వరంతో అడిగింది చైర్మన్ భార్య.

"నాకేటి వద్దు గానమ్మా! ఇదిగో నా దగ్గరున్న పైసల్తో నిక్కీ తల్లికి ఈ గొలుసుకొన్నాను. నాకాపిల్లల్లేరు. ఉన్న ఒక్కడూ అలిగైపోయాడు. నా రెక్కల కష్టం ఇంకెవలికిస్తాను? అందుకే... ఈ గొలుసు... నా బంగారు తల్లికి కొన్నాను. ఇది అమ్మాయి గారి మెడలో ఎయ్యండమ్మా!" అని పెట్టిలోంచి గొలుసు తీసి నిక్కీ

మెడలో వెయ్యబోయింది చంద్రమ్మ!

"ఆగాగు చంద్రమ్మా!"

ఇంత కేకిసి చంద్రమ్మ చెయ్యి పట్టుకొని ఆపేసింది చైర్మన్ భార్య.

ఆ అరుపుకి నిక్కీ మెడవరకెళ్ళిన చంద్రమ్మ చేతులు మధ్యలో ఆగిపోయాయి.

'ఏటమ్మా?" తెలియక తనేమైనా తప్పు చేసానేమోననే అనుమానమొచ్చింది చంద్రమ్మకు.

కానీ చైర్మన్ భార్యకి బట్టల షాపింగ్ చేసిన రోజు గుర్తొచ్చింది.

ఇంట్లో వాళ్ళకి, బంధువులకి ఇవ్వాల్సిన బట్టలు ఐదుపది వేలఖరీదువి తీసుకున్నాక చంద్రమ్మ కోసం చీర కొనాలనుకొని

"పనిమనిషి కివ్వడానికి ఓ చీర చూపించండి" అంది.

"ఇవి చూడండమ్మా! వెయ్యి రెండువేల మధ్యలో ఉంటాయి" అన్నాడు షాపువాడు.

"ఏవయ్యా! పనిమనుషులకి వేలుపెట్టి చీరలు కొంటారా? ఐదారొందల్లో చూపించు" అంది తను.

ఆ సంభాషణంతా గుర్తొచ్చి ఒకింత సిగ్గు, అవమానం అనిపించాయి. కానీ అంతలోనే తేరుకుంది.

ఆ కాస్సేపటిలోనే ముఖమంతా నవ్వు పులుముకొనింది.

"చూడు చంద్రమ్మా! నిక్కీ పట్ల నీకున్న ప్రేమనాకు తెలీదా? ఇవన్నీ నువ్వు ఇవ్వాలా?"

"అది కాదమ్మా! ఏదో నాకనిపించింది ఇలాగ..."

"సరే! అలాగైతే మంచిరోజు చూసి ఏద్దాంలే... అందాక నీదగ్గిరే ఉంచు"

అంది.

ఆ మాటకు ఎదురు చెప్పలేక ... ఇంటికి బయల్దేరింది చంద్రమ్మ.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు

రకరకాల ఆలోచనలు

అంత డబ్బెలా వచ్చింది?

బంగారం రేటు ఆకాశాన్నంటింది. పెద్ద వాళ్ళే కొనగలిగే పరిస్థితి లేదు. అలాంటిది లక్షలు పెట్టి కొనడమంటే...? అంతగా నమ్మినందుకు డబ్బులు కొట్టేసిందా? లేకపోతే పుట్టిన రోజు సందర్భంగా ఎంతో మంది గొలుసులు, వాచీలు, రింగులు, గిఫ్టులుగా తెచ్చి ఇచ్చారు. అవన్నీ ఒక గదిలో కుప్పలాగా పోసేసాం. ఆ గదిలోకి ఎవర్నీ పంపలేదూ కానీ చంద్రమ్మను మాత్రం రెండు మూడు సార్లు ఏదో పనిమీద పంపించాను. అందులోంచి ఏదైనా కాజేసి మహోర్భానీకి మనవి మనకే పెడతుందా? ఒకవేళ తన ఖర్చులు పోగు పైసా పరకా మిగిల్తే, తనకన్న క్రిందున్న వాళ్ళకు, ఏదైనా ఇవ్వొచ్చు. వాళ్ళ దగ్గర తన గొప్పతనం చూపించొచ్చు. అంతేగాని తను కూలిపన్జేనుకొనే యజమానురాలి దగ్గర తన డాబు ప్రదర్శించొచ్చా? పుట్టిన రోజు తానొక కానుక అడిగి తీసుకోవచ్చు తప్పులేదు... తానే ఒక కానుక ఇవ్వొచ్చా? నీరు ఎగువనుండి పల్లంకి ప్రవహించాలి గానీ, పల్లం నుండి ఎగువకి ఎగజిమ్మొచ్చా? దాన్నేమంటారు?

ఒళ్ళు బలుపు అనుకోరా? దాని బలుపు సంగతి ప్రక్కన పెడితే, ఇక ముందు దీన్నెలా నమ్మడం? ఏ ధైర్యంతో మునుపులాగ అన్ని అప్పగించడం? నిజంగా అది ఏ తప్పు చేయకపోయినా, నా మనసు నన్ను కెలుక్కుంటా ఉంటాదా? పోనీ ఒక వేళ దాని డబ్బుతోనే కొన్నాదనుకుందాం? ఆ గొలుసు నా కూతురి మెడలో వేలాడుతుంటే చూస్తూ ఆనందించగలనా? మన దగ్గర నగలేవీ లేనట్టు, ఆ గొలుసు పిల్ల మెడలో వేసుకొని తిరగాలా? వెయ్యకపోతే, అమ్మా! నిక్కీ తల్లి గొలుసు వేసుకోవడం లేదని రోజూ సొక్కారిస్తాది. ఆ గుణుగుడు ఎక్కడ పడగలం?

ఈ విషయంలో మంచిగా ఆలోచించడానికి కుదరడం లేదు, చెడ్డగా ఊహించడానికి అమరడంలేదు.

ఎందుకొచ్చిన గొడవ చంద్రమ్మను పని మానిపించేయడమే సరైన పని. సమస్యకు అదే పరిష్కారం అనే నిర్ణయానికి వచ్చింది.

అప్పుడు హాయిగా నిద్రపోయింది చైర్మన్ గారి భార్య.

# అరణ్యవాసం

**జా**నకి అదే పనిగా ఏడుస్తోంది. భర్త ఆ మాట చెప్పిన దగ్గరనుండి కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది.

ఆమె కంటి నుండి ఉబుకుతున్న కన్నీటిధారతో ఆమె చుట్టూ పరిచిన పత్రికలు తడిచిపోయాయి. భర్త తన నిర్ణయం చెప్పినప్పుడు నిర్ఘాంతపోయింది. నేల రెండుగా విడిపోయి ఆ బీటలో కూరుకుపోయినట్టనిపించింది. తన నిర్ణయాన్ని మార్చుకోమని ప్రాధేయపడింది. తనను విడిచి బ్రతకలేనంది. నానావిధాలుగా బ్రతిమలాడింది. ఆఖరకు పాత పత్రికలన్నీ సేకరించి, అడవులకెళ్ళినవాళ్ళంతా ఎలా హతమయ్యారో చూపించింది. ప్రాణాలు పోగొట్టుకొని దిక్కులేని వాళ్ళలా చెల్లాచెదురుగా శవాలై పడి ఉన్న ఫొటోలు చూపించింది.

ఇలా అనాథగా చావాలా? అని ప్రశ్నించింది.

ఊర్లోనే ఉంటూ ఏదో ఒక పనిచేసుకొని బ్రతుకుదాం, ఇంత దారుణమైన జీవితాన్ని కోరుకోవద్దని బ్రతిమలాడింది.

కానీ నిర్ణయం తీసుకున్నవాడెవడు?

కోదండరామ్!

కోదండరామ్ కుర్చీలో కూర్చున్నాడు. అతనికెదురుగా నేలపైన చతికిలికలబడి కూర్చుంది జానకి. చుట్టూ ఎన్‌కౌంటర్లలో హతులైన విప్లవకారుల ఫొటోలతో ఉన్న పేపర్లు. భర్త తన నిర్ణయాన్ని మార్చుకుంటాడేమోనని ఆశగా అతని కళ్ళల్లోకి

చూస్తోంది. అతను మాత్రం వాళ్ళ ప్రమేయం ఏమాత్రం లేకుండా గడిచిపోయిన గతాన్ని తల్చుకుంటున్నాడు. తన కుటుంబాన్ని ఇంత దీనాతిదీనంగా చేసిన సంఘటనల్ని నెమరువేసుకుంటున్నాడు.

*****

కోదండరామ్ తండ్రి పేరు సీతారామయ్య. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసేవాడు. చాలా నిజాయితీపరుడు. ఎక్కడా అవినీతి మచ్చలేనివాడు. ప్రభుత్వం ఇచ్చిన పథకాల్ని, ప్రణాళికల్ని చిత్తశుద్ధితో అమలుచేసేవాడు. ఏ మున్సిపాల్టీలో పనిచేసినా మంచి పేరు తెచ్చుకున్నాడు. పై అధికారుల నుండి మెప్పుని ప్రభుత్వం నుండి ప్రశంసల్ని పొందాడు. అతను ఏ మున్సిపాల్టీ నుండి ట్రాన్స్‌ఫర్ అయినా ప్రజలు ధర్నాలు చేసేవారు. దాంతో కొన్నిసార్లు ప్రభుత్వం అతని ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లని రద్దుచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కమిషనర్‌గా ఇరవై ఏళ్ళకు పైబడి పనిచేసినా, ఒక్క ప్లాటు తప్ప ఏ ఆస్తులు లేవు. అదీ కొంత బ్యాంకు లోను తీసి కొనుకున్నదే. పిల్లల కొరకు ప్రైవేటు కాలేజీల్లో లక్షల్లో డబ్బు కట్టలేక వారిని నచ్చిన వాటిలోగాక వచ్చిన కోర్సుల్లో జాయిన్ చేసిన అతి సాధారణ బ్రతుకు, భావజాలం కలిగిన వ్యక్తి.

సీతారామయ్యకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడు కోదండరామ్. తెలుగు భాష మీదున్న ప్రేమతో కొడుకుని ఎమ్.ఎ. తెలుగు చదవమన్నాడు. తండ్రి మీదున్న గౌరవంతో అదే చదివాడు. పురాణాలు, కావ్యాలు, నాటకాలు, ఆధునిక కవిత్వం చక్కగా చదివాడు కోదండరామ్. తన క్లాస్‌మేట్ జానకిని తీసుకొచ్చి ఆమెను ప్రేమిస్తున్నాను, పెళ్ళి చేసుకుంటానని సీతారామయ్యకి చెబితే కాదనకుండా కులాంతర వివాహం చేసేసాడు. వాళ్ళకు పెళ్ళయి మూడేళ్ళయింది. మంచి ఉద్యోగం వచ్చేవరకు పిల్లలు వద్దనుకొని సివిల్స్, గ్రూప్స్ వ్రాస్తున్నారు. సీతారామయ్య కూతురు బి.టెక్ చదువుతోంది.

రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసిన సీనియర్ నాన్‌కేడర్ అధికార్లలో కొంతమందికి ఐ.ఎ.యస్.కేడర్‌కి కన్‌ఫర్మేషన్ ఇస్తారు. అయితే రిటైర్‌మెంట్‌కి ఐదు సంవత్సరాల పైన సర్వీస్ మిగిలి ఉండాలి. ఇతరత్రా ఏవిధమైన చార్జీలు పెండింగ్ ఉండకూడదు. మంచి ట్రాకు రికార్డు ఉండాలి.

ఐ.ఏ.ఎస్. కన్ఫర్మేషన్‌కి అవసరమైన అన్ని అర్హతలు సీతారామయ్యకు వుండటం వలన సీతారామయ్య పేరు షార్ట్ లిస్ట్‌లోకి వచ్చింది. అతనితోపాటు మరికొంతమంది షార్ట్‌లిస్టు అయిన వాళ్ళున్నారు. అయితే ఐ.ఏ.ఎస్. కావడం జీవిత లక్ష్యంగా పెట్టుకొని షార్ట్ లిస్టులోకి రాలేకపోయిన మరో అధికారి కృష్ణారెడ్డి. అతను కూడా మంచి అధికారి. మంచి ట్రాక్ రికార్డు ఉంది. పనిచేసిన చోటల్లా కృష్ణారెడ్డి కూడా చాలా మంచిపేరు తెచ్చుకున్నాడు. అతని నీతి, నిజాయితీల విషయంలో రెండు రకాల మాటలు చెబ్తారు.

అబ్బా! కృష్ణారెడ్డి పైసా ముట్టడు. నిక్కచ్చి మనిషంటారు కొందరు. పైసా ముట్టని మాట నిజమే! కానీ నిక్కచ్చి కాదంటారు కొందరు. అదేంటంటే, చిన్నచిన్న పనులకు పైసలడగడు. పెద్దపెద్ద పనుల్లో వాటాలు అడుగుతాడు. అవన్నీ బంధువుల పేర్న ఉంటాయంటారు.

నీతి నిజాయితీ విషయంలో సీతారామయ్యకు, కృష్ణారెడ్డికి మధ్య చాలా వ్యత్యాసముంది. సీతారామయ్యకది జీవన విధానం. కృష్ణారెడ్డికది తరుణోపాయం. దీనిపైన ఇంట్లో భార్య ఒకటి రెండుసార్లు గొడవ కూడా పడింది.

"ఆఫీసు వాళ్ళు చెబుతున్నారు. ప్రతీ పని ఫ్రీగా చేసేస్తున్నావట. మన స్టేటస్ మెయిన్‌టెనెన్స్‌కి నీ జీతం సరిపోతుందనుకుంటున్నావా? మా పుట్టింటివాళ్ళ ఆస్తి నుండి ఆదాయం లేకపోతే పరిస్థితేంటి- ఈరోజు జవాబు చెప్పకపోతే ఒప్పుకోను" అని తలుపులు మూసి నిలదీసేసరికి, భార్యకు కనువిప్పు కలిగేలా తన దూరదృష్టిని ప్రదర్శించాడు కృష్ణారెడ్డి.

"చూడు భవానీ! నేనంత తెలివితక్కువ వాడ్ని కాను. పరిపాలనకి నాలుగు చాంబర్స్ ఉంటాయి. నంబర్‌వన్ సర్వీసెస్, రెండవది వెల్‌ఫేర్, మూడు రెగ్యులేషన్ లాస్ట్ అండ్ ఫైనల్ డవలప్‌మెంట్. ఈ మూడింటిలో కక్కుర్తి పడితే గోలగోల. వచ్చేది తక్కువ బద్నామ్ ఎక్కువ. నాలుగోది సాలిడ్. ప్లాన్లు, లే అవుట్లు, కన్‌స్ట్రక్షన్స్, టెండర్లు- వీటిలో నేనేది వదలను గదా! ఇంకోమాట విను! ఐ.ఏ.ఎస్. వచ్చే వరకు కాస్త జాగ్రత్తగా ఉండనీ! ఆ తర్వాత మనిష్టమే! ఆ మూడక్షరాలు మన పేరుకి చివర తగిలిస్తే ఆ మజా వేరు! ఆ మహిమ వేరు! ఆ ముక్కంటి కూడా

మనల్ని ఏమీ చెయ్యలేదు. అంచేత అందాక వచ్చిందాంతో తృప్తిపడు" అన్నాడు కృష్ణారెడ్డి.

దాంతో భవిష్యత్తంతా దేదీప్యమానంగా కనిపించి భవానీదేవిగారి ముఖం వేల కాంతులతో వెలిగిపోయింది. అప్పటి నుండి పేపర్లో ఐ.ఏ.ఎస్. అనే మాట కనబడితే చాలు, చాలా శ్రద్ధగా చదువుతుండేది.

ఒక రోజు పేపర్లో నాన్ రెవిన్యూ నుండి ఐ.ఏ.ఎస్.కి షార్ట్ లిస్టు ప్రాబబుల్స్ పేర్లు పడ్డాయి. ఆ వార్త భవానీదేవి కంట్లో పడింది. ఆ లిస్టులో కృష్ణారెడ్డి పేరు లేదు. ఆ సంగతి రెండు రోజుల ముందే కృష్ణారెడ్డికి తెలుసు. సమస్యను ఎలా నరుక్కు రావాలా అని రకరకాలుగా ఆలోచించాడు. తన పేరు లిస్టులోకెక్కిన తరువాత భార్య చెవిలో వేద్దామనుకున్నాడు. కానీ ఈలోగా వార్తాపత్రికలకు ఎక్కడంతో మరోసారి భార్య ముందు తలొంచుకొని నిలబడ్డాడు. ఆవిడ అగ్గిమీద గుగ్గిలమైపోయింది. ఆగ్రహావేశాలతో కదం తొక్కింది. చివరకు తన తలకు మించిన పనికావడం వల్ల భర్త నిస్సహాయునిగా మిగిలిపోయాడని అర్థం చేసుకుంది. ఇప్పుడు తనే తల దూర్చాలనుకుంది. అనుకున్నదే తడవుగా తన చేయి పట్టుకొని కార్లో కూర్చోబెట్టింది. తానే డ్రైవ్ చేసుకుంటే తన చిన్నాయన రాజగోపాలరెడ్డి ఇంటికి తీసుకెళ్ళింది.

రాజగోపాలరెడ్డి రాష్ట్ర మంత్రివర్గంలో ఒక ప్రధానమైన శాఖకు అమాత్యులు. ముఖ్యమంత్రికి చాలా సన్నిహితుడు.

రాష్ట్ర మంత్రి ఎదురుగా దంపతులిద్దరూ కూర్చున్నారు. మంత్రి కృష్ణారెడ్డి చెప్పిందంతా మంత్రి సావకాశంగా విన్నాడు. అంతా విని ఒక మాటన్నాడు.

"ఈ సంవత్సరం మిస్సయిందనుకో. నెక్స్ట్ ఇయర్ ముందు నుండి జాగ్రత్త పడితే నీ పేరు షార్ట్ లిస్ట్‌లో పెట్టించుకోలేమా?"

"నెక్స్ట్ ఇయర్ వేకన్సీలు రావు"

"ఇప్పుడున్న వాటిలో ఒకటి వేకెంట్ పెట్టించి, నెక్స్ట్ ఇయర్ నోటిఫై చేయించి నీకు వచ్చేటట్టు చేస్తానులే?"

"ఈ ఇయర్ మిస్సయితే ఏజ్‌బారి అయిపోతాది మావయ్యా!"

ఈ సంవత్సరం ఎలాగైనా కావాలనే గొప్ప ఆత్రుత, ఆవేదన కృష్ణారెడ్డి గొంతులో ధ్వనించింది.

ఆ మాట వినగానే భగ్గున పెట్రోలు పోసిన మంటలాగా ఎగిసిపడ్డాడు మంత్రి.

"ఏజ్ బారైపోతే... నేనేమి చెయ్యాలి. అన్నీ తెలిసి ఇప్పుడా రావడం. ఏం ముందుగా చెప్పాలని తెలీదా? బుద్ధి ఉండొద్దా? బాధ్యత ఉండొద్దా?... అంతా అయిపోయాక వస్తే నేనేం చెయ్యగల్ను. నేనేమీ చెయ్యలేనుపోండి!" అంటూ మెట్లెక్కి పై అంతస్తులోకి వెళ్ళబోయాడు. సర్రున మెట్లపైకెళ్ళి అడ్డంగా నిలబడింది భవాని.

"చిన్నాయన! నామాటిను. మా నాన్నకు, నీకు ఆస్థి పంపకాల్లో వచ్చిన గొడవ వల్ల కొన్ని సంవత్సరాలు మీకు, మాకు మాటల్లేవు. అయినా అన్నీ వదిలేసి నీ దగ్గరకు వచ్చాను. నాకు మా నాయినకన్నా నీ దగ్గరే చనువెక్కువ. నువ్వు కూడా నన్నలాగే చూసావు. ఈ ఒక్క సహాయం చెయ్యి. జ్యేష్ట భాగం క్రింద గొడవ పడుతున్న పాతిక ఎకరాలో తోట నీకే వదిలెయ్యమని నాన్నతో చెబ్తాను. ఆ బాధ్యత నాది. నా భర్తకు ఐ.ఏ.ఎస్. ఇప్పించు" అంటూ కాళ్ళమీద పడిపోయి వలవల ఏడ్చింది భవాని.

ఆ మాటలకు మెత్తబడ్డారు మంత్రి. బుసకొట్టిన పాము పడగ ప్రక్కకు త్రిప్పుకున్నట్టు, ప్రక్కకు మళ్ళి వెనక్కి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"చెప్పు షార్ట్ లిస్టులో ఎవరెవరున్నారు?" అని చాలా కూల్‌గా అడిగాడు. ఎంతో మహోగ్ర రూపం ఇంతలో అంత శాంత స్వరూపంగా మారిందో అంతుబట్టలేదు కృష్ణారెడ్డికి. అయినా ఆ విషయం ఆలోచించక షార్ట్ లిస్టులోని పేర్లన్ని టకటక చెప్పాడు కృష్ణారెడ్డి.

"వాళ్ళ బ్యాక్ గ్రౌండ్స్?"

చెప్పాడు కృష్ణారెడ్డి.

‘ట్రాక్ రికార్డ్?”

చెప్పాడు కృష్ణారెడ్డి.

“కాస్ట్‌లు”

చెప్పాడు కృష్ణారెడ్డి.

“ఇందులో ఒకడ్ని తప్పించినా నెక్స్‌ట్ పేరు నాదొస్తాది. ఎందుకంటే లిస్టు ఇంకా సెంటర్‌కి పంపలేదు” అన్నాడు కృష్ణారెడ్డి.

“సరే! సీతారామయ్య యస్.సి. అన్నావు కదా! ఉద్యోగం రిజర్వేషన్ మీదొచ్చింటాది. వాడు క్రిష్టియన్ అని ప్రూవ్ చేసే అవకాశం వుందా? అంటే చర్చిలకెళ్ళడం, పిల్లల పెళ్ళిళ్లు క్రిష్టియన్ పద్ధతిలో చెయ్యడం– ఉద్యోగానికి ఎసరు పెట్టామనుకో– ఇది పెండింగ్ పడతాది– ఏమంటావ్?”

“అది కష్టం మామయ్యా!”

“ఏం?”

“ఇంట్లో హిందూ వాతావరణమే ఉంటాది. పేర్లతో సహా. కొడుకు బ్రాహ్మణుల అమ్మాయిని ప్రేమిస్తే, చక్కగా పెళ్ళి హిందూ పద్ధతిలో చేసాడు.”

“సరే! నేను టాప్ అఫీషియల్స్‌తో మాట్లాడి ఇష్యూ సెటిల్ చేస్తాను. మీరెళ్ళిపోండి” అన్నాడు మంత్రి.

“చిన్నాయనా! నీ మీద ఆశ పెట్టుకొని ఇంటికెళ్తాను” అంది భవాని.

“రేపు పేపర్స్ పట్టుకొని మా పి.ఎ. మీ ఇంటికొస్తాడు. జ్యేష్టభాగం...”

“చిన్నాయినా! అది మీదే... నాయిన సంతకాలతో పేపర్లు మీ దగ్గరకొస్తాయి”

*****

ఆ తర్వాత రెండు రోజులకు సీతారామయ్యను ఎ.సి.బి వాళ్ళు లంచం తీసుకుంటుండగా రెడ్‌హేండెడ్‌గా పట్టుకున్నారు. ఎవరో షడన్‌గా వచ్చిన నా

జేబులో నోట్ల కట్ట బలవంతంగా కుక్కాడని ఎంత మొత్తుకున్నా వినలేదు. జైలుకి తీసుకెళ్ళారు. బైలు వచ్చేసరికి ఇరవైరోజులు పట్టింది.

ఈ ఇరవై రోజులు వరుసగా సీతారామయ్య అవినీతి మీద కథనాలొచ్చాయి. అతని ఫ్లాటున్న బిల్డింగ్‌ని చూపించి, ఈ భవంతి అతని అక్రమార్జితమని పదేపదే టి.వి.లో చూపించారు. అతని అవినీతి బాధితులుగా పేర్కొంటూ పత్రికల్లోను, చానెల్స్‌లోను శీర్షికలు పడిపోరు. అతను నిజాయితీపరుడని చెప్పడానికి, సీతారామయ్య పదవిలో ఉండగా పొగిడిన ఏ ఒక్కడూ ముందుకురాలేదు. ఏ ఉన్నతాధికారి నోరిప్పలేదు. ఏ ప్రశంసాపత్రం ఇది అన్యాయమని అరవలేక పోయింది. ఒక రెండురోజులు గొంతులు చించుకున్న కులసంఘాల టెంట్లు మూడోనాటికి మాయమైపోయాయి. అధికారపక్షంలోని కుల నాయకులు ప్రభుత్వానికి ఎదురెళ్లలేకపోయాయి. ప్రతిపక్షంలోని వారు విచిత్రంగా ఏవో కారణాలవల్ల సిటీలో అందుబాటులో లేరు. పైగా కొందరు కుల పెద్దలు వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభించారు. ఎప్పుడు కులం వాళ్ళతో కలిసేవాడు కాదని, పైగా పెద్ద కులాల్తోనే తిరిగేవాడని ఆరోపించారు. వేషం, భాష అన్నింట్లో ఓ సిల్నీ అనుకరించేవాడని, అనుకరించడమేమిటి, వాళ్ళ అమ్మాయినే కోడలిగా తెచ్చుకున్నాడని రకరకాల థియరీలు లేవదీసారు. అతని ప్రవర్తన వల్లే ఉపకులం కూడా ఎవరికీ తెలీదని స్థిరపర్చారు. అందుకే ఎవరూ సీతారామయ్యను భుజాన మోసి ఉద్యమాన్ని నడపలేదు.

జైలు నుండి బైలు మీదొచ్చిన సీతారామయ్య, దారితప్పిన దళిత ఉద్యమ చైతన్యానికి ఒక సజీవ సాక్ష్యంగా నిల్చాడు. తనకు వ్యతిరేకంగా జరిగిన కుట్ర, ప్రచారం చూసి తట్టుకోలేకపోయాడు. ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఎక్కడకెళ్ళాడో తెలీదు. మూడురోజులు గమ్యం లేకుండా తిరిగాడు. పిచ్చిపట్టినట్టు తిరిగి తిరిగి ఒక ఊర్లో రైలు పట్టాల మీద శవమై తేలాడు.

సీతారామయ్య కుటుంబం రోడ్డున పడింది. కానీ రోడ్డు మీద తిరగలేని పరిస్థితి. కోదండరామ్‌కి ప్రపంచమే స్థంభించిపోయినట్టయింది. తనపైన ఆరోపించబడిన అవినీతి రుజువు కాకముందే తండ్రి బలవన్మరణం చెందడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది కోదండరామ్‌కి. తల్లి కుప్పకూలిపోయి అపస్మారకమై

పోయింది. హాస్పటల్లో జాయిన్ చేసారు. ఆడుతూ పాడుతూ చదువుకుంటున్న చెల్లెలు వారం రోజులుగా జరిగిన పరిణామాలకు బిక్కచచ్చిపోయింది. షాక్‌లో నుండి తేరుకోలేదు.

ఇటువంటి సమయంలో కాస్త ఓదార్చి, ధైర్యవచనాలు చెబుతున్నది భార్య జానకి మాత్రమే.

టెర్రస్‌పైన ఇద్దరూ అర్ధరాత్రి వరకు మాట్లాడుకునేవారు. ఆ మాటల్లో భగవద్గీత, భారతం, భాగవతం, రామాయణం– ఒకటేమిటి తెలుగు సాహిత్యాన్ని తరచి, తరచి తర్కించుకొనేవారు. ఒక్కోసారి టెర్రస్‌పైనే పడుకుండిపోయేవారు.

ఈ విషాదం తర్వాత జానకి భర్తకు శాయశక్తులా ఓదార్చి మామూలు మనిషిని చెయ్యాలని ప్రయత్నించింది. కానీ కోదండరామ్‌లో తన తండ్రికి, కుటుంబానికి జరిగిన అన్యాయం వలన ఏర్పడిన దు:ఖం, ఉక్రోషం, తద్వారా పుట్టుకొచ్చిన ప్రతీకార భావన– అన్నీ కలగలిసి నిద్రలేకుండా చేస్తున్నాయి.

ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు కోదండరామ్. తన తండ్రి బదులు కృష్ణారెడ్డి పేరు షార్టు లిస్టులో వచ్చింది. అది చూసిన తర్వాత అంతవరకు తండ్రికి జరిగిన ద్రోహం వెనుకున్న అస్పష్టత కొంచెం కొంచెం విడిపోయింది. సెక్రటేరియట్‌లో పనిచేసే కొంతమంది జర్నలిస్టుల్ని కలిసి చర్చించాడు. ఒక ఔత్సాహిక జర్నలిస్టు ప్రతాప్ దీని మీద పేర్లు మార్చి చక్కని కథనం రాసాడు. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. రియాక్షన్ కూడా అంతే స్థాయిలో వచ్చి అతని ఉద్యోగం ఊడిపోయింది.

ఒకరోజు ప్రతాప్ కోదండరామ్‌తో “అన్నా! విల్లంబులు ధరించిన రాముడు అడవులకు వెళ్ళడం వల్లే కదా రాక్షస సంహారం జరిగింది. ఏనాడైనా ఊర్లో జరిగే అన్యాయాలకు పరిష్కారం అడవిలో వెతుక్కోవాల్సిందే” అన్నాడు.

“అంటే” అన్నాడు అమాయకంగా కోదండరామ్.

అతనికి ఆ మాటలు అర్థంకాలేదని అర్థం కావాలంటే, చదవాల్సిన పుస్తకాలు తెచ్చి గుమ్మరించాడు.

ఒకరోజు జానకి పుస్తకాల బీరువా సర్దుతుంటే సంప్రదాయ సాహిత్య గ్రంథాల వెనుక దాక్కున్న విప్లవ సాహిత్యం బయటపడింది. వాటిని చూడగానే అవాక్కయిపోయింది.

ఆ రాత్రి భర్తను నిలదీసింది. ఇవన్నీ ఏమిటని అడిగింది.

"ఇవి చదువుతూ, భాగవతం, భగవద్గీత చదువుతున్నానని అబద్ధం చెప్పావు?" అని అరిచి మరీ అడిగింది.

"అవును నిజాల్ని చదువుతూ నీకు అబద్ధాల్నే చెప్పాను" అతను అరిచే చెప్పాడు.

"అంతేకాదు, ఏదో ఒకరోజు నీకు చెప్పా పెట్టకుండా కనిపించకుండా వెళ్ళిపోతాను" ఈ మాట మాత్రం నిదానంగా సున్నితంగా చెప్పాడు.

అప్పటి నుండి అతని మనసు మార్చే ప్రయత్నం చేస్తూనే ఉంది జానకి. కానీ కోదండరామ్ మనసు మాత్రం మారలేదు. ఇక లాభం లేదనుకొని పాత పేపర్లు సంపాదించి వాటిని అతనిముందు పరచి,విప్లవకారుల జీవితాలు ఎలా అంతమౌతున్నాయో చూపించింది.

*****

గతాన్నంతా తల్చుకున్న కోదండరామ్ హృదయం మరింత కఠినంగా మారింది.

"నా నిర్ణయం మారదు జానకి" అన్నాడు.

"సరే అయితే మీ ఇష్టమే కానివ్వండి" అంటూ పేపర్లన్నీ తీసి ప్రక్కన సర్దేసింది.

ఆ రాత్రి భోజనాలయ్యాక ఇద్దరూ బెడ్రూంలోకి వచ్చారు. తల్లి మరో గదిలో పడుకొని వుంది. చెల్లెలు హాలులో చదువుకుంటోంది.

"సరే మీరెలాగు నామాట వినరు. నేను మీ మాట వినాలనుకున్నాను."

"నిజమా?" అన్నట్టు ఆమె కళ్ళల్లోకి చూసారు.

"ఒక్క షరతు మీద"

"ఏంటది?"

"నేను మీతోపాటు వస్తాను"

"నువ్వా?"

"అవును. లేడీస్ కూడా ఉద్యమంలో ఉంటారు కదా!"

"ఉంటారు నిజమే! కానీ పోలీసులకు ఆడ మగ తేడా ఉండదు. నిర్దాక్షిణ్యంగా ఉంటారు. చూసావుగా ఫొటోల్లో...."

"అవును. మీతో కలిసి బ్రతకడానికి అవకాశమివ్వనంటున్నారు. కనీసం చావడానికైనా ఇవ్వరా?"

"జానకీ! నేను వెళ్తున్నది తీర్థయాత్రలకు కాదు కూడా తీసుకెళ్ళడానికి"

"రాముడి వెనక సీత వెళ్ళింది అడవికే. తీర్థయాత్రలకు కాదు. అందుకే కోదండరామ్ వెనక జానకి ఉంటుంది"

ఆ మాట వినగానే గతుక్కుమన్నాడు కోదండరామ్. వెంటనే కల్పవృక్షంలోని ప్రస్థానం ఖండంలోని సీతారాముల సంభాషణ గుర్తొచ్చింది. ఇద్దరూ కలిసి అరణ్యకాండను ఎన్నిసార్లు చదివారో! అతని మౌనం జానకికి అర్థమైంది.

బీరువాలోని కల్పవృక్షం తీసి అరణ్యకాండ, ప్రస్థాన ఖండాన్ని తెరిచి కోదండరామ్ ముందు పెట్టింది.

చదువుతూ, చదువుతూ

**"నను గొని పోకుండినవీ**

**వనీ స్థలమునుండి తిరిగి వచ్చిన వేళన్**

**జనకసుతార్థము వెదుకుచు**

**జనెదవు కౌ బేరమగు దిశావీథులలో"**

ఈ పద్యం చదివాక తలెత్తి జానకి ముఖంలోకి చూసాడు. అతని చూపుల్ని అర్థంచేసుకున్న జానకి "మీరు నన్ను తీసుకెళ్ళకపోతే అదే జరుగుతుందని" మౌనంతోనే భాషించింది.

ఆ మొండిపట్టుదలకు కోదండరామ్‌కి చెప్పలేనంత కోపం వచ్చింది.

చేతిలోని పుస్తకాన్ని విసిరికొట్టాడు.

ఇంకా ఆలస్యం చేస్తే ఇలాంటి పుస్తకాలన్నీ చదివించి తన మనస్సుని మార్చేస్తుందని భయపడ్డాడు.

అప్పటికప్పుడు రెండు జతల బట్టలు, తనకు కావాల్సిన విప్లవ సాహిత్యం ఒక సంచీలో సద్దుకొని "వెళ్ళొస్తాను" అన్నాడు కోదండరామ్.

"పదండి వెళ్దాం" అంది జానకి. అతను చూడకుండా తన సంచిలో కల్పవృక్షాన్ని సర్దుకుంటూ...

ఆ ఇద్దరూ ప్రయాణం ప్రారంభించారు వెలుగు కోసం చీకట్లోకి. ఎవరి సాహిత్య స్పృహలో వారు. ఇంట్లో ఇద్దరు ఆడవాళ్ళను వదిలేశామన్న స్పృహ లేకుండా!

# అలుకు గుడ్డ

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు రామాయణ కల్పవృక్షంలో సీతా రాముల కళ్యాణ ఘట్టాన్ని వర్ణిస్తూ జనకుడు కన్యాధనంగా తమలపాకు, లవంగ తోటలు, వక్కలు, దాల్చిన చెక్క పండే వ్యవసాయ క్షేత్రాలు ఇచ్చాడని వర్ణిస్తారు. వియ్యంకుల మధ్య ఏవిధమైన గొడవరాలేదు గాని "అలుకుగుడ్డకునై కలహంబు జరిగె, జనక దశరథ గృహ పరిచారికలకు" అని అంటారు.

మొదటిసారి విన్నప్పుడు "ఏహే ఈ కవులు ఇలాగే రాస్తారు. కందకు లేని దురద కత్తిపీటకుంటాదేటి, కట్నకానుకలు, లాంఛనాలు, పెట్టిపోతలు- ఇచ్చినోడు, పుచ్చుకున్నోడు బాగుండమేమిటి? పనోళ్ళు కొట్టుకోడమేమిటి? అందులోను ఇల్లు అలికే గుడ్డముక్క కోసం కొట్టుకోవడమేమిట"ని నేనే కొట్టిపారేసాను.

కానీ ఈ మధ్యన మా మున్సిపాల్టీలో జరిగిన "వివాహ వైభోగం"లో జరిగిన ముచ్చట గురించి విన్న తర్వాత, అమ్మో! రవి చూడలేంది గూడా కవి చూస్తాడన్న మాట నిజమేననిపించింది. ఇంతకీ ఏటి జరిగిందంటే-

మా మున్సిపాల్టీ చైర్మన్ కూతురి పెళ్ళి జరిగింది.

మా చైర్మన్ పేరు వామనరావు, మనిషి మాత్రం గండబేరుండంలాగుంటాడు. ఆరడగుల జబర. భారీ విగ్రహం. చామనచాయ రంగు, ఉంగరాల జుత్తు, బొద్దు మీసాలు, మీసాల కన్న దట్టమైన కనుబొమ్మలు. నవ్వితే ఏడిసినట్టుంటాది. ఏడిస్తే ఎలగుంటాదో ఆలోచించుకోండి. మెల్లిగా జెబితే అరిసినట్టుంటాది. అరిస్తే ఎలాగుంటాదో ఊహించుకోండి! అలాంటి చైర్మన్‌కి అందమైన కూతురు- తల్లి

పోలికలతో పుట్టినట్టుంది. ఆ పిల్ల అమెరికాలో చదివొస్తే మంచి దగ్గర సంబంధం చూసి పెళ్ళి చేసారు.

పెళ్ళి ఏర్పాట్లు అలాగిలాగ లేవు. ఆకాశమంత పందిరి, భూదేవంత పీట. భోజనాలైతే వర్ణించలేం. రెండువైపుల పెళ్ళి వారు కొంటున్న బట్టలు, వేసుకుంటున్న నగల గురించి వర్ణించడం నావల్ల కాదు. బట్టల గురించైతే బొమ్మనోళ్ళు రావాలి. నగల గురించైతే ఏ లలితా జ్యూయలరీ వాళ్ళనో పిలిపించాలి. ఇవన్నీ బహిరంగంగా జరుగుతున్నవి. అందరూ చూస్తున్నవి. కానీ లోపుల్లోపుల జరిగినవి కొన్ని బయటకొచ్చాయి. అందులో కొన్ని నాకు తెలిసిసాయి. నాకు తెలియజెప్పినోడెవడంటే వాళ్ళ కారు డ్రైవరు థామస్. డ్రైవరంటే డ్రైవర్ కాడు... వాళ్ళింట్లో మనిషిలాగుంటాడు. అంత ప్రేమతో చూస్తారతగాడ్ని. చైర్మనొక్కడే కాదు. ఇంటిళ్ళపాది అలాగే చూస్తారు. బాగా ఇష్టమైన వాళ్ళకు, నమ్మకమైన వాళ్ళకు వాడే మాటలున్నాయి చూడండి...! ఇంట్లో మనిషి, తల్లో నాలిక లాంటి పదాలు సరిపోవు, చైర్మనింట్లో థామస్ స్టేటస్ వర్ణించడానికి.

చైర్మన్ కూతురి పేరు యామిని. ఇంట్లో వాళ్ళు 'యామి' అంటారు. పనోళ్ళంతా యామినమ్మ అంటారు. ఫ్రెండ్స్ 'యమ్' అని పిలుస్తారు. యామిని థామస్‌ని అన్నా అని పిలుస్తాది. థామస్ కూడా తన స్వంత చెల్లెలు కన్న ఎక్కువగా చూస్తాడు. అమెరికా వెళ్ళక ముందు కాలేజీకి తీసుకెళ్ళి తీసుకు రావడం ఎంతో బాధ్యతగా చేసేవాడు. కాలేజీలో పోకిరి గాళ్ళెవరు యామిని జోలికి రాకుండా చూసుకునే వాడు. యామినిని చిన్నప్పట్నుండి ప్రాణానికి ప్రాణంగా చూసుకొనే మరొక ప్రాణి ఉంది. ఆమె పని మనిషి నర్సమ్మ. ఇంట్లో ఉన్న పదిమంది పనిమనుషుల్లో యామినికి నర్సమ్మ దగ్గరే చేరిక. నర్సమ్మకు పిల్లల్లేరు. అందుకే యామినంటే బాగా ఇష్టం. అదెంత వరకెళ్ళిందంటే– తనతో కాకుండా మరో పనిమనిషితో యామిని మాట్లాడితే సహించలేదు. యామినిని ఏమనలేదు కాబట్టి, అవతల మనిషితో అనవసరంగా ఏదో వంకతో గొడవకు దిగేది.

పెళ్ళికి వారం రోజులు ముందు థామస్ బంధువుల్లో కొందర్ని పిలిచి మంచి భోజనం పెట్టాడు చైర్మన్. వారిలో థామస్ తండ్రి, చిన్నాన్న, వాళ్ళ పెద్దక్క భర్త, థామస్ ఫ్రెండొకడు ఇలా చాలా లిమిటెడ్ నంబర్‌లో జరిగిందా విందు

భోజనం. ఇలా వీళ్ళకీ ప్రత్యేకమైన విందు ఎందుకో థామస్‌కి కూడా అర్థం కాలేదు. తినేసి, చేతులు కడుక్కోడానికి లేచే ముందు అర్థమయ్యేటట్టు చెప్పాడు చైర్మన్. "చూడండి! కొన్ని ఋణానుబంధాలు జన్మజన్మల నుండి వస్తుంటాయి. ఈ జన్మలో మనం వేర్వేరుగా కావచ్చు కానీ ఎప్పుడో, ఏ జన్మలోనో రక్త సంబంధీకులమే! లేకపోతే మన మధ్య ప్రేమలు ఇంతగా పెరగవు! మళ్ళీ మరో జన్మలో దగ్గరవుతాం. కాకపోతే ఏవిటీ ప్రేమ చెప్పండి! ఎందుకింత నమ్మకం మీ మీద చెప్పండి! ఎంత నమ్మకం లేకపోతే ఇన్నేసి ఆస్థులు మీ పేర్న పెడతాను". అని చిన్న గేప్ ఇచ్చి "అమ్మా! యామిని!" అని పిల్చాడు. "ఏంటి నాన్నగారూ" అంటూ వెంటనే వచ్చింది యామిని. "తను మా అమ్మాయి! ఆమె జీవితం సంతోషంగా ఉండాలని నేనెలా కోరుకుంటానో, మీరలాగే కోరుకుంటారని నాకు తెలుసు. అంచేత రిజిస్ట్రార్ ఆఫీసులో అంతా రడీగా ఉంది. అమ్మా! అంకుల్‌ని, మావయ్యను, తాతయ్యను తీసుకెళ్ళి నీ పేరున ట్రాన్స్‌ఫర్ చేయించుకో! వెళ్ళండి! వెళ్ళండి!. థామస్ చెల్లితో వెళ్ళు" అని అందర్నీ కార్లో కుక్కి మరీ దగ్గరుండి రిజిస్ట్రార్ ఆఫీసుకి సాగనంపాడు చైర్మన్. అప్పటికి గాని థామస్‌కి అర్థం కాలేదు. ఈ ప్రత్యేకమైన విందు ఎందుకో. ఆ విధంగా అంతకు ముందు బినామీగా కొన్న ఆస్థులన్నీ ఇప్పుడు అత్తవారు కొనిచ్చినట్టు యామిని పేర్న ట్రాన్స్‌ఫర్ అయ్యాయి.

మగపెళ్ళివారిలో ముఖ్యులు వారం రోజులు ముందుగానే విచ్చేసారు. వారికి విడిది స్టార్ హోటల్లో ఏర్పాటు చేసారు. వాళ్ళతో పాటు కొంతమంది పని మనుషులు కూడా వచ్చారు. ఇవతల పెళ్ళికూతురు తరపు పనివాళ్ళలో నర్సమ్మ దెంతో ప్రధాన పాత్రో మగ పెళ్ళి వారి పక్షాన భూలక్ష్మి పాత్ర అంత ప్రధానం.

భూలక్ష్మి నర్సమ్మ కన్న పదేళ్ళు చిన్న ఉంటాది. బాగా వదరుబోతు. ఆవేశ మొచ్చిందంటే చిన్నా పెద్దా, వెనకా ముందూ చూడదు. ఎంత మాటైనా విసిరేయ గల్దు. తన మాటల వల్ల అవతల వాళ్ళు నొచ్చుకొన్నారని పసిగట్టిందో, పసరు పూసినట్టు, నొప్పి లేకుండ చిటికెలో మాయం చెయ్యగల్దు.

భూలక్ష్మికి మరో నలుగురి పనివాళ్ళకు చైర్మన్ ఇంటికి దగ్గర్లో ఉన్న మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో బస ఏర్పాటు చేసారు. తెల్లవారి లేచి స్నానాల్జేసుకొని చైర్మన్ గారింటికి

వెళ్తే, మళ్ళీ రాత్రి భోజనాలయ్యి పడుకోడానికి గెస్ట్‌హౌస్‌కి వచ్చేవారు భూలక్ష్మి బృందం.

వచ్చిన రెండు రోజులకే భూలక్ష్మి తన కలుపుగోరుతనం వల్ల, మాటకారి తనం వల్ల చైర్మన్ భార్యకు, ఇంట్లో ఇతర ఆడవాళ్ళకు, ముఖ్యంగా పెళ్ళి కూతురు యామినికి చాలా దగ్గరై పోయింది. ఇంతకు ముందు ప్రతీ పనికీ నర్సమ్మా! నర్సమ్మా! అనే యామిని ఇప్పుడు ప్రతీ దానికి భూలక్ష్మి, భూలక్ష్మి అని పిలవడం నర్సమ్మ అసూయకు కారణమైంది. ఒకసారి 'నర్సమ్మా! స్నానం చేస్తాను వచ్చి తలరుద్దవా?" అని పిల్చి తీరా వెళ్ళే సరికి "వద్దులే, భూలక్ష్మి వస్తుంది" అన్జెప్పి పంపించేయడం తల దీసేసినట్టయింది. పైగా తనెంతో ప్రేమించిన పిల్ల అలా చెయ్యడంతో చాలా బాధగలిగింది నర్సమ్మకు. ఇది ఇలా ఉండగా ఒక రోజు భూలక్ష్మి కట్టుకున్న చీర చూసి నర్సమ్మ అడిగింది.

"ఈ చీర నీకెక్కడిదే!"

"యామినీ ఇచ్చింది" అంది భూలక్ష్మి. అలా యామినీని పేరు పెట్టి పిలవడం కూడా నర్సమ్మకిష్టం లేదు. ఒక్క ఉదుటున యామిని దగ్గర కెళ్ళి "అదేటమ్మా! నాకిస్తానన్న చీర దానికిచ్చావు" అని అడిగింది. చీరెలాగు పోయింది, కనీసం జవాబైనా అనునయంగా చెబుతుందని ఆశించింది నర్సమ్మ!

కానీ "ఏం? ఇస్తే తప్పా?" ఎదురు ప్రశ్న వేసింది యామిని. దాంతో హతాశురాలైంది. ఇలా రోజు రోజుకి భూలక్ష్మి దగ్గరైపోతోంది. తాను దూరమై పోతోంది. కానేంజెయ్యగల్దు. పెద్దవాళ్ళతో వ్యవహారం! ఇదో పక్కనుండగా, అలా తనను నిర్లక్ష్యం చేసినప్పుడల్లా భూలక్ష్మి తనవైపు విసిరేచూపు మరీ బాధ పెడుతోంది. పుండుమీద పుల్లెట్టి కెలికినట్టుంటోంది. ఓర్చుకోవాలి.... ఇప్పుడేం చేయలేం... కానెప్పుడో ఒకప్పుడు కోపం తీర్చుకోడానికి సమయం రాకపోదని సరిపెట్టుకుంది. ఎవరి మీద కోపం తీర్చుకుంటుంది! యజమానుల మీదా? జీవితంలో జరిగే పనికాదు. లోకంలోనూ జరిగేపని కాదు.. కానీ భూలక్ష్మి మీద తీర్చుకోవచ్చు. ఆ సమయం కోసం ఎదురుచూస్తోంది.

యామిని పేరు మీద థామస్ బంధువుల పేరునున్న ఆస్థులన్నీ రిజిష్టర్

అయిన రోజు రాత్రి! ఆ రోజు చైర్మన్ వామనరావు చాలా ఆనందంగా ఉన్నా డు. సీత పెళ్ళి చేసి కన్యాధనం యావత్తు ముట్టజెప్పిన జనకుడున్నంత ఆనందంగా ఉన్నాడు. దాంతో స్టార్ హెూటల్లో ఉన్న ముందస్తు బంధు బృందాన్నంతా మందు కొట్టడానికి రమ్మని ఇంటికి ఆహ్వానించాడు.

మందు పార్టీలు నిర్వహించడంలో చైర్మన్ గారికి ఒక ప్రత్యేకశైలి ఉంది. చోటా మోటా నాయకులకు, కార్యకర్తలకు ఏర్పాటు చేస్తే బంగళాకు తూర్పు ప్రక్కనున్న విశాలమైన లాన్స్‌లో పెడతాడు. ఇక ఆ వేళ తాగుడుకి తిరనాళ్ళే. అదే వ్యాపారవేత్తలకు, ముఖ్యమైన రాజకీయ నాయలకు అయితే గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న విశాలమైన హాలులో జరుపుతాడు. బయటి నుండి వచ్చే వాళ్ళు లోనున్న వాళ్ళకు కనిపిస్తారు గానీ, లోనున్న వాళ్ళు బయటి వాళ్ళకు కనిపించరు. ఈ ఏర్పాటు పేపరు, ఛానల్ వాళ్ళ దృష్టిలో పడకుండా తీసుకున్న జాగ్రత్త. ఇక బంధువులు, కుటుంబీకులు, దగ్గర ప్రాణ స్నేహితులైతే టెర్రస్ మీద పెంట్ హౌస్‌కి ముందున్న పగోడాల్లో నిర్వహిస్తాడు. భోజనాల తయారీ కూడా ప్రదేశం బట్టీ మారిపోతుంది. లాన్స్‌లో అయితే హెూటల్స్ నుండి తెప్పిస్తాడు. అదే హాలులో అయితే ఇంటి భోజనమే గానీ వంటవాళ్ళను పిలిపించి వండిస్తాడు. టెర్రస్ మీదనైతే ఇంట్లో పనివాళ్ళతో తనే దగ్గరుండి వండించడమే కాదు, వడ్డిస్తాడు కూడా.

టెర్రస్ మీద పార్టీ అంటే, భార్య వద్దంది. పెళ్ళికి ఇల్లంతా శుభ్రం చేసి రంగులవి వేసి ఉన్నాయి. ఇలాంటప్పుడు టెర్రస్ మీదెందుకు అని అడ్డం చెప్పింది. అందులో చిన్న వియ్యంకుడు తాగి కక్కుకుంటాడు. ఇంట్లో ఎందుకని వద్దని బ్రతిమలాడి చెప్పింది, గతంలో జరిగిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని. కానీ చైర్మన్ వినిపించుకోలేదు, భీష్మించుకొని మరీ బినామీ ఆస్థులు, ఒక్క థామస్ బంధువులే కాదు మిగతా వాళ్ళు కూడా తిరిగి రాసేసారని, ఈ రాత్రికి ఫుల్‌గా ఎంజాయ్ చేయ్యాల్సిందేనని గట్టి పట్టు పట్టడంతో చైర్మన్ భార్యకు ఒప్పుకోక తప్పింది కాదు.

ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేసాడు. అరుదైన ఫారిన్ లిక్కర్, రకరకాల వెజ్, నాన్ వెజ్ అయిటమ్స్, మంచింగ్ స్టఫ్ అన్నీ అద్భుతమైన యాంబియన్స్‌లో పార్టీ జరుగుతోంది. పాల్గొన్న వారు కూడా పదిహేను మందికి మించి లేరు.

ఈ ఏర్పాట్లు ఇలా ఉండగా చైర్మన్ భార్య ఆమె ఏర్పాట్లు ఆమె చేసింది. అదేమిటంటే తమ సైడ్ నుండి నర్సమ్మ, మరో ఇద్దరు మగవాళ్ళను – ఆ ప్రక్క నుండి వచ్చిన భూలక్ష్మి, మరో నలుగురు ఆడవాళ్ళను టెర్రస్ మీద ఉండ మంది.

'ఇదిగో నర్సమ్మా! భూలక్ష్మి! మీ ఇద్దరూ జాగ్రత్తగా వినండి! ఎవరు ఉమ్మినా, కక్కినా వెంటనే శుభ్రం చెయ్యాలి. మగాళ్ళు ఫినాయిలేసి కడిగిన వెంటనే మరీ అలుగ్గుడ్డలు పెట్టి గబగబ క్లీన్‌గా తుడిచెయ్యాలి". అని ఇన్ని అలుగ్గుడ్డల మూట తీసి క్రిందనేసింది.

"ఆ తర్వాత పేర్‌ఫ్యూమ్ కొట్టే వాళ్ళు కొడతారు–సాంబ్రాణి దూపం వేసే వాళ్ళు వేస్తారు. నేను తెల్లారి వెళ్ళి చూసేసరికి ఎక్కడా కక్కినట్టుగానీ, ఉమ్మినట్టుగానీ నాకు కనిపించకూడదు. పెళ్ళికి చేసుకున్న అలంకరణ ఎక్కడ చెడిపోకూడదు. అర్థమైందా?" అన్జెప్పి ముందుకు కదలబోతుంటే నర్సమ్మ అంది.

"అమ్మా! ఈ పనికి ఇన్ని అలుగుడ్డలెందుకమ్మ! సగం చాలు – ఎలగబడితే అలగ వాడేసి ఎల్లిపోడానికి నేనేటి బయట్నుండి వచ్చిందాన్నమ్మా? ఇదిగో ఈ నాలుగు చాలు, మిగల్నివి దాచమ్మా!" అని నాలుగు మాత్రమే లెక్కబెట్టిమరీ తీసుకెళ్ళింది.

"అదీ నిజమే! నీకెన్ని కావాలో అన్ని తీసుకో" అంది చైర్మన్ భార్య భూలక్ష్మి నుద్దేశించి. లెక్కపెట్టకుండానే ఒక దొంతుడు తీసుకుంది భూలక్ష్మి

"ఎన్ని కావాలో చెప్పు" దబాయించి అడుగుతూ భూలక్ష్మి చెయ్యి పట్టుకుంది నర్సమ్మ.

"నీకేల అదంతా!" విదిలించుకొని వెళ్ళిపోయింది భూలక్ష్మి.

మందు పార్టీ వేకువ ఝామువరకు జరిగింది.

తెల్లవారింది.

రాత్రి తాగిన కాంతిని సూర్యుడు కిరణాల్లా కక్కుతున్నాడు. థామస్ గేరేజ్ లోంచి కారు తీసి తుడుస్తున్నాడు. ఇంట్లోంచి ఏ రకమైన అలికిడి వినిపించడం లేదు. ఎవరూ నిద్రమత్తులోంచి బయటకు రాలేదు.

కానీ బంగళాకు కూతవేటు దూరంలోంచి కారు కూతలు వినిపిస్తున్నాయి. బూతులు తిట్టుకుంటూ వస్తున్నారు. వాళ్ళను చుట్టు ముట్టి వింతగా చూస్తూ అనుసరిస్తూ వస్తున్నారు మరికొంత మంది.

"మా అయ్యగారింటిది ఒక ఆకైనా, పాకైనా నీ ఇంటికెలగ తీసుకెళ్తావే"!

"నా ఇష్టమే! అడగడానికి నువ్వెవర్తివే"!

గొడవ పడుతున్న వారు బంగళా గేటు దగ్గరకొచ్చే సరికి థామస్‌కి అర్థమైంది! పరుగెట్టికెళ్ళి అడిగాడు.

"ఏమైందీ నర్సమ్మా"! "ఏంటి గొడవ? ఏం రావుడూ! నువ్వుండగానే గొడవ పడ్తున్నారు" అన్నాడు నర్సమ్మ ప్రక్కనున్న మొగుడ్ని చూసి.

"ఏటి గొడవా! ఇదిగో పెళ్ళి కొడుకు తరపునొచ్చిందే! ఈ దొంగది! పనికి మాలింది! ఈ బజారుది! మన అయ్య గారింట్లోంచి ఇన్ని అలుగుడ్డలు తీసుకెళ్ళి దాని రూంలో నెట్టుకుంది" అని సంచిలోంచి అలుగుడ్డలు ఒక దాని తర్వాత మరొకటి తీస్తుంటే వాటితో పాటు వెండి గ్లాసొకటి పడింది. అది చూసి నోరు లబలబ కొట్టుకొని గగ్గోలు పెట్టడం మొదలు పెట్టింది నర్సమ్మ. భూలక్ష్మితో పాటు మిగిలిని పనివాళ్ళు ఆశ్చర్యపోయారు. సంచిలోకి గ్లాసెలగ వచ్చిందని గుసగుసలాడుతున్నారు.

"ఓలమ్మ ఎంత నంగనాచివే! ఒట్టి అలుగుడ్డలనుకున్నాను. వెండి గ్లేసు కూడా సర్దీసినావా.... ఇదిగో సూడు తామసు! ఇది మన అయ్యగారింటిలోదే కదా!" అని నిగ్గదీసింది నర్సమ్మ.

అంత వరకు వెనక ముందూ అవుతున్న భూలక్ష్మి ఇంక ఆగ లేకపోయింది.

కోపం కట్టలు తెంచుకుంది.

"ఏయ్ దేవుడి మీద ఒట్టేస్తావా? నేను గ్లాసు దొంగతనం చేసానా! అన్నా! తామసన్నా! నానీ అలుగుడ్డలు తెచ్చిన మాట నిజం. నింద నామీద పడాలని ఈ గ్లేసు ఇదే నా సంచిలో పడేసింది. లేకపోతే తెల్లారికి నేనున్న గదికి ఎందుకొస్తాది.

అలుగుడ్డల దొంగని పట్టుకుంటే ఎవరు మెచ్చుకుంటారు? ఆ మాత్రం దానికి తెలీదా!" అంది భూలక్ష్మి.

"ఇదిగో దబాయించేస్తే, దొంగ దొరైపోదు... నడు... అమ్మ దగ్గరకు నడు..." అంటూ చెయ్యి పట్టుకొని లాగింది. చెయ్యిపట్టుకొని లాగిన వెంటనే భూలక్ష్మి ఆమెతో పాటు ఇతర ఆడవాళ్ళు అందరూ కల్సి నర్సమ్మ జుత్తుపట్టుకొని వంచి, దబీదబీ మని నాలుగు గుద్దులు గుద్దారు. దానితో నర్సమ్మ మొగుడికి కోపం వచ్చింది. అదే తడవుగా చుట్టూ చూస్తే పక్కన చిన్న కట్టె ముక్క కనిపించింది. దాన్ని తీసుకొని "మీ యమ్మ"... అంటూ వాళ్ళను చేతికొచ్చినట్టు కొట్టాడు.

వాళ్ళూ ఏమాత్రం తగ్గలేదు.

ఒకామె రావుడు దెబ్బలు తప్పించుకొని వెనక మారుగ వచ్చి గబుక్కున నడుము పట్టుకుంది. అదే అదనుగా మిగిలిన వాళ్ళు ఒకరు రాముడి చేతిలో కర్ర లాక్కున్నారు. మిగిలిన ఇద్దరు జుత్తుపట్టుకొని బరబర ఇరవై అడుగులు లాక్కుపోయి కాలితో తన్నారు. నర్సమ్మను క్రింద పడేసి, చీర చింపేసి ఇష్టమొచ్చినట్టు బాదారు.

థామస్‌కి ఏం చెయ్యాలో పాలుపోలేదు.

కళ్ళుమూసి తెరిచేలోపు జరగాల్సిన బీభత్సమంతా జరిగిపోయింది.

అటు ప్రక్క నలుగురు, ఇటు ప్రక్క ఇద్దరు రక్తం వోడుతూ, ఆయాసంతో రొప్పుతూ తిట్టుకుంటున్నారు.

కురు పాండవ సేనల మధ్య కృష్ణునిలా నిలబడ్డాడు థామస్.

ఈ గంద్రగోళమంతా చెవినబడి చైర్మన్, అతని భార్య గేటు దగ్గరికి వచ్చారు. యామిని పోర్టీకో పైనున్న బాల్కని మీద నుండి చూస్తోంది.

వాళ్ళనలా చూసేసరికి నర్సమ్మ గొప్ప ధైర్యంతో ముందు కొచ్చింది.

"చూడమ్మా! దొంగముండ! ఎండి గ్లేసు సంచి లేసుకేలిపోయింది. తెల్లారికేదో పని మీద దానింటికెళ్తే పట్టుబడింది" రక్తం వొడుతున్న ముఖాన్ని దీనాతి దీనంగా పెట్టి చెప్పింది.

"ఏ పని మీద వచ్చావో చెప్పే" కుచ్చెళ్ళు ఎగదోసుకుంటూ మరో మాటాడితే తంతానన్నట్టు రడీగా ఉంది భూలక్ష్మి.

"థామస్ వాళ్ళను దూరంగా తీసుకెళ్ళి, విషయమేంటో నువ్వే తేల్చు" అన్నాడు చైర్మన్. ఇంతకంటే ఎక్కువ కల్పించుకుంటే రాజకీయంగా బాగుండదని. ఓట్లు అడగడానికి తప్పా ఇతర సమయాల్లో  అలగా జనానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నమ్మేవాడు చైర్మన్.

చైర్మన్ భార్య మాత్రం ఒక్కసారి అంతా కలియజూసింది. బంధువులంతా వారి వారికి వీలైన నెలవుల నుండి తొంగి, తొంగి చూస్తున్నారు. వాళ్ళ ముందు ఈ చిల్లర గొడవ వల్ల తమ హెూదాకు, దర్జాకు, ఠీవికి ఏమాత్రం లోటు రాకూడదనుకుంది.

"థామస్! ఇద్దర్నీ పోలీసులకప్పజెప్పు! వాళ్ళే తేలుస్తారు ఇద్దరు ఎంత సొత్తు ఎత్తుకెళ్ళారో" అంటూ గిరుక్కున వెనక్కి వెళ్ళిపోయింది.

"అదీ నిజమే! థామస్ అన్నను మాత్రం ఎలా నమ్మగలం. పనోళ్ళదంతా ఒకే జాతి. ఒకే నీతి! డ్రైవరా? క్లీనరా? మెయిడా? గార్డా! అన్నది  సమస్య కాదు" అనుకుంటూ తనే స్వయంగా పోలీసులకు ఫోన్ చెయ్యాలని సెల్ అందుకుంది యామిని.

పోలీసులొచ్చి అక్కడున్న అందరిని వ్యాన్లోకెక్కించారు. నర్సమ్మ, భూలక్ష్మి ఎదురెదురుగనే ఉన్నారు. కానీ ఒకరి ముఖాల్లో ఒకరు చూసుకోలేక పోతున్నారు.

# ప్రాణం

బాల్య, యవ్వన, కౌమార, వృద్ధాప్యాలు కేవలం మనిషికే కాదు. ఒక ఊరుకి కూడా ఉంటాయి. ఊరు బాల్యంలో గ్రామ పంచాయితీలాగుంటాది. యవ్వనమొచ్చేసరికి నగర పంచాయితీ అవుతాది. మున్సిపాలిటీగా మారుతుందంటే నడి వయసొచ్చినట్టే. కార్పోరేషనయ్యిందో వృద్ధాప్యం దావురించినట్టే.

ఆ ఊరు అంత గబుక్కన పెరిగిపోతోందని ఎవరూహించలేదు. ఒక అయిదారేళ్ళలో మున్సిపాలిటీస్థాయి కొచ్చేసిందంటే ఎంత స్పీడుగా డెవలెప్ అయిపోయిందో అర్థం చేసుకోండి. సినిమాల్లో వయసుకి మించి కొన్ని కనబడాలని కొందరికి హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తారట. అలాగ ఈ ఊరు గబుక్కన పెరగాలని రియల్ ఎస్టేటు వ్యాపారం, కొన్ని ఫార్మా కంపెనీలు, ఇంకొన్ని ఐ.టి.కంపెనీలు ఈ ఊళ్లో పెట్టించేసారు పిచ్చికల రెడ్డి, అతని ప్రాణ స్నేహితుడు కొండయ్య చౌదరి.

పిచ్చికల రెడ్డి, కొండయ్య చౌదరి, పెద్దకాపు, శోభనాల శర్మ, గొల్ల వీరన్న, శామ్యూల్ మధ్య చదువుకునే రోజుల్నుండి మంచి స్నేహం ఉండేది. ఏమయ్యిందో ఏమో అంతరిక్షంలోకి వెళ్ళే రాకెట్టులాగ, డెడ్ వెయిట్ అనుకున్నదంతా ఒక్కొక్కటె కిందకు పడిపోయి, చివరకు రోవర్ మరియు కంట్రోలర్ ఎలా మిగుల్తాయో, ఇతర కులాలకు చెందిన వాళ్ళంతా డెడ్ వెయిట్ లాగ రాలిపోయారు. పిచ్చికల రెడ్డి, కొండయ్య చౌదరి మధ్య స్నేహం బాగా ముదిరి, తీవ్రమై, సాంద్రమై, గాఢమై ప్రాణపదంగా మారిపోయింది. ఇప్పుడా పట్నంలో వాళ్ళకు మించిన ధనవంతులు, పలుకుబడి కలవాళ్ళు లేరు. వీళ్ళిద్దర్లో ఎవరు గొప్పంటే ఆ మాటెవరూ

చెప్పలేరు. బయటున్న వాళ్ళేకాదు, ఇంట్లో కెళ్ళి పనులు చేసేవాళ్ళు గానీ, వాళ్ళు ఆఫీసుల కెళ్ళి ఉద్యోగాల్జేసేవారు గానీ చెప్పలేరు. ఆఖరుకు ఇంట్లోకి, ఆఫీసులోకి వెళ్ళి తనిఖీలు చేసిన ఆదాయపు పన్నుశాఖ కూడా లెఖ్ఖ తేల్చ లేకపోయింది.

చౌదరిగారు ఫలానా ఆ ఫ్యాక్టరీ ద్వారా ఎంత ఆదాయం వస్తాదండీ అని ఎవరైనా అడిగాడనుకోండి.

'అదా! నాది కాదే! మా ఫ్రెండు పిచ్చికల రెడ్డి దం'టాడు. 'అదేంటి మీ భార్య పేరున ఉంది కదా' అంటే, 'అదా! అప్పుడు సోర్సు చూపించడం వీలుకాక నా భార్య మీద పెట్టాడ'ని జవాబు చెప్తాడు. ఇదే మాట రెడ్డిగారిని అడిగారనుకోండి! 'ఆ సినిమాహాలు మా అమ్మాయి పేర్న ఉన్నమాట నిజమే! కానీ దాని ఇన్కమ్ నాకొచ్చేదా! చచ్చేదా! అది మా చౌదరిది. అప్పట్లో ఇంట్లో ఏవో ప్రాబ్లెమ్స్ ఉండి టకాల్న మా అమ్మాయి పేరు పెట్టాడని' సమాధానం వస్తాది.

ఆస్థులు కాపాడుకొనేటప్పుడు కొందరి మధ్య అలాంటి అవగాహనుంటాది. కేవలం ఆస్థులేకాదు పదవులు, పలుకుబడి కాపాడుకొనేటప్పుడు కూడా అలాంటి సఖ్యతే వాళ్ళిద్దరి మధ్య ఉంది.

అధికారంలోకి వచ్చే పార్టీని బట్టి, దానికి నాయకత్వం వహించే వ్యక్తులను బట్టి వీళ్ళిద్దరూ రంగస్థలం మీద ఎవరు ముందుండాలో, ఎవరు వెనకుండాలో నిర్ణయించుకుంటారు. డబల్ యాక్షన్ సినిమాలో ఒకే రూపురేఖలతో ఉండే ఇద్దరిలో ఒకడు అమాయకుడు. మరొకడు అసాధ్యుడు. అలా పవర్‌లో ఉండే పార్టీని బట్టి ఒకడు అమాయకునిలా నటిస్తే, మరొకడు అసాధ్యునిగా దుమ్ముదులుపుతాడు. ఇది అందరూ చెయ్యగలరా అంటే – వాళ్ళిద్దరికే ఈ మున్సిపాలిటీలో చాలా కాలం నుండి అలా కల్సివస్తోంది. అందుకే ఆ ఊరిలో ఎవరికీ లేనంత బంగారం, వజ్రాలు వైడూర్యాలు, ఇతర విలువైన, రాళ్ళు ఖరీదైన ప్లాట్లు, భవనాలు, కంపెనీల్లో పెట్టుబడులు కొండయ్య చౌదురి దగ్గరుంటే, పిచ్చికల రెడ్డి దగ్గర గనులు, పొలాలు, ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే దేవుడు ప్రత్యేక్షమై ఊరందరిని ఒకచోట సమావేశ పర్చి, ఒక పెద్ద సొరచేప ఇచ్చి దాన్ని మీరందరూ సమానంగా

పంచుకోండిరా అని ఇస్తే మూడొంతుల భాగం వీళ్ళు నొక్కేసి, తొక్కేసి, మా పెట్టి, దాపెట్టి తతిమా జనాలంతా కలిసి మిగిలిన తోక, మొప్పలు, డొప్పలు పంచుకున్నట్టుంటాది ఆ మున్సిపాల్టీలో వాళ్ళిద్దరి భాగోతం. దీనికితోడు పైన అధికారంలో ఉండే పార్టీని బట్టి, జిల్లాలో ఉన్న ప్రధానమైన పోస్టులన్నీ వాళ్ళ బంధువుల్తో, పరిచయస్తులతో నింపేస్తారు. ఇదంతా చట్టబద్ధంగా, ప్రజాస్వామయుతంగా జరుగుతన్నట్టే ఉంటాది. రూల్సుకి వ్యతిరేకంగా ఏదీ జరుగుతున్నట్టు కనిపించదు. రాజ్యాంగానికిచ్చే గౌరవమైతే మాటల్లో కించిత్ కూడా తగ్గదు. అందుకే కొండయ్య చౌదరి, లేదా పిచ్చికలరెడ్డి లేదా వారి తరపు బంధువులు మార్చి, మార్చి మున్సిపల్ చైర్మన్లుగా ఎన్నికవుతుంటారు.

ఆరోజు శివరాత్రి. ఊరంతా కోలాహలంగా ఉంది. శివాలయాన్ని రంగురంగుల ఎత్తు దీపాల్తో అందంగా అలంకరించారు. గుడి ముందున్న మైదానంలో షామియానాలతో నింపారు. షామియానాలో పెద్ద వేదిక నిర్మించారు. ఆ వేదిక అలంకరణ చూసి తీరాల్సిందే. వర్ణించడానికి మాటలు చాలవు. ప్రాంగణమంతా బెంగుళూరు నుండి తెచ్చిన పూలతో అలంకరించారు. ఆ వేదిక మీద ఇరవై అడుగుల ఎత్తున్న శివుడు లింగం పెట్టారు. లింగాన్ని చందనం లేపనంతో పూశారు. విభూది రేఖలు దిద్దారు. మధ్యలో మూడో నేత్రమున్నట్టు సింధూరంతో బొట్టు పెట్టారు. ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. గొప్ప క్రమశిక్షణతో వస్తున్నారు. అది లేనివారికి వాలంటీర్లు నేర్పుతున్నారు. ఎంట్రీ దగ్గర ఎగ్జిట్ వరకు బారికేడ్లు, దానికి సైన్ బోర్డులు పెట్టారు. ప్రాంగణంలో పడే చెత్తాచెదారాన్ని తీసెయ్యడానికి అక్కడక్కడ మున్సిపల్ వర్కర్లను ఏర్పాటుచేశారు. మతపరమైన కార్యక్రమాలన్నీ పిచ్చికలరెడ్డి ఆధ్వర్యంలోనూ, సాంస్కృతిక కార్యక్రమాలు కొండయ్య చౌదరి ఆధ్వర్యంలోను నిర్వహిస్తారు. యధా ప్రకారం శివరాత్రి ఉత్సవాల కర్తృత్వమంతా పిచ్చికలరెడ్డిదే.

వేదికమధ్య నిలబెట్టిన శివలింగం ముందు కూర్చున్నాడు. కాషాయరంగు పంచెకట్టాడు, నుదుటి మీద విభూది రేఖలు, మెడలో రుద్రాక్షలు, చేతి మణికట్టు మీద, దండల మీద, గుండెల మీద నామాలు. శివభక్తిలో సాక్షాత్తు రావణ బ్రహ్మకు సరిసాటి అన్నట్టున్నాడు.

మరికాసేపటిలో శివునికి మహాభిషేకం ప్రారంభం కాబోతున్నది. భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోతున్నారు. ఓంనమశ్శివాయ మంత్రంతో పరిసరాలన్నీ ప్రతిధ్వనిస్తున్నాయి.

నిన్ననే ప్రారంభోత్సవం జరిగిన స్టార్ హోటల్ నుండి తెలుగు సినిమా హీరోయిన్ బయల్దేరింది. ఆమెను బి.యమ్. డబ్ల్యూ కారులో ఎక్కించి, ఆమె పక్కనే కూర్చున్నాడు కొండయ్య చౌదరి. అమె సన్నని వేళ్ళను తన చేతిలోకి తీసుకొని సుతిమెత్తగా నిమురుతున్నాడు. శివరాత్రి ముందు రోజు హోటల్ ఇనాగరేషన్, శివరాత్రి మహాభిషేక ప్రారంభ సూచనగా మొట్టమొదటి పాలబిందెను ఆమెతో శివార్పణం చేయించాలని నిర్ణయించారు. తర్వాత భక్తులొక్కొక్కరు వచ్చి అభిషేకంలో పాల్గొని ఈశ్వరకృపకు పాత్రులుకావొచ్చని ప్రచారం చేయించారు. హీరోయిన్ వస్తుందనేసరికి ఇసకేసినా రాలనట్టు జనాలొచ్చేశారు. వాళ్ళను కంట్రోల్ చెయ్యడానికి అదనపు ఫోర్స్‌ని రప్పించారు పోలీసోళ్ళు.

హీరోయిన్, కొండయ్య చౌదరి కారు దిగారు. ఆమెను చూడ్డానికి జనమంతా ముందుకు తోసుకొస్తున్నారు. యువతను కంట్రోల్ చెయ్యడం కష్టమైంది. వందలాదిమంది వచ్చి మీదపడ్డారు. వాళ్ళను అదిలించడానికి పోలీసులు లాఠీలకు పన్జెప్పారు. డిఎస్పీ వచ్చి ఆమెను వేదిక మీదకు తీసుకెళ్ళడం కష్టమని, వెనక్కి పంపించేద్దామన్నాడు.

కానీ కొండయ్య చౌదరి ఒప్పుకోలేదు. సెల్ లో రెడ్డినడిగితే ఆమాటకు ససేమిరా వీలుకాదన్నాడు. డిఎస్పీకి తప్పింది కాదు. తనకు ఇష్టం లేకపోయిన వాళ్ళ ఇష్టాన్ని మన్నించకపోతే తనకే కష్టమొస్తాదనో భయపడ్డాడు. ఒక హీరోయిన్ ముందు మా ఇజ్జత్ కాపాడకపోయావు ఇక నువ్వు మాకెందుకని మూడు రోజుల్లో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ పుట్టించినా పుట్టించగలరు. మగాడు దేనైనా భరిస్తాడుగానీ, అడదాని ముందు అవమానాన్ని భరించలేడు. ఇంత తర్కం చేసుకున్న డిఎస్పీ పది నిమిషాల్లో రోప్ పార్టీని పిలిపించారు. మరో వేన్ నిండా ఎగస్ట్రా పోలీసుల్ని పిలిపించాడు. రోప్ పార్టీ మధ్య, ముందు వెనక గట్టి బందోబస్తు చేసి హీరోయిన్ ని, కొండయ్య చౌదరిని వేదిక మీదకు చేర్చాడు. మళ్ళీ ఆమెను వేదిక మీద నుండి క్షేమంగా దించి, కార్లో ఎక్కించి హోటల్ రూంకి చేర్చడమెలాగో ఫోర్స్ కి

ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వడానికి కిందకు దిగి పోయాడు డిఎస్పీ.

వేదిక మీద హీరోయిన్ కనిపించేసరికి భక్తుల్లో చాలా మంది మూడ్ మారిపోయింది. అంతవరకు భక్తి తొణికిసలాడిన కళ్ళలో ఆసక్తి చోటుచేసుకుంది. నిశ్చలమైన సరస్సులా ఉన్న ప్రాంగణం కల్లోల కడలిలా మారిపోయింది. ఓం నమశ్శివాయ పలికిన పెదవులు ఆమెనటించిన పాటల్ని, చెప్పిన మాటల్ని మననం చేసుకుంటున్నాయి.

హీరోయిన్ వేదిక మీదకు రాగానే ఒక బిందెతో పాలు ఆమె చేతికందించారు. ఆ బిందెను తీసుకొని బరువుకి వదిలెయ్యబోతుండగా, గబాల్న చౌదరి ఆమెను, బిందెను పట్టుకున్నాడు. బిందె మొత్తం అతని రెండు చేతుల్లో ఉండగా, ఆమె పార్మాలిటీగా దాన్ని తాకి శివుని దగ్గరకొచ్చింది. ఆమె రాగానే రెడ్డి పైకి లేచి బిందె మీద తన చేతుల్ని కూడా వేశాడు. బిందెను ఇద్దరూ రెండు ప్రక్కల పట్టుకొని, హీరోయిన్ ని సెంటర్ జేసి ఫొటోలకు, వీడియోలకు ఫోజుల మీద ఫోజులిచ్చారు. బిందెను కాస్త వంచి సన్నని ధారగా పాలను పోస్తూ మళ్ళీ ఫొటోలు వీడియోలు తీయించారు.

ఈ ఫోజుల్ని చూడడానికి వెనక సెక్యూరిటీగా ఉన్న పోలీసువాళ్ళు ముందుకొచ్చారు. దాంతో అంత వరకు వెనక్కి తగ్గిఉన్న యువ గుంపు ముందుకు దూసుకొచ్చి హీరోయిన్ మీదపడ్డారు. దాంతో హీరోయిన్ ఆమె పక్కనున్న చౌదరీ మీద పడగా, రెడ్డి ముందుకు తూలారు. బిందె నుండి సన్నగా పడుతున్న పాల ధార బొళుక్కున గుమ్మరించినట్టు వొలికి బిందె లింగానికి కొట్టుకొని ప్రక్కనే స్థంబానికి కట్టి ఉన్న హైవోల్టేజీ లైటుమీద పడింది. ఒక్కసారి డబ్ మని శబ్దం చేస్తూ పేలిపోయింది. భగ్గున పెద్ద మంటవచ్చింది. శివలింగం చుట్టూ ఉన్న ఫ్లడ్ లైట్లన్నీ టప్ టప్ మని పేలిపోతూ మండిపోయాయి.

జనం భయపడి ఎవరి మటుకు వారు పరుగులు పెట్టారు. హాహాకారాలు చేస్తున్నారు. మొత్తం చీకటి మయమైపోయింది. ఎవరెక్కడి కెళ్తున్నారో అర్థం కావడం లేదు. మొత్తం తొక్కిసలాటైపోయింది. అంతవరకు భక్తితో ఊగిపోయిన భక్తులు భగవంతుడ్ని గానీ, అందచందాల్ని చూసి తన్మయత్వం చెందిన సౌందర్యో

పాసకులకు హీరోయిన్ని గాని పట్టించుకున్న పాపానపోలేదు. అధికార దర్పాలకు చిహ్నమైన పిచ్చికలరెడ్డి, కొండయ్య చౌదరి కూడా సామాన్యుల్లో కలిసిపోయారు. ఈ సృష్టిలో తన ప్రాణం కన్నా ఇప్పుడేది ముఖ్యం కాదన్న పరిస్థితి. కానీ కొందరి ప్రాణాలు గాలిలో కల్సిపోయాయి. ఎవరు చచ్చిపోయారో ఎవరు బతికున్నారో చూడాలంటే కూడా వీలుకాని పరిస్థితి.

చిమ్మచీకటి.... అక్కడక్కడ మండుతున్న మాంస ఖండికలు.

కథ అయిపోయింది. మీరే ఊహించుకోండి ఎవరు బ్రతికుంటే బాగుంటుందో!

# స్థితప్రజ్ఞత

ఒక మున్సిపాలిటీలో పకీరయ్య పారిశుధ్య కార్మికుడు. వాళ్ళ అయ్య కూడా అదే ఉద్యోగం ముప్పై ఏళ్ళు చేసి ఊపిరితిత్తులు పాడై చచ్చిపోయాడు. ఇప్పుడు ఫకీరయ్య వంతొచ్చింది.

పకీరయ్య ఉండే మురికి వాడల్లో కొంతమంది క్రిష్టియన్ మతం పుచ్చుకున్నారు. మర్యాద, మన్నన లేని ఆ మతం నుండి ఈ మతంలోకి రమ్మని ఫకీరయ్యను చాలామంది ఆకర్షించడానికి చాలా ఉదాహరణలు చెప్పారు. ఈ దేశంలో తొలి నుండి ఒక మతమనేది స్థిరంగా ఎప్పుడూ లేదురా! నీలాటోళ్ళు, నాలాటోళ్ళు కాదు రాజులు, మంత్రులు, సేనాపతులు పదవుల కోసం, అధికారం కోసం, ఆడవాళ్ళ కోసం మతాలు మార్చేసినోళ్ళింత మంది ఉన్నారని చెప్పారు. పకీరయ్య ఉహూ అంటూ మీ మాటలిని నేను వెధవను కాలేనన్నాడు. వీడికి ఇలాక్కాదు – చచ్చిన స్టోరీలు చెబితే బుర్రకెక్కడం లేదు. బతికున్న కథల్జెపుదామని – నిన్న మొన్నటి వరకు ఒక పార్టీలో ఉండి మంత్రులుగా జేసి, ఎమ్మెల్యేలు, ఎమ్.పి.లుగా చేసి – ఆ పార్టీలు ఓడిపోయిన వెంటనే గెలిచిన పార్టీలోకి మారిపోయిన పెద్దన్న గాళ్ళని ఇంత మందిని చూస్తున్నాం కదా – వాళ్ళంతా వెధవలా? పనికి మాల్నోలా? వాళ్ళకి లేని వెధవాయితనం నీకే అంటుకుంటాదా? అని గుద్ది గుద్ది అడిగారు. అప్పుడు కూడా ఉహూనే అన్నాడు తప్ప ఆహా! అన్లేదు. ముఖ్యంగా ఫకీరయ్య మనసు మార్చడానికి అదేపనిగా పెట్టుకున్నవాడు ఫాదర్ రవీంద్ర. అతను వినడం లేదని పకీరయ్య భార్యను కూడా కదిపి చూశాడు. అతనికిట్టం లేకుండా తనేమి చెయ్యలేనని చెప్పింది. "ఎందుకైనా మంచిది ఇదిగో ఇది నీదగ్గరుంచు"అని బైబిల్ తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు. పకీరయ్య కంటబడకుడా గూట్లో దాచింది.

పకీరయ్య పెద్ద మనిషి. ధర్మ నిరతి ఎక్కువ. ఏ రోజూ పనిఎగ్గొట్టడు. శలవు పెట్టి, తనే బదిలీ వర్కరుగా హాజరు కాలేదు. నూనె, సబ్బులు, అమ్ముకోలేదు. రోజు వడ్డీకి అప్పు తీసుకోలేదు. తన దగ్గర డబ్బులుంటే తోటి కార్మికులకు చేబదులిచ్చాడే తప్ప వడ్డీ అడగలేదు. ఏ బీటు ఇచ్చి వెళ్ళమన్నా వెళ్తాడు. వి.ఐ.పి.ల విజిటలప్పుడు, పండగల్లోను షడన్‌గా డ్యూటీ పడితే దొంగసాకులు చెప్పి తప్పించుకోడు. మురుగు కాల్వలో దిగమన్నా, సెప్టిక్ ట్యాంకులో దిగమన్నా ఒళ్ళు దాచుకోకుండా పన్జేస్తాడు. ఇదంతా ఒక ఎత్తయితే అతనికి భక్తి ఎక్కువ. కృష్ణుడంటే విపరీతమైన ఆరాధన. పండగల్లో పుణ్యదినాల్లో గుళ్ళ దగ్గర డ్యూటీ వేయించుకొని ఆ పరిసరాలన్నీ చక్కగా పరిశుభ్రం చేసి తన భక్తిని ప్రకటిస్తాడు. గుడిలోకి, అంతరాలయంలోకి వెళ్ళనిస్తే ఎవరూ చేయలేనంత శుభ్రంగా చేసేవాడినని తెగ బాధపడుతుంటాడు.

పకీరయ్య నివాసముండేది ఒక స్లమ్ ఏరియా. అదే స్లమ్ లో ఫాదర్ రవీంద్ర కూడా ఉంటున్నాడు. ఒక రోజు ఫాదర్ రవీంద్ర గబగబ వచ్చి ఇంట్లో ఉన్న టీవీని ఆన్ చేసి చానల్ మార్చి, వస్తున్న వొక ప్రోగ్రామ్ చూడమన్నాడు. సాధారణంగా ఫాదర్ క్రిస్టియానిటి చానల్స్ మాత్రమే చూడమంటాడు. కానీ దానికి భిన్నంగా ఈ రోజు ఒక ప్రవచనం చూడమనడం ఆశ్చర్యమేసింది పకీరయ్యకు. ఫాదర్ అంత శ్రద్ధగా చెప్పడంతో పకీరయ్య భార్య, పదో తరగతి చదువుతున్న కొడుకు కూడా టీవీకి కళ్ళప్పగించి చూస్తున్నారు.

టీవీలో భగవద్గీత మీద ఒకాయన ఊగిపోయి మరీ ఉపన్యసిస్తున్నాడు. భగవద్గీతకు మించిన జ్ఞానం లేదని, ప్రపంచమంతా దాంట్లోనే ఉందని, దీన్నెంతో మంది పాశ్చాత్యులు తలమీద పెట్టుకుంటే ఈ దౌర్భాగ్య దేశంలో దాని గొప్పదనం గుర్తించడం లేదని వాపోతున్నాడు. పైగా స్థితప్రజ్ఞత – ఎంత గొప్ప భావం అది. ప్రపంచం యావత్తూ ఈ ఒక్క శ్లోకానికి భారత దేశం కాళ్ళ మీద పడిపోవాలి కదండీ! అంటూ...

**"దుఃఖేష్వనుద్విగ్నమనా, సుఖేషు విగతస్పృహః**

**వీతరాగ భయక్రోధః స్థిత ధీర్మని రుచ్యతే"**

ఇంకా గీతాకారుడేమన్నాడంటే...

**"సమః శత్రౌ సమిత్రేచా, తథా మానావా మాన యోః**

**శీతోష్ణ సుఖ దుఃఖేషూ, సమస్సఙ్గ వివర్జిత:**

**తుల్యనిందాస్తుతిర్మౌని, సంతుష్టాయేనకేనచిత్**

**అనికేతః స్థిరమతిః భక్తి మాన్మేప్రయోన నరః ॥**

శ్లోకాలు రాగా యుక్తంగా చదివాడు. యాంకర్ విపరీతంగా స్పందించి కళ్ళమ్మట నీరు పెట్టుకుంది.

"ఇంత గొప్ప గ్రంథాన్ని ఎందుకు ఎవరూ పట్టించుకోవడం లేదండీ" అని అడిగింది యాంకర్. ప్రవచనకర్త రెచ్చిపోయాడు. "దేశద్రోహమమ్మా! ఒక్కడికీ బాధ్యత లేదు, జ్ఞానం లేదు, బుద్ధి లేదు. మూర్ఖులు... పైగా చూశారా! పరాయి వాడెవడో ఇచ్చే వాటికి కక్కుర్తిపడిపోయి మతం మార్చేస్తున్నారు. మతమంటే అమ్మ, జన్మనిచ్చిన తల్లి, తల్లిని మార్చేసే వాళ్ళని ఏమనాలి? కిరాతకులు... ఇంతే ఈ దేశం అధోగతి పాలుకావల్సిందే" అని చెబుతూనే, అంతకు ముందు యాంకర్ ఇచ్చిన స్లిప్ మీద బ్యాంకు అకౌంటు నెంబరు, ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ రాసి సంతకం పెట్టి మళ్ళీ ఆమెకే చాలా లాఘవంగా అందించాడు. నిజానికి ప్రవచన కర్త ఇంకా, ఇంకా తిట్టి యాంకర్ కి మరి కొంత కన్నీరు తెప్పించే వాడు. కానీ వేరే చానల్‌లో మరో కార్యక్రమానికి టైమవుతోందని చెప్పిన మాటలు కూడా బయటకు వినబడ్డాయి.

ఇప్పుడు పకీరయ్య ముందు పాదర్ రవీంద్ర నిలువెత్తు ప్రశ్నలా నిలబడ్డాడు. అంత స్టబర్న్‌గా నిలబడడంతో ఏంటి కొడతాడా అన్నట్టు చూస్తోంది పకీరయ్య భార్య.

"ఇప్పుడు చెప్పు! ఇంకా ఈ మతంలోనే ఉండాలనిపిస్తోందా? ఒక వేళ నువు మారదల్చుకోకపోతే, మేమంతా తల్లికి ద్రోహం చేసిన వాళ్ళమని ఒప్పుకో! మేమంతా మూర్ఖులం, బుద్ధిలేని వాళ్ళమని ఒప్పుకో.ఏదో ఒకటి ఆదివారం నాడు నాకు చెప్పు! చర్చిలో ఉంటాను" అని గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

"ఏం చేద్దాం" అంది భార్య. తనకు ఇరుగు పొరుగు వాళ్ళలాగా ఆదివారం నాడు చేతిలో బైబిల్ పట్టుకొని చర్చికు వెళ్ళాలని ఉంది. ఆ కోరిక తీరక పకీరయ్య మీద రానురాను కోపం పెరుగుతోంది. తన పరిస్థితి ఎలా ఉందంటే.

"ఆదివోరం ఈన చర్చికెళ్ళనివ్వడు. సోమవోరం వాళ్లేమో గుడికి రానివ్వరు".

పకీరయ్య మనసు అటు ఫాదర్ మాటలు మీద గానీ, ఇటు భార్య పరిస్థితి గానీ ఆలోచించడం లేదు. ఇందాక ప్రవచన కారుడు చెప్పిన మాటల మీదే లగ్నమై ఉంది. ఊహ తెలిసిన దగ్గర నుండి తన జీవితాన్ని, తనతోటి కులస్థుల బతుకుల్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటున్నాడు.

"తననెవరు ముట్టుకొనేవారు కాదు. ముట్టుకుంటే అసహ్యించుకొనే వారు. స్నానాలు చేసేవారు. ఎదురు పడితే అశుభ్రమని వెనక్కి వెళ్ళిపోయేవారు. మొట్టమొదట సారి తండ్రి చేస్తున్న పనిచూసి వాంతి చేసుకున్నాడు. తండ్రి ఊళ్ళో వాళ్ళ మలం తట్టలకెత్తి నెత్తిమీద మోసేవాడు. తను పెద్దయ్యాక ఆ తట్టే తననెత్తి మీదకొచ్చింది. సెప్టిక్ ట్యాంకులొచ్చి ఆ తట్టబరువు కొంత తగ్గింది. ఇప్పుడు వీధుల తుడిచే పని. పబ్లిక్ లెట్రీన్లు కడగేపని... ఇది తనొక్కడి బతుకు కాదు. తన కులం బతుకు. దీనికెప్పుడూ తనకులం ఎవర్నీ నిందించలేదు. ఎవర్నీ తూలనాడ లేదు. ఏ దేవుడి మీదా కోపం పెంచుకోలేదు. ఏ ఋషినీ శపించలేదు. తరం తర్వాత తరం ఈ దు:ఖాన్ని దిగమింగుకొచ్చారు. ఆకల్ని, అవమానాల్ని సహించు కొచ్చారు. నోరు విప్పలేదు...మాటతూలలేదు... తెగబడి ఎదురు తిరిగితే, నిలబడ గలిగే మొగాడు భూమ్మీద ఉన్నాడా? మనిషనేవాడు నేలమీద మిగిలేవాడా? అయినా నియంత్రణ కోల్పోలేదు. సంయమనం వీడలేదు. సామాజిక దౌర్భాగ్యం కన్నా వ్యక్తిగత కష్టం బలమైనదా? ఇంతకన్నా గొప్ప దురదృష్టాన్ని చరిత్రలో ఏ క్షత్రియుడు, ఏ బ్రాహ్మణుడు, ఏ వైశ్యుడు అనుభవించాడు?

దీనికే స్థితప్రజ్ఞత అని పేరు పెట్టి శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి నేర్పించాలనుకున్నాడా? నిజమే ఈ దేశంలో మాల మాదిగలకు మించిన సేవా తత్పరులెవరు? వారి కన్నా ఆదర్శ పురుషులెవరు? ఈ కులాలు తరతరాలుగా జీవిత ధర్మంగా పాటించిన ఒక సూత్రాన్ని, అర్జునిడికీ, అతనితో పాటు మిగతా

మానవాళికి తెలియజెప్పడానికి కింత శ్రమపడ్డావా తండ్రీ! నువు చాలా గొప్పవాడివి కృష్ణా అంటూ బయటికెళ్ళిపోయాడు పకీరయ్య.

గూట్లో దాచుకున్న బైబిల్ వంక దీనంగా చూస్తోంది పకీరయ్య భార్య.

భగవద్గీతను పాడి కడుపు నింపుకున్నవారు పెద్ద కులాల్లోను, కడుపు ఎండిన, మండినా దాని సారాన్ని ఆచరించి బ్రతుకుతున్నవారు చిన్న కుల్లాలోనూ ఉన్నారు.

# స్వర్గప్రాప్తి

ఆ ఊరి మున్సిపల్ చైర్మన్ గొప్ప సంపన్నుడు. అతని పేరు రాజేంద్రనాయుడు. అతనికి ఆ మున్సిపాల్టీలోనే కాదు, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంతోపాటు మిగిలిన చాలా పట్టణాల్లో ఆస్తులున్నాయి. నాయుడే రోజూ ఎర్రని ఎండలో ఒళ్ళొంచి పన్జేసిందిలేదు. చెమట చిందించిందీ లేదు. మెదడుకి పదునుపెట్టి ఆలోచించిందీ లేదు. అతనికి తెలిసిన విద్య లేదు. కానీ చెయ్యని వ్యాపారం లేదు. గట్టిగా మాట్లాడితే వ్యాపారమూ చేయలేదు. మరేం చేసాడయ్యా అంటే– పెట్టుబడులు పెట్టాడు. దేంట్లో పెట్టాడంటే– అదీ, ఇదీ అని లేదు. మైన్స్, మెరైన్స్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్, ఫిల్మ్ ఇండస్ట్రీ, కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్– ఇలా ఏయే రంగాల్లో డబ్బులొస్తాయో, ఆయా రంగాలన్నిటిలో పెట్టుబడి పెట్టాడు. అతనికి రాష్ట్రమంతా బంధువర్గముంది. ఆ బంధువులంతా సంపన్నులు, బలమైన బంధువు భగవంతుడుతో సమానమంటాడు నాయుడు. రాష్ట్రంలోని అందరి దేవుళ్ళకు ఇంతేసి నైవేద్యం సమర్పించినట్టు, మంచి లాభాలు సంపాయిస్తున్న కంపెనీల్లో కొంతేసి పెట్టుబడి పెట్టడం, పెట్టినప్పుడు అవి లక్షలు... ఇప్పుడు కోట్లయ్యాయి. నాయుడు పుట్టుకతో పెద్ద తెలివైనవాడు కాదు. సాధనతో సంపాదించాల్సిన అవసరమూ ఏర్పడలేదు. ఒంటి మీదకు యవ్వనమొచ్చినట్టు, యవ్వనంతోపాటు మూతిమీద మీసం వచ్చినట్టు, అకౌంట్లలో డబ్బు పేరుకుపోతున్న కొద్దీ, తనదికాని తెలివేదో నాయుడ్ని ఆవహిస్తుండేది. ఆ తెలివి ఎలాగుండేదంటే బాగా కాచిన పాలమీద మీగడ తెట్టులాగుండేది. మీగడ పాలలో భాగమా అంటే కాదు. దాని ఉనికి సెపరేటు. పాలు లేకుండా ఉండగలదా అంటే ఉండలేదు. పాలకు మీగడకు ఉన్న సంబంధమే తన డబ్బుకి, తనకొచ్చిన తెలివికి ఉందని గ్రహించాడు నాయుడు.

ఈ గ్రహింపు ఎప్పటికీ బుర్రలోంచి ఊడిపోకుండా కాపాడుకోవాలని పించింది నాయుడికి. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు. భగవంతుడి మీదకు దృష్టి మళ్ళించాడు. ఈ ప్రక్రియలో భగవంతుడికి నాయుడికి మధ్యన ధ్వజస్థంభమై నిలబడినవాడు కోటయ్య.

కోటయ్య మంచి పండితుడు. నిష్టాగరిష్టుడు. వేలకొలది పద్యాలు, శ్లోకాలు అప్పజెప్పగలడు. మైక్ చేతికి పుచ్చుకున్నాడంటే ఎంతమందినైనా కదలకుండా నిలబెట్టేస్తాడు. నిలబడకుండా కూర్చోబెట్టేస్తాడు. అంతటి వాగ్ధాటి, అంతటి ధారణాశక్తి. నాలిక మీద సరస్వతీదేవి తాండవిస్తోంది. నాయుడి ప్రాపకం దొరికిన తర్వాత లక్ష్మీదేవి కూడా అనుగ్రహించడం ప్రారంభించింది.

నాయుడు, కోటయ్యల అనుబంధం చాలా ముచ్చటగా ఉంటుంది. కోటయ్య ప్రక్కన లేనిదే నాయుడు బయట ఎక్కడా కనిపించడు. గుడికెళ్ళినా, సభలకెళ్ళినా, సరదాగా సినిమాకెళ్ళినా నాయుడి ప్రక్కన కోటయ్య ఉండాల్సిందే. ఇది బయటకు కనిపించేదైతే తాత్వికంగా చూస్తే వారిద్దరి స్నేహంలో అంతర్గత సూత్రం ఒకటి తొంగిచూస్తూ ఉంటది. అలవోకగా సంపదలు రావడానికి ఏయే క్రతువులు, కర్మలు చేయాలో కోటయ్య చెబుతుంటాడు. నిత్యం దైవ స్మరణతో పునీతమయ్యే కోటయ్యకు భూలోకవాసం సుఖమయం కావడానికి అవసరమయ్యే సౌకర్యాలు సమకూరుస్తాడు నాయుడు. ఇది పురాతన కాలంలో ఈ దేశం అణువణువున కనిపించిన పండిత పాలక వర్గాల మైత్రీ సూత్రం. శాస్త్ర విజ్ఞానం, తన కాళ్ళను కూడా దీసుకొని తొలి అడుగులు వేసిన తర్వాత ఈ సూత్రానికి కాలం చెల్లిపోతుందని ఆశించారు. అత్యాశే అయ్యింది. సముద్రం నదుల్ని తనలో కలుపుకొని ఏ నదికీ ప్రత్యేకమైన అస్తిత్వం లేకుండా చేసేస్తుంది. భారతదేశమూ అంతే. బయట నుండి ఎంత గొప్ప భావజాలం వచ్చినా మనదైన కులవ్యవస్థలోకి కూరుకుపోతుంది. అది కమ్యూనిజమైనా సరే! మరో సిద్ధాంతమైనా సరే!

ఈ దేశంలోని దేవుడ్ని దూరం చేసారని పరాయి దేశం నుండి వచ్చిన దేవుడికి దగ్గరయ్యాడు దుర్గయ్య. అతను ఆ మున్సిపాల్టీలో పాకీ పనివాడు. వాళ్ళ తాతల కాలంలో మనుష్యుల మలాన్ని గంపల్లోకి ఎత్తి నెత్తిమీద పెట్టుకొని ఊరవతలకి తీసుకెళ్ళేవారు. సెప్టిక్ లెట్రిన్లు వచ్చాక చాలా మున్సిపాల్టీల్లో ఆ పని

ఇప్పుడు లేదుగానీ పాకీపని వారందర్నీ డ్రైనేజీలు కడగడానికి, కమ్యూనిటీ లెట్రిన్లు శుభ్రం చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఇలాంటప్పుడే మనిషి విచక్షణాశక్తి పన్జెయ్యాలి. ఏ దేవుడూ, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త నిర్మూలించలేని 'నెత్తి మీద మోసే పాకీపని' ఒక్క శాస్త్రీయ ఆవిష్కరణతో బంద్ అయిపోయింది. చూసారా! శాస్త్ర విజ్ఞానానికున్న శక్తి.

కార్తీకమాసం వచ్చిందంటే ఈ ముగ్గురికి చెప్పలేనంత పని పడతాది. మున్సిపల్ గ్రౌండ్స్‌లో వేలాదిమంది సమక్షంలో నెలంతా పూజలు చేస్తారు. పెద్ద, పెద్ద షామియానాలు వేసి ఎత్తైన వేదిక మీద శివలింగాల్ని ప్రతిష్టిస్తారు. రంగురంగుల ఆలంకరణలు, పాటలు, భజనలు, ప్రతీరోజూ పాలతో, పెరుగుతో, నెయ్యితో ఆ శివునికి అభిషేకాలు– అబ్బో సాక్షాత్తు కైలాసంలో కూడా అంత హడావిడి కనబడదు. ఈ పూజలన్నిటికి నేతృత్వం కోటయ్యది. ఖర్చులన్నిటికి దాతృత్వం నాయుడిది. అర్ధరాత్రి తర్వాత ఆ పరిసరాల్లో పేరుకున్న చెత్తా, చెదారాన్ని తీసి, టెంపరరీ టాయిలెట్లని కడిగి, ఫినాయిల్ జల్లి, భక్తులొచ్చేసరికి శుభ్రంచేసే సేవా పరాయణత్వం దుర్గయ్యది. అతని బృందానిది.

కొన్నాళ్ళకు ఈ ముగ్గురు కాలంచేసి, దేవుని దగ్గరకు వెళ్ళారు. ముగ్గురిలో స్వర్గప్రాప్తి ఎవరికి కలగాలనే విషయం మీద చర్చ జరుగుతోంది. నారదుడు న్యాయవాదన చేస్తానన్నాడు.

"సృష్టి పరిణామక్రమాన్ని గౌరవించినవాడు, దానికి దోహదపడినవాడు పుణ్యాత్ముడు. వ్యతిరేకించినవాడు పాపాత్ముడు. ఈ నాయుడు, కోటయ్య పరమ పాపాత్ములు మహేశ్వరా!" కోపంతో రగిలిపోతూ అన్నాడు నారదుడు. ఆయన మాటలు శివపార్వతుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. దాన్ని బయటకు కనబడనీయకుండా– "అదెలా నారద మునీంద్రా!" అన్నాడు శివుడు.

పార్వతి ప్రశ్నించకపోవడంతో ఆమె వైపు తిరిగాడు నారదుడు.

"నేనూ అదే సంశయంలో ఉన్నాను నారదా!" అంది పార్వతీదేవి.

"ఆది దంపతులారా! చెబుతాను వినండి!

ముందుగా నాయుడి సంగతి చూద్దాం. ధన సంపాదన నేరంకాదు. చతుర్విధి పురుషార్థాల్లో ఒకటి. కానీ ఇప్పుడు భూలోకంలో అందునా భారతదేశంలో ధన సంపాదన బహు తేలిక. అక్కడ ప్రజా ధనాన్ని దా(దో)చుకోవడానికి బ్యాంకింగ్ వ్యవస్థ ఉంది. ఆ బ్యాంకులు పేద ప్రజలకు పైసా విదల్చడానికి ఎన్నో అడ్డంకులు సృష్టిస్తాయి. కానీ పెద్దవాళ్ళ సేవ కొరకు తలుపులు బార్ల తెరుస్తాయి. అలాంటి బ్యాంకుల్ని పూర్తిగా ఉపయోగించాడు ఈ నాయుడు.

ఎక్కడికక్కడ ఐ.పి.లు పెట్టి బినామీ పేర్లతో షేర్లు కొన్నాడు. ఇతనికి షేర్లులేని కంపెనీ లేదంటే నమ్మండి. దేశ పరిస్థితి ఎలా ఉందంటే, ఈ షేర్ల గురించి కనీసం అవగాహన లేని ప్రజానీకం తొంభై శాతమున్నారు. వీడు మాత్రం ఆ విద్యలో ఘనాపాఠీ. దేశంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఏ సంస్కరణనైనా తన ప్రయోజనానికి వాడుకొని దాన్ని పీల్చి పిప్పిచేసి, ఆ తొక్కును జనాల్లోకి విసిరేసే జలగ వీడు. ఇవన్ని చాలక దళితులకిచ్చిన రాయితీలు, కేటాయింపులు తన దగ్గర పన్జేసే వాళ్ళ పేరు మీద మ్రింగిన పరాన్నజీవి, పొట్ట పగిలేటట్టు తిన్న మనిషికి ఆయాసం వచ్చినట్టు సంపాయించిన కోట్లు, కోట్లు ఏంచేయాలో తెలియని స్థితిలో ఆవేశం వచ్చి టి.వి. ఛానల్స్ పెట్టి భక్తిని ప్రచారం చేసాడు దేవా! ప్రజల్లో మెప్పు కోసం! చచ్చాక సద్గతి కోసం!

మనిషికి ఆధ్యాత్మికత చాలా అవసరం. ఈ క్రమంలో అన్ని సిద్ధాంతాల్లోను రెండు వర్గాలు పుట్టుకొచ్చాయి. ఒకటి తత్వవేత్తలు, రెండు భక్తులు. తత్వాలన్నీ మతాలయ్యాయి. అన్ని మతాలు మూఢత్వానికి మూల కేంద్రాలయ్యాయి. జ్ఞానులుగా కీర్తించబడుతున్న కోటయ్యలాంటి వారి పనేమిటి మహేశ్వరా! ఎప్పటికప్పుడు ఆవిష్కృతమౌతున్న తాత్వికతను మత బోధల్లో భాగం చెయ్యాలి. అబ్బే అలాంటిదేమీ చెయ్యకపోగా పాత చింతకాయపచ్చడి మళ్ళీ, మళ్ళీ వడ్డిస్తుంటారు. వాటి మీదే పాటలు పాడతారు. పద్యాలు రాస్తారు. కవితలల్లుతారు. కథలు కూర్చుతారు. లౌకిక జీవితం మాత్రం ఆధునిక సౌకర్యాలతో గడుపుతారు. వీళ్ళ కీర్తనలు ఎలా ఉంటాయో చూడండి! విష్ణువుని అలంకార ప్రియుడన్నారు. రాజుది విష్ణు అంశ అన్నారు. ఇక చూస్కోండి! రాజులు, పాలకులు, ప్రభుత్వాధినేతల దృష్టంతా అలంకరణ మీదే! సంపదలు కూడబెట్టడం మీదనే. ఆనాడు హిరణ్యాక్షుని

హస్తాల నుండి భూదేవిని సురక్షితంగా కాపాడాడు మహావిష్ణువు. కానీ ఇప్పుడు ముక్కోటి దేవతలు ఏకమైన రాజకీయ నాయకుల కబంధహస్తాల నుండి ఒక్క అంగుళం భూమిని కూడా రక్షించలేరు. విష్ణువుకి ఆస్తులు, అలంకరణలు కావాలా మహేశ్వరా! దైవతత్వంలో నిరాడంబరత, నిర్మోహత్వం ఇమిడి ఉండవా శివా! ఇక మీరు... శివుడు అభిషేక ప్రియుడన్నారు. దీని మర్మమేమిటో తెల్సా మహేశ్వరా! పాడిపంటలు సమృద్ధి అయిన నాడు, ఆ సమృద్ధిని సేవకులు, దాసీ దాసీజనం అనుభవించడం వీళ్ళకిష్టం లేకపోయింది. వాళ్ళ పొట్టలు పాలు, పెరుగులతో నిండడం చూసి ఉండలేకపోయారు. వాళ్ళ అన్నం ముద్దలు వెన్న, నెయ్యిలతో కలవడం సహించలేకపోయారు. వాళ్ళ నాలుకలు తేనెలు రుచి చూడటం కష్టమనిపించింది. అప్పుడే ఎన్నో పోషక విలువలున్న ఆహార పదార్థాల్ని మీ విగ్రహం మీద పోయడం ప్రారంభించారు. ఆ క్షణం నుండే మీరు అభిషేక ప్రియులయ్యారు. అప్పుడేదో అయ్యింది వదిలెయ్యండి... ఈనాడు ఒక ప్రక్క లక్షల మంది పేదవారు ఆకలితో అలమటిస్తుంటే, ఆ పదార్థాలన్నీ మీమీద గుమ్మరిస్తున్నారు. అది మీకిష్టమా మహేశ్వరా! అమ్మా! పార్వతీదేవీ! ఆకలి తెలిసిన అమ్మ మనసు మీది మీరు చెప్పండి! ప్రకృతి ప్రసాదించిన ఈ అమూల్య పదార్థాలను అభిషేకం పేరున నేల పాల్జేయవచ్చునా? అది మీరు సమర్థించగలరా? ఆనాడు యజ్ఞయాగాల పేరున జరిగే జీవహింస మానుకోలేదా? ఈ అమానవీయ వృథాను అరికట్టడానికి మళ్ళీ బుద్ధుడు రావాలా మహేశా! నలుగురు ఆచరిస్తున్న విషయాన్ని పదేపదే నమ్మించి మంచివాడిగా మిగిలిపోవడమా, నిష్ఠురమైనా పదిమందికి మేలు చెయ్యడమా? ఈ రెండింటిలో కోటయ్యలాంటి పండితులు, ప్రవచనకారులు చెయ్యాల్సిన పనేమిటి మహేశ్వరా? దైవం పేరున కల్పిత గాథల్ని సృష్టించడమా? సత్య సంధతను నెలకొల్పడమా? ఈ పండితుల కర్తవ్యం ఏమిటి పరమాత్మా?

ఇక దుర్గయ్య విషయం... భారతీయులు ఆదిశేషుడు భూమిని తన తలపై మోస్తున్నందుకు ఎంతో ఆరాధిస్తారు. కానీ దేశంలోని మనుషుల మలమూత్రాల్ని నెత్తినెత్తుకున్నవారిని ఛీత్కరించి అవమానించారు. అంటరానివారిగా ఊరి నుంచి బహిష్కరించారు. దుర్గయ్య ప్రపంచంలోకి ఎలా వెళ్ళాడో అలాగే తిరిగి వచ్చేసాడు. చెట్టును కొట్టలేదు. బ్యాంకుల్ని కొల్లగొట్టలేదు. ఏ భావజాలాన్ని సృష్టించలేదు. ఉన్నదాన్ని తన ప్రయోజనానికి వాడుకోలేదు. నలుగురికి ఉపయోగపడ్డాడు తప్ప

నలుగుర్ని ఉపయోగించుకోలేదు. బ్రతికినన్నాళ్ళు సమాజాన్ని శుభ్రం చేసాడు. నానా కష్టాలు పడ్డాడు. అయినా ఎవరికీ ఎదురు తిరగలేదు. ఎదురు చెప్పలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆముక్తమాల్యదలోని గోసంగి లాంటి వాడు. మహేశ్వరా! స్వర్గమన్నది భూలోకంలో మంచి పనులు చేసిన వాడికి, చెప్పేవాడికే తప్ప, నలుగుర్ని ముంచేసేవాడికి కాదు కదా! స్వర్గానికి పంపడంలో మీకేమైనా ఇతరత్రా అభిప్రాయాలుంటే చెప్పండి ఆది దంపతులారా" అని ముగించాడు నారదుడు.

"లేదు... లేదు... నువ్వు చెప్పింది అక్షరాల నిజం" అన్నారు పార్వతీ పరమేశ్వరులు.

"అయితే! ఇంకేమి... స్వర్గప్రాప్తి ప్రసాదించవలసింది దుర్గయ్యకే..." అన్నాడు నారద మహర్షి.

"తథాస్తు!" ముక్త కంఠంతో దీవించారు పార్వతీ పరమేశ్వరులు.

దుర్గయ్య స్వర్గంలో తన పవిత్రమైన పాదాల్ని మోపాడు.

# మర్రిమాను

మున్సిపల్ ఆఫీసు కాంపౌండులో ఒక పెద్ద మర్రిమానుంది. భారీ కొమ్మలతో చాలా గంభీరంగా ఉంటుంది. ఆ టౌనులో కాలనీ తర్వాత కాలనీ విస్తరించినట్టే ఆ మాను కూడా కొమ్మ తర్వాత కొమ్మను విస్తరించింది. చుట్టుప్రక్క గ్రామాల వాళ్ళు పనుల కోసం, ఉపాధి కోసం ఆ పట్టణానికి ఎలా వలస వస్తారో, ఆ మాను మీదకు కూడా రకరకాల పక్షులు, ఉడతలు మర్రి పళ్ళు తినడానికి వచ్చి వాలతాయి. పల్లెల్లోని కొంతమంది మోతుబర్లు అక్కడ సంపాదించి పట్టణాల్లో ఇన్వెస్ట్ చేసినట్టు, కొన్ని రకాల పక్షులు ఎక్కడో సంపాదించిన ఆహారాన్ని ఈ మాను మీదకు తెచ్చుకొని ఆకుల చాటున కొమ్మల మీద కూర్చొని తీరుబడిగా తింటాయి. మరికొన్నిరకాల పక్షులు గూళ్ళు కట్టుకున్నాయి. గుట్టుగా కాపురం చేసుకుంటున్నాయి. ఆ వూరు ఆ మాను స్థానికులకు నివాసం. వలసదార్లకు ఆవాసం. పెట్టుబడిదార్లకు లక్ష్మీ విలాసం.

ఆ మాను క్రిందకు బిఎమ్‌డబ్ల్యు కారు వచ్చి ఆగింది. దాంట్లోంచి ఠీవిగా దిగాడు మునిరత్నం. అతన్ని చూసి దరిదాపుల్లో ఉన్నవారంతా చుట్టూ మూగారు. కొందరు నవ్వుతూ పలకరించారు. మరికొందరు భక్తితో నమస్కరించారు. ఇంకొందరు భయంతో వొంగి వొంగి దండాలు పెట్టారు. ఇంకా కొందరు అసహ్యం తో ప్రక్కకు తప్పుకున్నారు.

పలకరించడానికి, నమస్కరించడానికి, వొంగొంగి దండాలు పెట్టడానికి కారణాలు చెప్పక్కర్లేదుగానీ, అసహ్యంతో ప్రక్కకు ఎందుకు తప్పుకున్నారో కారణం చెప్పాలి. చెప్పకపోతే ఒక పెద్ద మనిషి మీద, అందులోను బిఎమ్‌డబ్ల్యులో తిరుగుతున్న జెంటిల్మన్ మీద అభాండం వేసినట్టవుతుంది. కారణం అంటే పెద్ద కారణమేమీ కాదు. పోనీ చిన్నదా అంటే చిన్నది కాదు. తప్పొప్పుల సాంద్రత

కాలానుగుణంగా మారిపోతుంది కదా! ఎలాగంటే– ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్లు రాకముందు ఒక అమ్మాయి ఫొటో అబ్బాయి దగ్గరో, అబ్బాయి ఫొటో అమ్మాయి దగ్గరో ఉంటే అదో పెద్ద నేరంలాగ చూసేవారు. ఈ ఫొటో దగ్గర ఎందుకుందని నిలదీసేవారు. దుందుడుకు అన్నదమ్ములైతే అమ్మాయిల మీద చెయ్యి కూడా చేసుకునేవారు. అలాంటిది ఇప్పుడు చూడండి! సెల్‌ఫోన్‌లో ప్రతి ఒక్కరి దగ్గర అందరి ఫొటోలున్నాయి. రకరకాల ఫోజుల్లో ఉంటాయి. ఇదిప్పుడు తప్పుకానే కాదు. ఇంతకు మునిరత్నం చేసిందేమింటే సొంత మరదల్ని పెళ్ళి చేసుకోవడం. అదెలా తప్పయ్యిందంటే– సరాసరి మరదల్ని పెళ్ళి చేసుకొనుంటే తప్పుకాకపోయేది. మరింకేమి జరిగిందని అడిగితే, మరదల్ని ముందు మరిగి ఆ తర్వాత పెళ్ళి చేసుకున్నాడు. ఇందులో మాత్రం తప్పేముందని అడిగితే భార్య ఉండగా మరదల్ని మరిగాడు కాబట్టి అది తప్పయ్యిందంటారు. వాడికి, వాడి పెళ్ళానికి ఇష్టమైనప్పుడు నీకు బాధేంటని అన్నారనుకోండి– అప్పుడు అసలు పాయింట్ చెబుతారు ఊరి వాళ్ళు.

మరదలంటే పెళ్ళాం చెల్లెలు. అక్క కడుపుతో ఉన్నప్పుడు సాయంగా వచ్చింది. వచ్చిన పిల్ల ఎప్పుడు కనిపెట్టుకొని ఏమికావాలో చూసేది. అక్కే బావకి ఏం కావాలో చూడు అనేదట పాపం! ఆడవాళ్ళు గర్భంతో వున్నప్పుడు వాళ్ళ మనస్సులు మరింత పరిశుద్ధంగా ఉంటాయి. అనుమానానికి ఆస్కారం వుండదు. దీనికి పూర్తి భిన్నంగా ఉండడానికి ప్రయత్నిస్తుంది మగ ప్రవృత్తి. ఏది ఏమైతేనేం కాన్పు అయిన తర్వాత అక్క కాటికెళ్ళిపోయింది. చెల్లెలు కాపురానికొచ్చింది. తల్లిలేని పిల్లాడ్ని తల్లిలాగ చూసుకోవాలంటే తల్లి చెల్లెకి మించిన మనిషి దొరకదనే రీజనింగు, పెళ్ళాం పోయిన నెలరోజులకే రెండో పెళ్ళా! అని ఎవరు ప్రశ్నించకుండా చేసింది. అయితే భార్య ఒంటిమీద గాయాలు, కమిలిపోయిన ముఖం, పైకి పొడుచుకొచ్చిన కనుగుడ్లు, శవాన్ని తొందర, తొందరగా దహనం చేయడానికి పడిన ఆరాటం, హైరానా అన్నీ కలిసి చూస్తే– మరదలి కోసం మునిరత్నం పెళ్ళాన్ని చంపాడనే అభిప్రాయానికి వచ్చారు కొందరు. లేదు, లేదు– ఇద్దరి మీద అనుమానంతో ఆమెనే భర్తను పీడించేది. అదే అనుమానంతో ఉరేసుకుందని మరికొందరి కనిపించింది. "అక్కకి సరి! కాలం తీరిపోయి వెళ్ళిపోయిందని" తేల్చేసారు తాత్వికులు.

మునిరత్నం కారులోంచి దిగగానే చుట్టూ ఉన్న మనుషుల్లో ఇన్ని ఆలోచనలు ముసురుకున్నాయి. వీటన్నిటికి భిన్నంగా సామాజిక, ఆర్థిక కోణంలో ఆలోచిస్తున్న ఒకే ఒక ప్రాణి మర్రిమాను.

నిజం. మర్రిమాను ఆలోచనలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఇరవైయేళ్ళ క్రితం ఉన్న మునిరత్నాన్ని గుర్తుకు తెచ్చుకుంది. అప్పుడు మునిరత్నం సైకిల్ మీద వచ్చేవాడు.

ఒకరోజు సైకిలు చెట్టు క్రింద ఆపి జారిపోయిన చెయిన్‌ని కర్రపుల్లతో పళ్ళ చక్రాలపైకి ఎక్కిస్తున్నాడు. వెనక నుండి "అయ్యా!" అన్న పిలుపు విని వెనక్కి తిరిగి చూసాడు.

"ఏంటి ఆంధ్రయ్య" అన్నాడు మునిరత్నం.

"ఏటిలేదయ్యా! ఇంటిలో సేనా ఇబ్బందిగుంది. ఒక్క వెయ్యి రూపాయిలిస్తే, నెలకింతని ఇచ్చేస్తాను"

"ఎంతిస్తావ్"

"తవరెంతడిగితే అంత. నా కూతురు పురిటికొచ్చింది. కొడుకు కాలేజీలో జాయినవ్వాలి"

"నూటికి పదివ్వాలి. మొదటి నెల వడ్డీ ఇడుపుకొనే ఇస్తాను" అన్నాడు మునిరత్నం.

సరేనన్నాడు ఆంధ్రయ్య. ఈ ఆపద తీరిన తర్వాత చచ్చినా వీడి దగ్గర అప్పు చేయకూడదనుకున్నాడు ఆంధ్రయ్య.

బాలింత బ్రహ్మచర్యం, స్మశాన వైరాగ్యం, ఉపన్యాస ఉద్రేకం ఎక్కువకాలం నిలవ్వు. ప్రసవవేదన అనుభవించిన వాళ్ళు ఈ సంసారం వద్దురా తండ్రీ అని, అనుకుంటారు. స్మశానంలో చితిమీద కాలిపోతున్న వారిని చూసి ఎందుకింతగా ఆశపడతాం వొద్దొద్దు అని వైరాగ్యంలోకి వెళ్తారు. జనం చప్పట్లతో అనేకమైన వాగ్దానాలు చేసేస్తారు. కానీ అవేవీ ఎక్కువకాలం నిలబడవు. అలాగే ఆంధ్రయ్య కూడా ఎలాంటి ఆపదొచ్చినా ఈ మునిరత్నం దగ్గర అప్పు ఎంతమాత్రం

చెయ్యకూడదు, ఇక ఇదే ఆఖరు అని అనుకుంటాడు. కానీ స్మశాన వైరాగ్యంలా అది ఎంతోసేపు నిలబడదు. ఆదర్శం ఊపిరి అరక్షణం. అవసరం ఉనికి జీవితాంతం. పదో తారీఖు తర్వాత మళ్ళీ మామూలే!

ఐదేళ్ళయ్యేసరికి మునిరత్నం రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మర్రిమాను క్రింద ఆగింది. ఆ సమయంలోనే పారిశుధ్య పని ప్రయివేట్ పరం చేసింది ప్రభుత్వం. దాంతోపాటు పారిశుధ్య కార్మికులకున్న ప్రత్యేక సదుపాయాలు రద్దుచేసింది. దానితో బదిలీ వర్కర్లు ఏర్పాటు, రిటైరైన కార్మికుల వారసత్వ నియామకం ముఖ్యమైనవి. రిటైరైన పోస్టుల్లో నియామకం కూడా నిలుపుదల చేసింది. ఈ మార్పులన్నిటికీ మర్రిమానే మౌనసాక్షి. ఆ మాను క్రిందే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వర్కర్లకు మస్టర్ వేస్తారు. ఆ మాను నీడలోనే వర్కర్లు లంచ్ బాక్సులు తింటారు. ఆ మాను కొమ్మలకే మహిళా వర్కర్లు కూడా వచ్చిన చిన్నపిల్లల్ని ఊయల కట్టి పడుకోబెడతారు. ఆ మాను క్రిందనే గొడవలొస్తే జుట్టుజుట్టు పట్టుకొని కొట్టుకుంటారు.

ఇన్ని సంవత్సరాల పరిశీలన తర్వాత మర్రిమాను మర్చిపోలేని జీవన సూత్రం ఒకటుంది. అదేమిటంటే కాళ్ళ మీద నడిచేవాడు మోటర్‌సైకిల్ కొనే వరకు కష్టపడితే ఆ తర్వాత ఆ మోటార్‌సైకిలే వాడికి కావాల్సిన కార్లు అదే తెచ్చుకుంటుంది. మునిరత్నం విషయంలో ఈ సూత్రం అక్షరాలా ఆకృతి దాల్చింది. ఆ విషయాన్నే గుర్తుకు తెచ్చుకుంటోంది మర్రిమాను.

పారిశుధ్య పని ప్రయివేటీకరణ జరిగినప్పుడు మున్సిపాల్టీని కొన్ని జోనులుగా, జోన్లను రీచ్‌లుగా, రీచ్‌లను స్ట్రెచ్‌లుగా విభజించి, ఒక్కో స్ట్రెచ్‌లో ఎంతమంది స్వీపర్లు, డ్రైన్ క్లీనర్లు, వాళ్ళ మీద సూపర్‌వైజర్లు ఉండాలో నిర్ణయించారు. అలాగే కమ్యూనిటీ లెట్రిన్లు క్లీన్ చేయడానికి పేకేజీలు సిద్ధం చేసారు. సూపర్‌వైజర్లకు మోటార్ బైకులుండాలి. సెల్‌ఫోన్లుండాలనే నియమాలు ఏర్పాటుచేసారు.

జోన్లవారీగా టెండర్లు పిలిచారు. వాటిలో ఎక్కువ టెండర్లు మునిరత్నమే బినామీ పేర్లతో దక్కించుకున్నాడు. కానీ ఈ పనులు చేయడానికి ఇతర కులాల వాళ్ళు ముందుకురాలేదు. గూడెంకెళ్ళి మనుషుల్ని బెత్తాయించాల్సి వచ్చింది.

వాళ్ళందరికీ నాయకుడు ఉలికుంటప్ప. అతనికిద్దరు కొడుకులున్నారు. వాళ్ళకు కూడా పనిలోకి రమ్మని పిల్చారు. మీటింగెట్టుకొని చెప్తామన్నారు. ఒకరోజు ఉలికుంటప్ప మర్రిమాను క్రింద కూర్చున్నాడు. అతను రిటైరయి ఆర్నెళ్ళు అవుతుంది. అతనికింక పెన్షన్ సెటిల్ కాలేదు. అప్పుడే మునిరత్నం బులెట్ మీద వస్తున్నాడు. బులెట్ వస్తున్న శబ్దం అరకిలో మీటరు దూరం నుండే వినిపిస్తోంది. అందుకే దానికి సైలెన్సర్ తీసేశాడు. బుల్లెట్ శబ్దం వినబడగానే అప్పు తీసుకున్నాళ్ళ గుండెల్లో రాయిపడతాది. కానీ ఉలికుంటప్ప ఎప్పుడూ అతని దగ్గర అప్పు చెయ్యలేదు. కాబట్టి గుండెల్లో రాయిపడలేదు గానీ, చాలా గాబరాపడ్డాడు. దానికి కారణం రెండు రోజుల నుండి మునిరత్నం మనుషులు తనింటి చుట్టూ తిరగడమే. మునిరత్నం రాకముందే అక్కడ నుండి తప్పుకోవాలని ఆఫీసు వెనక గేటులోంచి వెళ్ళిపోవాలని గబగబా అడుగులువేసాడు. కానీ లాభం లేకపోయింది. అప్పటికే మునిరత్నం బుల్లెట్ ధడ్‌ధడ్‌మనే శబ్దంతో వచ్చేసింది. ఆ శబ్దం విని వెళ్ళిపోవడం బాగుండదని, అక్కడ నిలిచి ఉన్న ట్రాక్టర్ ప్రక్కకు వెళ్ళి మరుగు కోసమని కూర్చున్నాడు. మునిరత్నం తక్కువోడేమీ కాదు. బుల్లెట్‌ని ట్రాక్టర్ చుట్టూ త్రిప్పుకొని ఉలికుంటప్ప ముందు నిలబెట్టాడు. సూడనియ్యర్రా! మరుగు లేదూ పాడూ లేదని మునిరత్నం ముందు కొచ్చి నిలబడ్డాడు ఉలికుందప్ప.

"ఏం ఉలికుందప్పా! ఇయ్యాళ తెల్లారాక చెప్తానని తప్పించుకు తిరుగుతున్నావ్?"

"తప్పించుకునేదేలే సామీ! మావోళ్ళతో మీటింగ్ పెట్టలేదంతే"

"ఇగో ఇంత పెద్దోడివయ్యిండి అబద్దాలు జెప్పకు. మీ వోళ్ళందరితో మీటింగ్ పెట్టావు. ఆ మీటింగ్‌లో ఒక స్వీపర్‌కి నెలకు ఎంత వచ్చీదో చెప్పావు. డ్రైనేజ్ కాంట్రాక్టర్ ఇంత తక్కువిస్తే ఎవరూ పనులకెళ్ళొద్దని చెప్పావు. చెప్పావా? లేదా నిజం చెప్పు" గట్టిగా గద్దించాడు మునిరత్నం.

"అవును సామీ చెప్పాను. ఏం నేను చెప్పింది తప్పా! గవర్నమెంటు ఉద్యోగంలో ఎంత వొచ్చీది? ఇప్పుడు నువ్వెంతిస్తున్నావ్? – తేడా లెక్కలేసుకోవద్దా?"

"లెక్కలు బాగేస్తున్నారు! పని దగ్గిర ఆ లెక్కలుంటే బాగుణ్ణు"

"ఏం పనికొచ్చిన సెబ్బరేటో?"

"సెబ్బరేటో నీకు తెలీదేటి? వీధులుడిచి, కాలవలు కడిగే వాళ్ళని యూనియన్లేటిరా? బీట్లోకెళ్తే, వెళ్ళినెంటినే పన్లోకి దిగేవోర్రా? కబుర్లు, కాకరకాయలు, మీటింగులు, వెధవేషాలు- ఒకటి రెండా? గట్టిగా అడగడానికి లేదు!, సీరియస్‌గా చెప్పడానికి లేదు- శలవలు- సోకులకు సబ్బులు, నూనెలు- పండగలకు, పెళ్ళిల్లకు అడ్వాన్సులు, మెడికల్ బిల్లు- పోనీ ఇచ్చినందుకు టౌనులోని రోడ్లు ఏమైనా బాగుండేవా? ఎంతసేపు ఆ నాలుగు మెయిన్ రోడ్లు మాత్రం తళతళ మెరిసిపోయేవి! ఇప్పుడో- చూడు- లోనికెళ్ళి చూడు- ఏ గల్లీ రోడ్డు బాగులేకపోయినా చెవి జపాయించుకుంటాను" మునిరత్నం మాటలు బుల్లెట్ శబ్దాన్ని మించి వచ్చాయి. మీరు పనుల్లోకి రాకపోయిన ప్రక్క ఊరివాళ్ళతో చేయిస్తున్నాను చూస్తావా అనే ధీమా కూడా ఆ మాటల్లో ఉంది.

"నిజమేనయ్యా! అన్ని రంగాల్లో ఉన్నట్టే మాలోను  కొందరు దొంగబుద్ధి ఉన్నాళ్ళు ఉండొచ్చు. అంతమాత్రం చేత మా బతుకులు బద్దలు కొట్టేస్తారా? కొట్టేయ్యండి పర్వాలేదు. కానీ ఈదులూడిసే పని, కాల్వలో దిగే పని, లెట్రిన్లు కడిగేపని అన్ని కులాల్లోను చేసి అప్పుడు మా పొట్టల మీద కొట్టేయండి! ఏటి సామీ!

మేము రూల్ ప్రకారం పన్జెయ్యలేదని అడిగినావు. నువు రూలు ప్రకారం జీతాలిస్తన్నావా? రూలు ప్రకారం నూనెలు, సబ్బులు ఇస్తన్నవా? ఇవన్నీ మున్సిపాల్టీ నుండి నువు దొబ్బడం లేదా? మాలోని కొంతమంది గంటో, గడియో పని ఎగ్గొట్టినారు. కానీ నువు మా కూలోళ్ళకు రావాల్సినన్నీ ఎగ్గొట్టేస్తన్నావు- గవర్నమెంటులో పోరాడి మళ్ళీ మా హక్కులన్నీ పొందుతాం. మేమెవరం నీ ప్రైవేటు ప్యాకేజీలో పన్జెయ్యడానికిరాం" అంటూ ధీమాగా నడిచెల్లాడు ఉలికుంటప్ప.

వర్కర్స్ యూనియన్ లీడరైన ఉలికుంటప్పను దార్లోకి తెచ్చుకొని, గవర్నమెంటు చెప్పిన దాంట్లో సగానికి సగమే ఇచ్చి పారిశుధ్య వర్కర్ల ఇళ్ళలోని యువకులతో పన్జేయిద్దామనుకున్నాడు. అతడ్ని లొంగదీసే కార్యక్రమంలో భాగంగానే పెన్షన్ రానివ్వకుండా చేసాడు. కానీ ఉలికుంటప్ప లొంగలేదు. ప్రక్క ఊరివాళ్ళు పనులు చేస్తున్నారుగానీ డబుల్ రేట్లు అడుగుతున్నారు.

ఆ తర్వాత మరొక ఐదేళ్ళ దొర్లిపోయాయి. మునిరత్నం పారిశుధ్య ప్యాకేజీల్తో పాటు, కాంట్రాక్టులు చేసాడు. ఊరి చివర భూములు కొని ప్లాట్లు వేసాడు. ఊరి మధ్యనున్న ప్లాట్లు కొని ఫ్లాట్స్ కట్టి అమ్మేడు. ఆదాయం వచ్చే నాలుగు రకాల వ్యాపారాలు చేయడంతో నలభైరకాలుగా ఆదాయమొచ్చింది. కానీ ఉలికుంటప్ప మాత్రం పెన్షన్ అందుకోకుండానే కన్నుమూసాడు. బ్రతికినన్నాళ్ళు నాయకుల చుట్టూ, మంత్రుల చుట్టూ తిరుగుతూ బదిలీ వర్కర్ల ఫెసిలిటీ, రిటైరైన వాళ్ళ కుటుంబాల వారికి కారణ్య నియామకం చెయ్యమని విజ్ఞప్తులిచ్చుకుంటూనే వచ్చాడు. కానీ ఏదీ కార్యరూపం దాల్చలేదు. ఉలికుంటప్ప మాత్రం ఆత్మరూపం దాల్చాడు. ఉలికుంటప్ప చనిపోయిన తర్వాత ఉద్యమం నీరుగారిపోయింది. ఎవరికి వాళ్ళు వచ్చి పనుల్లో చేరిపోయారు. మునిరత్నం దయాదాక్షిణ్యాల మీదే వాళ్ళ జీవితం మొత్తం ఆధారపడే పరిస్థితి వచ్చింది.

ఉలికుంటప్ప చనిపోయిన రోజు మర్రిమాను జ్ఞాపకాల్లో పచ్చిగానే ఉంది. ఆయన పార్థివ దేహాన్ని శవయాత్ర చేస్తూ మున్సిపల్ ఆఫీసుకి తీసుకొచ్చారు. ఒక గంటసేపు తన నీడలోనే ఆ కార్మిక నాయకుడు సేదతీరాడు. మర్రిమానుకి ఆ ముఖమిప్పుడు గుర్తొస్తోంది. అన్ని పార్టీల నాయకుల వాళ్ళు పార్టీ జెండాలు కప్పిన విషయం గుర్తొస్తోంది. దాంట్లో ఎర్ర జెండా ఇంకా గుర్తొస్తోంది. ఆ మున్సిపాల్టీలోని వర్కర్లందరూ గుండెలు బాదుకొని ఏడ్చిన ఏడుపులు గుర్తొస్తున్నాయి. మర్రిమాను మేనంతా జల ధరించింది. ఒక్కసారి మర్రిపళ్ళు జలజల రాలిపడ్డాయి. చెట్టు నీడలో నిలిపిన బిఎమ్‌డబ్ల్యు బండి మీద పడ్డాయి. కారు నలుపు మీద ఎర్రని జెండాలు మొలిచినట్టున్నాయి.

మునిరత్నం కమీషనర్‌తో మాట్లాడి బయటకొచ్చాడు. ద్వారం వరకు వచ్చి సాగనంపాడు కమీషనర్. మెయిన్ ఆఫీస్‌లోని మేనేజర్, అకౌంటెంట్, క్లర్కులు అందరూ గౌరవంగా లేచి నిలబడ్డారు. ఆఫీసు నుండి కారు దగ్గరకొచ్చాడు. వెనకున్న బౌన్సర్ కారు డోర్ తెరచి పట్టుకున్నాడు. ముందు సీట్లో కూర్చోవడానికి ఒక కాలు కారులో పెట్టాడు. మరో కాలు బయటనే ఉంది. ఒక చేయి డోర్ మీద ఆన్చాడు. ఇంతలో అటువైపు వెళ్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నమస్కారం చేసాడు. లోనకు పూర్తిగా వెళ్ళబోతూ మధ్యలో ఆగి అతడ్ని విష్ చేసాడు.

అంతే! మర్రిమాను కొమ్మ ఫెళఫెళమని శబ్దం చేస్తూ విరిగిపడింది. ఆ శబ్దానికి ఒక్కసారి పైకి చూసి, ప్రమాదాన్ని పసిగట్టి టక్‌మని తల లోనకు పెట్టి, డోర్ మూసేసాడు. విరిగింది చాలా పెద్ద కొమ్మ. కారు అద్దాల్ని పగుల కొట్టుకొని ముందు సీట్లోని మునిరత్నం నుదురుని తాకింది. తల మీద గాయమైంది. కానీ ప్రాణాపాయం తప్పింది. హాస్పిటల్లో జాయినయ్యాడు. రెండు రోజుల్లో డిస్‌చార్జ్ చేస్తామన్నారు డాక్టర్లు– రెండు వారాలున్నాడు హాస్పిటల్లో.

ఖాళీగా వుండటంతో నాయకుల్ని, కులసంఘాల్ని, ప్రజల్ని పిలిపించుకున్నాడు. వచ్చే ఎలక్షన్లో పోటీ చేయబోయే తనకు ఆమాత్రం సింపతీ అవసరమే కదా!

పరామర్శల పరంపరలో ఒక భూత వైద్యుడు కూడా మునిరత్నాన్ని చూడడానికి వచ్చి... “సార్! చెట్టు కొమ్మ ఎందుకు విరిగిపడిందనే దానిమీద అన్నివిధాలా ఎంక్వయిరీ చేసాను. ఇందులో రాజకీయ కుట్రేమీలేదు. శత్రువుల పన్నాగం అస్సల్లేదు. ఉన్నదంతా ఆత్మఘోష. ఉలికుంటప్ప శవయాత్రను ఆ మర్రిమాను క్రింద కొంతసేపు ఉంచారు. దాంతో వాడి ఆత్మ ఆ మానుమీదుంది. దాని అఘాయిత్యం ఇది...” అని చెబుతూనే మునిరత్నం ముఖంలో కంగారుని పసిగట్టాడు.

“అబ్బే ఇందులో కంగారు పడాల్సిందేమీ లేదు. నేనుచూసుకుంటాను. ఒక్క ఆర్నెళ్లు అవిరామంగా జపతప హోమాలు చేయించేస్తే ఆ ప్రేతాత్మ పీడ విరగడైపోతుంది– అంతా నాకొదిలేయండి” అంటూ బయటకొచ్చి శిష్యుడితో

“ఒరే ప్రపంచంలో ఏ పని పుట్టదురా! పుట్టించాలంతే” అన్నాడు. శిష్యుడు పరమానంద భరితుడయ్యాడు.

“పారిశుధ్య కార్మికులెవరు చచ్చినా ఆ శవాల్ని మర్రిమాను క్రిందకు అనుమతించవద్దు”– తనను చూడడానికి వచ్చిన కమీషనర్‌తో చెప్పిన తర్వాత కాస్తా నిశ్చింతగా ఫీలయ్యాడు మునిరత్నం.

# కల్తీ

ఆరోజు కర్ఫ్యూ లేదు. బంద్ లేదు. ఏరకమైన శలవూ అంతకన్నా లేదు. మార్కెట్టులో షాపులన్నీ మూసేస్తున్నారు. ముఖ్యంగా కిరాణా అంగళ్ళు. స్పీడుగా జీపొచ్చి ఒక షాపుముందు ఆగింది. జీపులోంచి బిలబిలమని దిగారు ఒక ఆఫీసర్, ఒక సూపర్నెంటు, ఇద్దరు గుమస్తాలు, ఒక ప్యూను. వాళ్ళంతా కడప నుండి వచ్చారు. అప్పటికే అన్ని ఆంగళ్ళూ మూతపడ్డాయి.

ఆఫీసర్ రెండు చేతులు నడుంమీద వేసుకొని మార్కెట్టు ఈ చివరి నుండి ఆ చివరిదాకా డేగకళ్ళు సాగదీసి మరీ చూశాడు. అన్నీ మూతబడ్డాయి. తల రెండు సార్లు పంకించాడు. జీపెక్కి కూర్చున్నారందరూ! జీపు మున్సిపాల్టీ ముందు ఆగింది, "కమీషనర్ లేడా?" అడిగాడు కడప నుండి వచ్చిన ఆఫీసర్.

"కలెక్టర్ పిలిస్తే కర్నూలు మీటింగ్‌కి పొయ్యిండు" అటెండర్ జవాబిచ్చాడు.

అల్లంతదూరం నుండే ఉరుక్కుంటూ వస్తున్నాడు అమ్రుద్దీన్. మున్సిపాల్టీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్. అతణ్ని చూసి పళ్లు పటపట కొరికాడు కడపనుండి వచ్చిన ఆఫీసర్. "ఏమయా! నేను ఏ క్షణాన్నైనా వస్తానని చెప్పానుగదా? వచ్చేటైంకి ఎక్కడికి పొయ్యావయ్యా!"

"ఫ్రైడేగదాసార్? నమాజ్‌కి పోతి. చెకింగ్‌కి పోదాంపద సార్!" అన్నాడు అమ్రుద్దీన్.

"ఏం చెకింగ్! నీ బొంద చెకింగ్! అంగళ్ళన్నీ మూసేశారు. బైదిబై! నేను వస్తున్న విషయం ఎలా లీక్ అయ్యింది? కమాన్ ఆన్సర్ టు మై క్వశ్చన్!"

"నమాజ్ చేసి వస్తున్నా! నేనైతే ఎవ్వరికీ చెప్పలేదు" ఒకింత దీనంగా విన్నవించుకున్నాడు అమ్రుద్దీన్.

"సరే గతనెలలో ఎన్ని సాంపిల్స్ తీశావో చూయించు" ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రూమ్‌లోకి దారితీశాడు కడప ఆఫీసర్. అమ్రుద్దీన్ రిజిష్టర్‌లన్నీ చూపించాడు. రిజిష్టర్‌లో అన్నీ సరిగ్గానే ఉన్నాయి. మనుషులు తినే వస్తువులు కల్తీ కాకుండా నిరోధించడం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డ్యూటీ. నెలకు నాలుగు శాంపిల్స్ తీసి పరీక్షకు పంపాలి. నాలుగేం ఖర్మ అమ్రుద్దీన్ ఎనిమిది పంపించాడు. ఒక్కటి కూడా కల్తీ కాలేదని రిపోర్టు వచ్చాయి. అదే రిజిష్టర్‌లో రికార్డుచేపి చూపించాడు అమ్రుద్దీన్. దాంతో ఒళ్ళు మండిపోయింది కడప ఆఫీసర్‌కి.

"ఎందుకయ్యా మీరు ఉద్యోగాలు చేసేది? ఎనిమిది శాంపిల్స్ తీస్తే ఒక్కటీ (కల్తీ అని) రాలేదా? అంటే శాంపిల్ నువ్వు తీశావా? వాడు ఇచ్చింది నువ్వు తీసుకున్నావా? యూస్‌లెస్ ఫెలో" రిజిష్టర్ విసిరికొట్టాడు కడప ఆఫీసర్.

అమ్రుద్దీన్ ఏం మాట్లాడలేదు. దాంతో ఆఫీసర్ కోపం రెట్టింపు అయింది. "అంగళ్ళ వాళ్ళతో లాలూచీ అయిపోయి వాళ్ళేదిస్తే అది టెస్ట్‌కి పంపించేస్తారు. ఎలా వస్తాయి నెగటివ్ రిజల్ట్స్. ఇక్కడ చూస్తే అంతా కల్తీయే. మేం షడెన్‌గా వచ్చి శాంపిల్ తీయాలంటే ముందే లీక్ చేస్తారు. అంగళ్ళన్నీ మూసేశారు. ఎలా? ఏం మాట్లాడవ్?"

అమ్రుద్దీన్ మాట్లాడలేదుగానీ పరుగెత్తి పక్కగదిలోకి వెళ్లాడు. తిరిగివచ్చి ఆఫీసర్ చేతులు పట్టుకొని కాస్త దూరంగా తీసుకెళ్ళాడు. పదినిమిషాలు పట్టింది జీపు దగ్గరికి వచ్చేసరికి. జీపు ఎక్కబోతూ కడప ఆఫీసర్ అటు అమ్రుద్దీన్‌తో అన్నట్లు ఇటు తన బృందానికి చెప్పినట్లు అన్నాడు.

"నవ్వేదేస్ ఉజ్జోగాల్జేయ్యడం కష్టమై̲పోయింది. మర్చంట్స్ తెలివిమీరి పోయారు. పొలిటికల్ ఇంటర్‌ఫియరెన్స్ ఎక్కువైపోయింది. వస్తానోయ్ అమ్రుద్దీన్ యాజ్ యూజువల్‌గా నీ పని నువ్వు చేసుకొని పో. ఎవ్వరికీ బెండ్ కావద్దు. వస్తాను" ఇద్దరూ బయల్దేరారు.

ఆఫీసర్ కడప వైపు – అమ్రుద్దీన్ అంగళ్ళవైపు.

*****

ముంతాజ్ బ్యాంకులో క్లర్కు. ఆమె నోట్లన్నీ లెక్కబెట్టి కట్టలుగా చేసి రబ్బరు బ్యాండు వేస్తుంది. బ్యాంకులో కాదు ఇంట్లో. బొగ్గుల కుంపట్లో చీకులు కాల్చుకొని తింటున్నాడు భర్త. అప్పటికే నాలుగు కట్టలకు బేండు వేయడం పూర్తి చేసింది. "అందులో రెండు పక్కనపెట్టు"

"ఎందుకు చెప్తా పెట్టు"

"చెబితేనే పెట్టేది"

"మధ్యాహ్నం కడపనుండి వచ్చారుగా! తిమ్మారెడ్డి దగ్గర అప్పు తీసుకొని ఇచ్చాను. ఒక బండిల్ తిమ్మారెడ్డికివ్వాలి"

"ఏం నీ దగ్గర లేవా అప్పుడు"

"ఉన్నా ఇవ్వకూడదు. కొలీగ్స్ దగ్గర తీసుకొని ఇస్తే వచ్చిందంతా పై ఆఫీసర్లకే పెడుతున్నాడని జాలిపడతారు"

"గొప్ప తెలివే! ఇంకోటెవరికి?"

"అది కమిషనర్కు"

"పుచ్చుకోడన్నావు"

"పుచ్చుకోడు. అలాగని ఇవ్వకుండా మానెయ్యకుడదు. ఇవ్వాలి. ఇచ్చినప్పుడలా రెఫ్యూజ్ చేస్తుంటాడు. చేసినప్పుడలా తను ఎంత నిజాయితీపరుడో ఓ లెక్చరిచ్చి సంతోషపడుతుంటాడు" అన్నాడు అమ్రుద్దీన్.

లెక్క పెడుతున్నామె షడెన్గా ఆగి పోయింది. బండిల్ నుండి కొన్ని నోట్లు బయటకు తీసింది. వాటిని నిశితంగా పరిశీలించి అవి దొంగనోట్లని చెప్పింది. అమ్రుద్దీన్ తల గిర్రున తిరిగింది. కల్తీ నిరోధించే ఉద్యోగం తనది, తనకిచ్చిన నోట్లలో కల్తీయా? అమ్రుద్దీన్ ముఖం చూసి ముంతాజ్కి నవ్వాగింది కాదు.

పకపక నవ్వింది.

"ఆ నవ్వాపి డబ్బు బీరువాలో పెట్టు"

"ఇవీ?" దొంగ నోట్లని చూపిస్తూ అడిగింది.

"కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. సమయం చిక్కినప్పుడు కొడుకుల వీపు వాయిస్తా! దొంగనోట్లని చించి ఆ డ్రైనేజీలో పడెయ్!"

ముంతాజ్ కింకా నవ్వాగింది కాదు.

నవ్వుతూనే దొంగనోట్లని చించి మురికి కాలువలో పడేసింది.

***ఆదివారం వార్త, 17 జూన్ 2001***